www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 192 | మంగళవారం | 1 జనవరి, 2019

Published from: **Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

పేజీలు: 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



పచ్చదనం పెంపునకు ప్రత్యేక చర్యలు

అధికారులకు సిఎం కెసిఆర్ ఆదేశం

మన తెలంగాణ / హైదరాబాద్ : హెచ్ఎండిఏ పరిధిలో పచ్చదనం పెంపునకు సంబంధించి ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు హెచ్ఎండిఏ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి చొరవ తీసుకోవాలని సిఎం ఆదేశాలు జారీ చేశారు. దేశంలోని మెట్రో నగరాలన్ని కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ తెలంగాణలో మాత్రం ఆ పరిస్థితి తావు లేకుండా చూడాలన్నారు. ఈ నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ నగరంతో పాటు పరిసర జిల్లాల్లో కూడా విస్తృతంగా పచ్చదనాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. ఇందుకోసం ప్రత్యేక కార్యాక్రమాల నిర్వహణకు అధికారులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి నిక్కచ్చిగా అమలు చేయాలన్నారు. హైదరాబాద్ నగరంలో పాటు శివారుల్లోని ప్రజలు ప్రశాంతంగా జీవించడంతో పాటు భవిష్యత్ తరాలు కూడా సంతోషంగా జీవించేలా పెద్ద ఎత్తున మొక్కలు నాటాలన్నారు. ఇందుకోసం విస్తృత రీతిలో కార్యక్రమాలను చేపట్టాలన్నారు. హెచ్ఎండిఏ పరిధి వీలైనంత ఎక్కువగా లాంగ్ స్పేస్ ఉండేలా చర్యలు తీసు కోవాలని అధికారులకు సూచించారు. ఇందులో ప్రధానంగా వాకర్స్ క్లబ్‌ను ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతలను వారికే అప్పగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్ నుంచి మెదక్ గతంలో మాదిరిగా అటవీ ప్రాంతాలను పునరుద్ధరించాలన్నారు. ఓఆర్ఆర్ చుట్టూ, పరిసర ప్రాంతాల్లో పచ్చదనం అభివృద్ధి కోసం అటవీశాఖ అధికారులతో కలిసి సమీకృత ప్రణాళికను రూపొందించుకోవాలని అన్నారు.

హైటెక్ సిటీ అభివృద్ధిలో చంద్రబాబు కుట్ర



మనతెలంగాణ/హైదరాబాద్: హైటెక్ సిటీ అభివృద్ధి వెనుక చంద్రబాబు కుట్ర దాగి ఉందని టిఆర్ఎస్ శాసనమండలి సభ్యుడు టి.భాను ప్రసాద్ ఆరోపించారు. టిఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ హైటెక్ సిటీ పరిసరాల్లోని భూములను చంద్రబాబు తన బంధు గణం, భజన పరుల బృందాలతో కొనిపించిన అనంతరం మిగతా భూముల ధరలు పెంచుతూ ఇతరులు కొనుగోలు చేయకుండా సైబరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటిని ఏర్పాటు చేశారని నిందించారు. అవినీతి గురించి చెప్పుకోవాలంటే చంద్రబాబును ఉదహరించాలన్నారు. చంద్రబాబుకు ముందు ఆ తర్వాత జరిగిన అవనీతిని పరిశీలిస్తే చంద్రబాబుకు అవినీతిలో అవార్డు లభిస్తుందన్నారు. అలాగే శిలాఫలకాలు వేయడంలో చంద్రబాబుకు మించిన వారు దేశంలో వెతికినా కనిపించరని చెప్పారు. అయితే ఫలకాలకే బాబు పరిమితమవుతారే కానీ అభివృద్ధి చేయరని ఆరోపించారు. జాతీయ పార్టీ అని చెప్పుకునే టిడిపి ఇప్పటివరకు జాతీయ పార్టీగా గుర్తించాలని ఎన్నికల కమిషన్‌కు దరఖాస్తు చేసుకోలేదని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని టిడిపిని జాతీయపార్టీ అంటూ చంద్రబాబు ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవాచేశారు. తెలంగాణ యాస,భాషపై చంద్రబాబు విమర్శలు చేస్తే ప్రజలు సహించరని హెచ్చరించారు. ఆంధ్రపాలకులకు వ్యతిరేకంగా తెలంగాణ ఉద్యమం వచ్చిందనే విషయాన్ని మర్చిపోవద్దని బాబుకు భాను ప్రసాద్ గుర్తు చేశారు.

ద.మ. రైల్వే సిపిఆర్‌ఒకు పదోన్నతి



మన తెలంగాణ / హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఎం.ఉమాశంకర్ కుమార్‌కు రైల్ వికాస్ నిగామ్ లిమిటెడ్ జనరల్ మేనేజర్‌గా పదోన్నతి లభించింది. దీంతో ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఉమాశంకర్‌కు పదోన్నతికి లభించడంతో ఆయన స్థానంలో రాకేష్‌ను నియమించారు. గుంతకల్‌కు చెందిన రాకేష్ త్వరలో బాధ్యతలు తీసుకుంటారు. ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీర్ 1997 బ్యాచ్‌కు చెందిన ఉమాశంకర్ ఉస్మానియా యూనివర్శిటి నుంచి ఈసిఈ ఇంజనీరింగ్‌లో పట్టా పొందారు.

దైవాధీనం జగత్ సర్వం



మనతెలంగాణ / బోరబండ : భగవంతుడు అంతటా ఉన్నా... ఆ భగవంతుడు మంత్రాధీనమై ఉంటాడని, భగవంతుడిని మంత్రము ద్వారానే తెలుసుకోవాలని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు చిన జీయర్ స్వామీజి అన్నారు. నగరంలోని నందగిరి హిల్స్‌లో మైహోం అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు నివాసంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా జీయర్ స్వామీజి తన ప్రవచనాల ద్వారా భగవంతుడి గురించి శాస్త్రోక్తంగా వివరించారు. భగవంతుడిని తెలుసుకునే ఆ మంత్రం ఓ మహనీయుడి వద్ద ఉంటుందని, ఆ మంత్రాన్ని పొంది ఉన్న వ్యక్తిని బ్రహ్మవేత్త లేదా బ్రాహ్మణ అని అంటారని ఆయన వెల్లడించారు. బ్రాహ్మణ అంటేనే బ్రహ్మ అనతి. ఇతి బ్రాహ్మణ:, మంత్రాన్ని(వేదాన్ని) ఊపిరిగా చేసుకుని నిరంతరం తలచకుంటూ ఉంటాడో అతడే బ్రాహ్మణుడు యని జీయర్ స్వామీజి తెలిపారు. 'దైవాదీనం జగత్ సర్వం' ఈ జగత్ అంతా భగవంతుడికి ఆధీనమై సాగుతూ ఉంటుందని, దైవం ఎక్కడుంటుందంటే 'మంత్రాధీనంతు దైవతం' దైవమెప్పుడూ కూడా మంత్రంకు లోనుగా ఉంటుందని, 'తన్మంత్రం బ్రాహ్మణాధీనం' ఆ మంత్రం బ్రహ్మవేత్త అధీనంలో ఉంటుందని, బ్రాహ్మణో మమ దైవతం అని శాస్త్రం చెప్పుతుందని ఆయన తెలిపారు. ఆ మంత్రం ద్వారా భగవంతుడు నీకు అనుకూలంగా ఉంటాడని, భగవంతుడు ద్వారా నీకు జగత్ అంతా కూడా అనుకూలమవుతందని, జగత్ ఎప్పుడూ దేవుడు చెప్పినట్టుగానే వింటుందని ఆయన వివరించారు. భగవద్గీతలో 7వ అధ్యాయంలో ఈ జగత్‌ను రెండుగా విభజించాడని, ఒకటి చేతనంలు, రెండవది అచేతనంలు అని, ఈ రెండు చేతన, అచేతనంలు నా ఆధీనంలో ఉంటాయని భగవంతుడు ఆ అద్యాయంలో పేర్కొన్నట్టు జీయర్ స్వామీజి విశదీకరించారు. చేతనంలు అంతా ఒక సముదాయమని, దానికి పరాప్రకృతి అనిపేరు, ఇది 8 విభాగాలుగా ఉంటుందని, ఈ 8 విభాగాలుగా ఉండేది అపరాప్రకృతి, ఈ 8 విభాగాలేమిటంటే... భూమిహీ, ఆపహా, అనలహా, వాయు, ఖం, మనహా, బుద్ధియేవచా, అహంకారాచ అని ఆయన పేర్కొన్నారు. అవి ఈ పంచభూతాలు, మనస్సు బుద్ది అభిమానంలు అని జీయర్ స్వామీజి తెలిపారు.

జీవుడైనా, ప్రకృతి అయినా ఏవి స్వతంత్రంగా పని చేయదని, ఆ రెండు నేను చెప్పినట్టుగానే పనిచేస్తాయని, ఈ రెండిటిని తనకు అనుకూలంగా మలుచుకోవడం కష్టమని భగవంతుడు భగవద్గీతలో వివరించినట్టు ఆయన తెలిపారు. ఆత్మసాక్షాత్కారం పొందాలన్నా.. 'జరామరణ మోక్షాయ మాం ఆసురిత్యా యే యతంతి' నన్ను ఆశ్రయించి ప్రార్థస్తేనే నేను అనుకూలించి ఆత్మసాక్షాత్కారం చేస్తానని భగవంతుడు తెలిపాడని ఆయన వివరించారు. భగవద్గీత 13 అధ్యాయంలో భగవంతుడు 26 గుణాలను వివరించారని, అవి పాటిస్తేనే మంచి జీవితాన్ని పొందుతావని పేర్కొన్నారు. ఆచార్యోపాసనం, అమానిత్వం, అలంభిత్యం, అహింస, క్షాంతిహీ, ఆర్జవం, శౌచం వంటివాటివని, ఇందులో ఆచార్యోపాసనం చాలా ముఖ్యమైనదని జీయర్ స్వామీజి స్పష్టం చేశారు. సుఖకరమైన మార్గం మంత్రంద్వారానే చేరుకోవాలని సూచించారు. దేవుడిని చేరుకోవడానికి వేదాలను, భగవద్గీత, ఇతిహాసాలు చదువుకుంటారని, శృతిమపరే, స్మృతిమపరే, భారతమపరే, భజంతూ...అహమిహమినందం... 'ఇష్యాలిందే పరబ్రహ్మ' అని భగవంతుడు నందగోపాలుడి ముందుంటాడని జీయర్ స్వామీజి పేర్కొన్నారు. 'అహం సర్వస్య ప్రభవ: మత్తసర్వం ప్రవర్తతే' నానుండే సర్వస్వం నడుస్తున్నాయని భగవంతుడు చెప్పుకున్నాడని ఆయన వెల్లడించారు. నందగోప భవనంలో శ్రీకృష్ణుడు ఉంటాడని, నందగోపుడి వద్దకు వెళ్ళాలంటే ఆ భవనం పరిసరప్రాంతాల్లోని వారిని మచ్చిక చేసుకుని వెళ్ళాలని గోదాదేవి తెలిపినట్టు ఆయన వెల్లడించారు. '' ఆండాళ్ తిరువడిగలే శరణం.. నాయగనాయ్... నింద్రా నందగోపనుడయా .. కోయిల్ కా..ప్పానే... కుడితోంద్రుం.. తోరణ వాసెల్... కాప్పానే.. మణిక్కదవం.. తాళ్ తిరువాయీ... ఆయర్. శిరుమయరో ముక్కు.. అరయ్ పరయ్... మాయన్ మణివన్నన్ నెన్నలే.. వాయి నేందా.. తూయో మాయోవందోం.. తుయలెరప్పాడువాన్... వాయాల్ మున్నంమున్నం మాత్తాదే అమ్మా.. నీ.. నేస నిలయ్‌కదవం.. నీక్కు.. ఏలోరేంబవాయీ..'' 16 పాశురంను జియర్ స్వామీజి తెలిపారు.



నదుల పునరుజ్జీవంపై ముసాయిదా

15లోగా రూపొందించాలని అధికారులకు సిఎస్ ఆదేశం

మన తెలంగాణ/హైదరాబాద్: జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం నదుల పునరుజ్జీవంపై నిర్దిష్ట కాలపరిమితితో కూడిన ముసాయిదా కార్యాచరణను జనవరి 15లోగా రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌కె జోషి అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో నదుల పునరుజ్జీవన కమిటీ సమావేశంలో అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, మునిసిపల్ శాఖ కార్యదర్శి అరవింద్ కుమార్, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, మెట్రో వాటర్ వర్క్స్ ఎండి దానకిషోర్, పిసిబి సెక్రెటరీ సత్యనారాయణరెడ్డి, ఇపిటిఆర్ఐ డిజి కళ్యాణచక్రవర్తి, టిఎస్ ఐఐసి ఎండి వెంకట నర్సింహారెడ్డి, ఇరిగేషన్ ఇఎన్‌సి మురళీధర్‌రావు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ నదులకు సంబంధించి ఇరిగేషన్, భూగర్భ జలశాఖ, జలమండలి, పురపాలక శాఖ, పరిశ్రమలు తదితర శాఖలు జనవరి 5వ తేదీ లోగా తగు సమాచారాన్ని నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ రీసెర్చ్ ఇన్సిటిట్యూట్ (నీరి)కు అందజేయాలని అన్నారు. రాష్ట్రానికి సంబంధించి మొత్తం వాటర్ షెడ్ మ్యాప్‌ను రూపొందించాలని సూచించారు. దీర్ఘ కాలిక ప్రణాళికలో భాగంగా నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. నదుల్లో కాలుష్యానికి సంబంధించి ముఖ్యమైన స్ట్రెచెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్‌కె జోషిఆదేశించారు. రాష్ట్రానికి సంబంధించి పిసిబి ద్వారా నీటి నాణ్యత, ఇరిగేషన్ ద్వారా నీటి పరిమాణంపై అధ్యయనం చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌టిపిల నిర్మాణానికి సంబంధించి జలమండలి నోడల్ ఏజెన్సీగా వ్యవహరించాలని, దీనికి అనుగుణంగా తగు ప్రతిపాదనలు రూపొందించాలని ఎస్‌కె జోషి ఆదేశించారు. మొత్తం సీజన్‌కు సంబంధించిన మినిమం హైడ్రాలజికల్ ఎన్విరాన్‌మెంట్ ఫ్లోపై నివేదిక తయారు చేయాలన్నారు. గృహ, పారిశుద్ధ్య, భూగర్భ జలాలు, పర్యావరణ, ఎకాలజికల్ ప్రవాహాలు, వరద ప్రాంతాలు తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని నివేదిక రూపొందించాలన్నారు. మీరి ఇచ్చే ముసాయిదా నివేదికపై జనవరి 3వ వారంలో మరోసారి కమిటీ సమావేశం కావాలని నిర్ణయించారు.



హైకోర్టు రిజిస్ట్రార్‌ను కలిసిన ముఖ్యమంత్రి కెసిఆర్

రష్యాలో భారీ గ్యాస్ పేలుడు

నలుగురి మృతి


మాస్కో : రష్యాలో సోమవారం బాగా ఎత్తుగా ఉన్న ఒక నివాస భవనంలో గ్యాస్ పేలుడు దుర్ఘటనలో నలుగురు మరణించారు. దాదాపు 70 మంది గల్లంతయ్యారు. గ్యాస్ పేలుడుకు భవనంలో చాలాభాగం కుప్పకూలిపోవడంతో వందలాది మంది నిలువ నీడలేక గడ్డకట్టే చలిలో అవస్థలు పడుతున్నారు. ఉరల్ పర్వత ప్రాంతంలో మాస్కోకు తూర్పు వైపు 1700 కిలోమీటర్ల దూరంలో ఉన్న పారిశ్రామిక పట్టణం మాగ్నిటో గోర్స్క్ లో స్థానిక కాలమానం ప్రకారం ఉదయం ఆరు గంటలకు ఈ ప్రమాదం జరిగింది.

www.manatelangana.news

మన తెలంగాణ

Published from: **Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 192 | మంగళవారం | 1 జనవరి, 2019 | పేజీలు: 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



2019

ఇది తెలంగాణ నామ సంవత్సరం

కొత్త రాష్ట్రం.. కొత్త శకం

సురాజ్యం దిశగా, సాఫల్య గమ్యం దిక్కుగా దేశంలోనే తొలి అడుగులు పడి నాలుగున్నరేళ్లయింది. అన్ని విధాలా అన్ని రంగాలా సరికొత్త ఆలోచనతో, సమృద్ధి సాధన సంకల్పంతో ఇంతవరకు ఎక్కడాలేని నవ సమాజం నిర్మాణం వైపు చర్య లు మొదలయ్యాయి. అవి ఇప్పుడు ఫలితాలిస్తున్నాయి. కొన్ని పూర్తయి ప్రజలను ఆనంద స్నానం చేయిస్తున్నాయి. మరి కొన్ని పూర్తి కావస్తున్నాయి. ఇతర ఏ పాలకులకు తట్టని నవ ప్రయోగాలు ప్రజలను సంబురపరుస్తున్నాయి. ప్రత్యేక తెలంగాణ వస్తే రాష్ట్రంలో చీకటి రాజ్యం చేస్తుందని తీతువులు చెప్పిన కీడు పాడు జోస్యాలను పటాపంచలు చేస్తూ స్వరాష్ట్ర తొలి అధికార దండాన్ని చేబూనిన వెంటనే నిరంతర విద్యుత్‌ను సాధించి కెసిఆర్ తన ఘనతను చాటుకున్నారు. అలాగే వ్యవసాయానికి 24 గంటలూ కరెంటును అందుబాటులోకి తెచ్చి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు.

రైతు కష్టాలకు స్పందించి ముఖ్యమంత్రి కెసిఆర్ రూపొందించి అమల్లోకి తెచ్చిన రైతుబంధు, రైతుబంధు బీమా పథకాలమాట దేశమంతటా మార్మోగడం, కేంద్రం కూడా వీటిని అనుకరించి అమలు చేయబూనడం ఏమి చెబుతున్నాయి? పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సరిగ్గా కెసిఆర్ అమలు చేసిన మాదిరి రైతు బంధు, రైతు బీమా పథకాలను నిన్న డిసెంబర్ 31 నాడే తన రాష్ట్రంలో ప్రకటించారు. మార్గదర్శకత్వం, క్రాంత దర్శకత్వం వహించడమంటే, దారిదీపధారులు కావడమంటే ఇదే కదా, ప్రజలను కనుపాపలు చేసుకొని రెప్పల్లా కాపాడడమంటే ఇంకేమైనా ఉంటుందా, ఇలా ఒకటా, రెండా, లెక్కపెట్టగల అంకెలెవరివద్దనైనా ఉంటాయా, అనే ప్రశ్నలు ఉదయించడం లేదూ?

కడచిన ఏడాది మే నెలలో ప్రారంభించిన రైతు బంధు ద్వారా ఎకరాకు నాలుగు వేల రూపాయల చొప్పున ఖరీఫ్ పంట సీజన్‌లో 51 లక్షల మంది రైతులకు, రబీ సీజన్‌లో 50 లక్షల రైతులకు ప్రభుత్వం రూ. 10,400 కోట్లు పంట పెట్టుబడి సాయంగా పంపిణీ చేసింది. రైతు బీమా ద్వారా రాష్ట్రంలో మొత్తం 28.30 లక్షల మందికి ఉచితంగా బీమా చేయించింది. ఇప్పటివరకు చనిపోయిన సుమారు 5000 మంది కుటుంబాలకు రూ. 5 లక్షల వంతున పరిహారం అందింది. గత అక్టోబర్ నాటికి మొత్తం నాలుగేళ్లలో 13 లక్షల 36 వేల 918 మందికి రూ. 1604 కోట్ల మేరకు వృద్ధాప్య పింఛన్లు, 4 లక్షల 96 వేల 215 మందికి రూ. 893 కోట్ల వరకు దివ్యాంగ పెన్షన్లు, 14 లక్షల 40 వేల 367 మంది వితంతువులకు రూ. 1739 కోట్ల మేరకు సాయం, 62673 మంది గీత కార్మికులకు రూ. 73 కోట్లు, 37165 మంది నేత కార్మికులకు రూ. 44 కోట్లు, 4,08,635 మంది బీడీ కార్మికులకు రూ. 490 కోట్లు, 3,18,742 మంది నవ శిశు మాతలకు రూ. 404 కోట్లతో కెసిఆర్ కిట్లు, 3,43,059 మందికి రూ. 2,565 కోట్లతో కల్యాణ లక్ష్మి, 1,02,934 మందికి రూ. 622 కోట్ల నిధులతో షాదీ ముబారక్, 50 లక్షల మందికి రూ. 106 కోట్లతో కంటి వెలుగు, 1,31,195 మంది ఒంటరి మహిళలకు రూ. 157 కోట్ల చేయూత, 2001 మంది విద్యార్థులకు రూ. 329 కోట్లతో ఓవర్ సీస్ స్కాలర్ షిప్‌లు, రూ. 5,413 కోట్లతో 2కోట్ల 74 లక్షల మందికి రూపాయికే కిలో బియ్యం పంపిణీ – ఇలా ఇంకెన్నో... చెప్పుకుంటే ఈ దండ చాంతాడే. సంక్షేమం కింద ఏడాదికి సుమారు రూ. 45 వేల కోట్లు ఖర్చుపెట్టడం అసాధారణ విషయం. సంక్షేమమంటే విదిలింపు కాదు, ప్రతి ఇంటి, ప్రతి కంటి వికాసమని నిరూపించిన తొలి పాలన టిఆర్‌ఎస్‌దేనని చాటిన కెసిఆర్‌ను ఈ రాష్ట్రంలోని ప్రతి పల్లెలోని ప్రతి ఒక్కరి గుండెలో చూడొచ్చు. అందుకే అవి ముందస్తు కాదు టిఆర్‌ఎస్ బొందస్తు ఎన్నికలని శాపనార్థాలు పెట్టిన వారికి మతిపోయేలా కెసిఆర్‌కి జై... జైజై అంటూ ఓటెత్తి యావత్ తెలంగాణ ఆయనకు విజయాశీస్సులు పలికింది. అసమాన విజేతను చేసింది. రెండు వొడ్డులూ వొరుసుకునేదే నిజమైన నది. సంక్షేమంతోపాటు ప్రజల శాశ్వత సంపదను పెంచే అభివృద్ధి కూడా వేయి రేకుల పుష్పంలా వికసిస్తేనే ఏ దేశమైనా, ఏ రాష్ట్రమైనా అభ్యుదయ శిఖరాలను అందుకోగలుగుతుంది. అభివృద్ధి పథంలో టిఆర్‌ఎస్ ప్రభుత్వానిది, దాని మీద గంపెడాశలు పెట్టుకున్న తెలంగాణ ప్రజలది అసాధారణ ప్రగతి. ఇతరులెవ్వరూ సాధించని రికార్డు. రాష్ట్ర స్వీయ ఆర్థిక వనరుల వృద్ధి దేశంలో మరే రాష్ట్రంలో లేనంతగా నాలుగేళ్ళుగా సగటున 17.17%గా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 29.97% వృద్ధి సాధ్యమైంది. ప్రజల తలసరి ఆదాయం రూ. 1.12 లక్షల నుంచి రూ. 1.75 లక్షలకు చేరింది.

పంటనీరు కన్నీటిని కడతేరుస్తుంది. నేల తడి కంటి తడిని తుడుస్తుంది. భూమికి తనకు గల అనిర్వచనీయమైన, గాఢమైన సంబంధంతో ఈ సూక్ష్మాన్ని గ్రహించిన ముఖ్యమంత్రి కెసిఆర్ ఉద్యమాగ్ని దారిలో అలుపెరుగని యానం చేసి, చావునోట్లో తల పెట్టి తాను సాధించుకున్న తన తల్లితెలంగాణ ఇంకెంత కాలం గుండె ఎండిపోయే దుస్థితిలో కొనసాగకుండా చూడాలని దృఢ సంకల్పం వహించారు. ఈ రంగానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చారు. నదులకు ముగుతాడు వేసి నేల నెరియల్లోకి మళ్లించే మహా యజ్ఞానికి

పి. అంజయ్య
ఎడిటర్

తరువాయి 4లో

కొత్త రాష్ట్రం కొత్త శకం

సంపాదకీయం

శ్రీకారం చుట్టారు. అనతి కాలంలోనే అఖండ విజయాలు సాధించారు.


గత నాలుగున్నరేళ్లలో నీటి పారుదలకు రూ. 92, 128 కోట్లు కేటాయించి ప్ర'జల' చంద్రశేఖర రావు అనిపించుకున్నారు. ఇందులో అనేక రికార్డుల మేటి గడ్డ కాళేశ్వరం ప్రాజెక్టు సహా మొత్తం ప్రాజెక్టులకు రూ. 60 వేల కోట్లు ఖర్చు పెట్టారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణం చేసే మహా లక్ష్యం వైపు అడుగులు వడివడిగా పడుతున్నాయి. న్యాయాది వివాదాల అడ్డంకులను ఎవరు ఎన్నింటిని సృష్టించినా ప్రజల అండదండలతో అవిఘ్నంగా సాగిపోతున్న ఇరిగేషన్ మహా క్రతువు కెసిఆర్‌ను అలుపెరుగని జల సోమయాజిని చేసింది. నాలుగున్నరేళ్లలో చేపట్టిన కొత్త సాగునీటి ప్రాజెక్టులతో అదనంగా 11.91 లక్షల ఎకరాల ఆయకట్టు ఆవిష్కృతమైంది. 14.98 లక్షల ఎకరాల స్థిరీకరణ జరిగింది. మిషన్ కాకతీయ ద్వారా మరి 12.47 లక్షల ఎకరాల స్థిరీకరణ జరిగింది. 2004 నుంచి సాగిన పదేళ్ల కాంగ్రెస్ పాలనలో కేవలం 5.71 లక్షల ఎకరాలకే సాగునీటి కల్పన జరగ్గా గత నాలుగున్నరేళ్ల పాలనలో టిఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు 12 లక్షల ఎకరాలను జలింపచేయడం గమనార్హం. భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అగ్ర తాంబూలం ఇచ్చి సముద్రంలో వృథాగా కలిసిపోతున్న నదుల నీటిని సద్వినియోగంలోకి తీసుకు వచ్చే విషయంలో కెసిఆర్ దేశానికే అడుగుజాడ అయ్యారు. రాష్ట్రంలో ధాన్య లక్ష్మి స్థిర నివాసమేర్పరచుకుని నిరంతరంగా సస్యనాట్యం చేస్తున్న సంగతి వరి దిగుబడిని చూస్తే తెలుస్తుంది. 2018 డిసెంబర్ నాటికి గత ఏడాది రాష్ట్రంలో వరి 204.77 లక్షల టన్నులు పండింది. తీవ్ర వర్షాభావానికి ఎదురీదుతూ చెమట ముత్యాలతో ధాన్య రత్నాలు పొదుగుతున్న రైతుకు కెసిఆర్ కొండంత అండగా నిలవడం వల్లే ఇది సుసాధ్యమవుతున్నది.

మంచి నీటికి కూడా కటకటలాడే, ఆడపడుచులు బిందెలు భుజాన పెట్టుకొని మైళ్లకు మైళ్లు నడిచి కన్నీళ్లు నింపుకొని వచ్చే అధ్వాన స్థితి నుంచి రాష్ట్రాన్ని ఇంటింటి గంగగా మార్చడానికి దేశంలో ఇంకెక్కడాలేని విధంగా మిషన్ భగీరథను చేపట్టారు. ప్రస్తుత టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మంత్రిగా ఉన్నప్పుడే ఈ బాధ్యతను భుజాన వేసుకొని విజయవంతంగా గమ్యానికి చేర్చారు. రాష్ట్రంలోని 24,225 ఆవాసాల్లోని 65.29 లక్షల కుటుంబాల (2.72 కోట్ల మంది) కు రక్షిత మంచినీటిని అందించే లక్ష్యంతో రూ.43,791 కోట్లతో చేపట్టిన ఈ పథకం కింద ఇంతవరకు సుమారు 24 వేల ఆవాసాలకు నీరు చేరింది. వచ్చే మార్చి 31 కల్లా ప్రతి ఇంటికి నల్లాల ద్వారా నీరు అందుతుంది.

కెటిఆర్ అసమాన అనితర సారథ్యంలో ఐటి రంగం విశేష ప్రగతిని చూరగొన్నది. దేశంలోనే తొలిసారిగా ఇన్‌క్యుబేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. టి–హబ్ సదుపాయాన్ని కల్పించారు. దీని ద్వారా రెండేళ్లలోనే 350 స్టార్టప్ కంపెనీలు వచ్చాయి. దేశంలో మొదటిసారిగా మహిళా పారిశ్రామికవేత్తల కోసం 'వి – హబ్'ను నెలకొల్పారు. దేశంలో ఎక్కడాలేని మరొక జనహిత కార్యక్రమం కంటి వెలుగు. లక్షలాది మందికి కంటి పరీక్షలు జరిపించడంతోపాటు అవసరమైతే శస్త్ర చికిత్సలు చేయించి కళ్లద్దాలిచ్చి చూపులను ప్రసాదిస్తున్న ఈ కార్యక్రమం విశేష జనాదరణ పొందింది. ఇకముందు ప్రజల వ్యక్తిగత ఆరోగ్య పటాన్ని (హెల్త్ ప్రొఫైల్) సేకరించి మరో నూతన ప్రయోగాన్ని చేపట్టడానికి కెసిఆర్ ప్రభుత్వం సిద్ధమవుతున్నది. ఆ విధంగా ఆరోగ్య తెలంగాణను తీర్చిదిద్దనున్నది. రెండోసారి అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి కెసిఆర్ ఇరిగేషన్, విద్య, వైద్య, ఆహార శుద్ధి, గ్రామీణ వ్యవసాయ పరిశ్రమలకు ప్రాధాన్యాన్నిచ్చి వరుస సమీక్షలు చేపట్టారు. ప్రజలకి ముందుగా చేయాల్సిన సేవలను గమనించి వాటిని నెరవేర్చే వైపు చర్యలు తీసుకోడం ద్వారా ఆదర్శ తెలంగాణ నిర్మాణాన్ని ఆయన సాగిస్తున్నారు. దీనిని దేశమంతా గమనిస్తున్నది. తెలంగాణను ఆదర్శంగా తీసుకుంటున్నది.

స్వరాష్ట్రాన్ని ప్రగతి వెలుగుల మేడగా తీర్చిదిద్దుతున్నందుకే కెసిఆర్‌కు, ఆయన సారథ్యంలోని టిఆర్ఎస్‌కు జేజేలు పలికి ప్రజలు మరోసారి మహా విజయాన్ని కట్టబెట్టారు. ఈ తిరుగులేని జనాదేశంతో దేదీప్యమాన తెలంగాణ నిర్మాణంలో ఆయన ఎదురులేని మలి అడుగు వేసి రాష్ట్రాన్ని ప్రపంచంలోనే అగ్రగామిని చేస్తారని ఆశిస్తూ తెలంగాణ నామ సంవత్సరంగా కొత్త ఏడాదిని (2019ని) సమధికోత్సాహంతో జరుపుకొందాం.

పాఠశాల విద్యకు నోచుకోని ఊళ్లు



దేశంలోని దాదాపు 14 శాతం గ్రామాలకు పాఠశాలలు లేవు. కొన్ని రాష్ట్రాల్లో అయితే 15 శాతం గ్రామాల్లో పాఠశాలలు లేవు. ఇది గ్రామీణాభివృద్ధి శాఖ తెలియజేసిన సమాచారం. అంత్యోదయ కార్యక్రమానికి సంబంధించి సేకరించిన సమాచారం ప్రకారం తెలిసిన మరో వాస్తవమేమంటే, 47 శాతం గ్రామాల్లో ప్రాథమిక స్థాయి స్కూలు మాత్రమే ఉంది. అంతకు మించి చదవాలంటే స్కూలు లేదు. దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సంబంధించి పౌరసదుపాయాల సమగ్ర సమాచారం ఇప్పుడు అందుబాటులో ఉంది. 5,27,507 గ్రామాలు, 2.3 లక్షల గ్రామపంచాయతీల సమాచారం పరిశీలిస్తే, అందులో 75,613 గ్రామాలు అంటే 14.33 శాతం గ్రామాల్లో అస్సలు స్కూలన్నదే లేదు. ఎనిమిదవ తరగతి వరకు చదువుకోడానికి స్కూలు సదుపాయం ఉన్న గ్రామాలు కేవలం 21 శాతం. హైస్కూలు అంటే 10వ తరగతి వరకు చదువుకునే సదుపాయం ఉన్న గ్రామాలు కేవలం 11 శాతం, ఇక సీనియర్ సెకండరీ అంటే మన ఇంటర్మీడియట్ స్థాయి చదువుకు అవకాశం ఉన్న గ్రామాలు కేవలం 6.57 శాతం. ఇదీ గ్రామీణ ప్రాంతాల్లో చదువుల పరిస్థితి.

అనుకున్న లక్ష్యాల ప్రకారం అభివృద్ధి సాధించడానికి, వివిధ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి, ఈ కార్యక్రమాల్లో లోపాలను తొలగించడానికి గ్రామీణాభివృద్ధి శాఖ ఈ సమాచారం సేకరించింది. పది రాష్ట్రాలు ఉత్తర ప్రదేశ్, పశ్చిమబెంగాల్, జార్ఖండ్, బీహార్, మణిపూర్, గోవా, ఒడిశా, ఉత్తరాఖండ్, అరుణాచల్‌ప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఈ రాష్ట్రాల్లో 15 శాతం గ్రామాల్లో ఒక్క స్కూలు కూడా లేదు. మిజోరం, కేరళ, గుజరాత్ రాష్ట్రాల్లో 2 శాతం కన్నా తక్కువ గ్రామాల్లో మాత్రమే స్కూళ్ళు లేవు.

చూపు

ఉన్నత విద్య విషయంలో కూడా కేరళ గొప్ప ప్రగతి సాధించింది. కేరళలో 80 శాతానికి మించిన గ్రామాల్లో సీనియర్ సెకండరీ అంటే మన ఇంటర్మీడియట్ స్థాయి విద్యాలయాలున్నాయి. సీనియర్ సెకండరీ స్థాయిలో నాగాలాండ్, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల పనితీరు చాలా నిరాశాజనకంగా ఉంది. ఒడిశాలో కేవలం 1.7 గ్రామాల్లోను, నాగాలాండ్‌లో కేవలం 1.8 శాతం గ్రామాల్లోను, జార్ఖండ్‌లో కేవలం 2.1 శాతం గ్రామాల్లోను సీనియర్ సెకండరీ విద్యాలయాలున్నాయి. అయితే ఈ డాటా కేవలం గ్రామాలకు సంబంధించింది మాత్రమేనని, గ్రామపంచాయతీ స్థాయికి సంబంధించిన డాటా కాదని అధికారులు అంటున్నారు. ఒక గ్రామపంచాయతి క్రింద అనేక గ్రామాలు ఉంటాయి. గ్రామ పంచాయతీ స్థాయలో డాటా సేకరించడం ఇంకా జరగలేదు. 14 శాతం గ్రామాల్లో స్కూళ్ళు లేవన్నది నిజమే అయినా, బహుశా దగ్గరలోని గ్రామంలో స్కూలు ఉండొచ్చు. అంటే స్కూలుకు వెళ్ళడం కష్టమేమీ కాదని అనుకోవాలి. జాతీయ నమూనా సేకరణ 2014 ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 94 శాతం కుటుంబాలు ప్రాథమిక విద్యావసతి అందుబాటులో ఉందని చెప్పారు. అంటే, కిలోమీటరు దూరంలో వారికి ప్రాథమిక పాఠశాల అందుబాటులో ఉంది. అయితే ఈ డాటా ప్రకారం హైస్కూలు విద్య అందుబాటులో లేదు. గ్రామీణ ప్రాంతాల్లో హైస్కూలు విద్య కోసం చాలా దూరం వెళ్ళవలసివస్తోంది. ఈ వాస్తవాన్నే ఇప్పుడు గ్రామీణాభివృద్ధి శాఖ సేకరించిన సమాచారం కూడా ధ్రువీకరిస్తోంది.

కేంద్రప్రభుత్వం ప్రారంభించిన సర్వశిక్షా అభియాన్ కార్యక్రమం ప్రాథమిక విద్యను అందరికీ అందుబాటులో తీసుకువచ్చే లక్ష్యంతో ప్రారంభించారు. అది కూడా నిర్దిష్ట కాలపరిమితి లక్ష్యంగా పనిచేసే కార్యక్రమం. భారత రాజ్యాంగం నిర్దేశించిన ప్రకారం 6 నుంచి 14 సంవత్సరాల పిల్లలకు తప్పనిసరిగా నిర్బంధ ఉచిత విద్య బోధించడానికి ఉద్దేశించిన కార్యక్రమం. కాని ఈ లక్ష్యం నెరవేరుతుందా? 14 శాతం గ్రామాల్లో స్కూలు లేకపోతే దగ్గరలో ఉన్న స్కూలుకు వెళ్ళే అవకాశం ఉన్నప్పుడు అక్షరాస్యత శాతం ఎందుకు పెరగడం లేదన్న ప్రశ్న ముందుకు వస్తోంది.

స్కూలు విద్యకు సంబంధించి మరో విషయమేమంటే, దేశంలోని ప్రయివేటు స్కూళ్ళలో దాదాపు 20 లక్షల సీట్లు ఆర్థికంగా బలహీన వర్గాలకు రిజర్వు చేయబడ్డాయి. కాని అందులో కేవలం 20 శాతం సీట్లు మాత్రమే ఇస్తున్నారు. ఇండస్ యాక్షన్ అనే స్వచ్ఛంద సంస్థ ఈ విషయాన్ని తెలియజేసింది. విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం ప్రయివేటు, అన్ ఎయిడెడ్ స్కూళ్ళలో 25 శాతం సీట్లు ఆర్థికంగా బలహీనవర్గాల పిల్లలకు ఇవ్వాలి. కాని ఈ విషయాన్ని ఈ స్కూళ్ల యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వాలు కూడా శ్రద్ధ తీసుకోవడం లేదు. ఢిల్లీ, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో పరిస్థితి మెరుగ్గా ఉంది, కాని మిగిలిన రాష్ట్రాల్లో ఈ విషయం గురించి అవగాహన కూడా లేదు. 2013– 14 సంవత్సరంలో మొత్తం 5.1 లక్షల ప్రవేశాలు జరిగాయి. ఆ సంవత్సరం కాస్త ఈ చట్టం పట్ల శ్రద్ధ చూపించారు. కాని తర్వాతి సంవత్సరం 4.8 లక్షలకు తగ్గిపోయాయి. మళ్ళీ 2015–16లో 6 లక్షలకు ప్రవేశాలు పెరిగాయి. తర్వాతి సంవత్సరం 4.3 లక్షల ప్రవేశాలకు పడిపోయాయి. ఆర్థికంగా బలహీనవర్గాల పిల్లలు ఈ స్కూళ్ళలో ప్రవేశాలు పొందడం లేదంటే చాలా కారణాలున్నాయి. చాలా మందికి ఈ విషయమై అవగాహన లేదు.

ప్రయివేటు స్కూళ్ళు కూడా ఈ విషయం చెప్పడం లేదు. బలహీనవర్గాల పిల్లలు ఇతర పిల్లలతో కలిసి చదవడం వల్ల ఇబ్బందికరంగా ఉంటుందని భావించే స్కూలు యాజమాన్యాలు కూడా ఉన్నాయి. తల్లిదండ్రులకు కూడా తమ పిల్లలను ప్రయివేటు స్కూళ్లలో వేయవచ్చని తెలియదు. అందువల్ల ప్రభుత్వ స్కూళ్ళకే పంపిస్తుంటారు. ఇండస్ యాక్సన్ వంటి సంస్థలు ఇప్పుడు ఈ విషయమై అవగాహన పెంచడానికి ప్రయత్నిస్తున్నాయి. ప్రయివేటు స్కూలు యాజమాన్యాలు బలహీనవర్గాల పిల్లలను చేర్చుకోడానికి ఇష్టపడకపోవడం ఒక కారణమైతే, ప్రభుత్వ స్కూళ్ళలో ప్రవేశాలు తగ్గిపోతాయన్న భయంతో ప్రయివేటు స్కూళ్ళకు ఈ విషయమై స్వేచ్ఛ ఇవ్వడం కూడా జరుగుతోంది.

బలహీనవర్గాల పిల్లలకు ప్రయివేటు స్కూళ్ళలో రిజర్వేషన్ కేటగిరిలో సీటు లభించకపోడానికి మరో కారణం మామూలు పద్ధతిలో తమ పిల్లలకు సీటు లభించని తల్లిదండ్రులు ఆర్థికంగా బలహీన వర్గం కాకపోయినా ఈ కేటగిరీ క్రింద సీటు సంపాదించుకోడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఢిల్లీ వంటి పట్టణాల్లో నర్సరీ ప్రవేశాలు చాలా కష్టంగా మారాయి. ఇటీవల ఢిల్లీలో ఒక వ్యక్తి తన కుమారుడికి ఒక ప్రతిష్ఠాత్మకమైన ప్రయివేటు స్కూలులో ప్రవేశం సంపాదించడానికి ఆర్థికంగా బలహీనవర్గం క్రింద దొంగ పత్రాలు సమర్పించినందుకు అరెస్టయ్యాడు. పట్టణ ప్రాంతాల్లో బలహీనవర్గాలకు లభించవలసిన రిజర్వుడు సీట్లు ప్రయివేటు స్కూళ్ళల్లో లభించడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో బలహీనవర్గాలు పిల్లలను దూరం పంపించి చదివించడం సాధ్యం కావడం లేదు. అక్కడ స్కూళ్ళ కొరత ఉంది. దేశంలోని విద్యా వ్యవస్థకు సంబంధించిన ఈ సమస్యలు పరిష్కారం కాకపోతే అభివృద్ధి పూర్తిగా కుంటుపడుతుంది.

* సబా

ప్రజానాడి: విఫలమైన మీడియా



ఇలపావులూరి
మురళీమోహన రావు
8143318849

రెండువారాల క్రితం తెలంగాణ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా అధికారపగ్గాలు చేబూనిన టీఆరెస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు మలిసారి కూడా దిగ్విజయుడై ప్రజామోదాన్ని పొందారు. ప్రతిపక్షాలు, కొన్ని పత్రికలు ఎంత దుష్ప్రచారం చేసినా కేసీఆర్ విజయాన్ని అడ్డుకోలేకపోయారు. కేసీఆర్ సాధించింది మామూలు విజయం కాదు.. ఊహాతీతమైన విజయం.

ఎన్నికలు మరో రెండు రోజుల్లో జరగబోతున్నాయి అనగా ఒక మాయా సర్వేశ్వరుడు మహాకూటమి గెలవబోతున్నదని, టీఆరెస్‌కు పాతిక సీట్లు రావడమే గగనం అని చిలకజోస్యాలు చెప్పి ఓటర్లను ప్రభావితం చెయ్యాలని కుట్ర చేశారు. ఇక కూటమికి పెట్టుబడిదారుడు చంద్రబాబు వేల కోట్ల రూపాయల వరదను తెలంగాణాలో పారించాడు. ఇక కాంగ్రెస్ పార్టీలో డజను మంది ముఖ్యమంత్రులు తయారయ్యారు. బహుశా.. కేసీఆర్‌కు జరిగినంత వ్యతిరేక ప్రచారం గతంలో ఏ ముఖ్యమంత్రికీ జరిగి ఉండదు. ఇంత దుష్ప్రచారం జరిగినా, కేసీఆర్ మీదున్న అమితమైన విశ్వాసంతో భవిష్యత్తులో మరే పార్టీ అందుకోనంత అసాధారణవిజయాన్ని టీఆరెస్ పార్టీకి ప్రజలు కట్టబెట్టారు.

అయితే, ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... ఈ ఘనవిజయాన్ని మన మీడియా అతి తేలిక భావంతో తీసుకోవడం! అధికారపార్టీకి మరుసటి ఎన్నికల్లో ఎంతో కొంత వ్యతిరేకత పొటమరించడం, గెలిచినప్పటికీ సీట్లు తగ్గడం సర్వసాధారణం. కానీ, టీఆరెస్ మాత్రం గత ఎన్నికల కన్నా, ఇరవై అయిదు సీట్లు ఎక్కువ సాధించింది! ఈ విజయం పట్ల మన మీడియాలో అసలు చర్చ లు జరగలేదు. విశ్లేషణలు జరగలేదు. అనూహ్యమైన విజయానికి కారణాలు శోధించబడలేదు. మేధావులు, రాజకీయపండితులు టీవీల్లో కూర్చుని ఎలా సాధ్యం అయింది అని అన్వేషించలేదు! తొమ్మిదినెలలు ముందుగానే శాసనసభను రద్దు చేసి, ఎన్నికలను ఎదుర్కోవడానికి సిద్ధపడిన కేసీఆర్ ధైర్యసాహసాలకు హేతువులను చర్చించలేదు. వందసీట్లను గెలుస్తాము అని కేసీఆర్ ఏ ధీమాతో ప్రకటించారు? కొందరు సిట్టింగ్ సభ్యుల మీద వ్యతిరేకత ఉన్నప్పటికీ, వారందరికీ టికెట్స్ ఇవ్వడంలో కేసీఆర్ చూపిన తెగువను తర్కించలేదు.

ఇదే గనుక మహాకూటమి విజయం సాధించి ఉన్నట్లయితే మన మీడియా ఎలా చెలరేగిపోయేది! రాహుల్ గాంధీ నాయకత్వ ప్రతిభ, చంద్రబాబు చాణక్యం, కేసీఆర్ నియంతృత్వం, కేటీఆర్ అహంకారం, కుటుంబపెత్తనం అంటూ ఇరవైనాలుగు గంటలూ చర్చోపచర్చలు చేసేవి. ఎక్కడెక్కడి తెలివితక్కువ సన్నాసులు, కులగజ్జి గాళ్ళు, భజనపరులు అన్ని ఛానెల్స్‌లో కూర్చుని చంద్రబాబు సమర్థతను ఆకాశానికి ఎత్తేసేవారు. చంద్రబాబు తలచుకుంటే మోడీని కూడా మూడు నిముషాల్లో దించేయగలడు అని ముక్తాయింపులు పలికేవి. అలాగే తెలంగాణాలో కూడా తెలుగుదేశం బలంగా ఉన్నదని, 2023 లో లోకేష్ నాయుడు తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యే అవకాశం కూడా ఉన్నదని విశ్లేషణలు సాగించేవి. తెలుగుమీడియా ఎంతటి బానిసత్వంలో మగ్గిపోతున్నదో రుజువు అయింది.

ఇక్కడ ఒక ఉదాహరణను చెప్పుకోవాలి. 2004 లో సమైక్య రాష్ట్రంలో ఎన్నికలు జరిగినపుడు ఫలితాలు రాకముందే...చంద్రబాబు అఖండమైన మెజారిటీతో గెలిచినట్లు,దిగ్విజయం సాధించినట్లు ఒక ప్రముఖ ఉషోదయ దినపత్రిక అందరికంటే ముందుగా చంద్రబాబు విజయ వార్తలను అందించాలని, ఉదయం పది గంటలలోపే లక్షలాది కాపీలను ముద్రించేసి సిద్ధం చేసింది. కానీ, పదకొండు గంటలకల్లా, కాంగ్రెస్ గెలుపు బోధపడగానే, ఆ లక్షల ప్రతులను తగలబెట్టింది! ఇంత ఘోరంగా ఉన్నాయి మన తెలుగు పత్రికలు!

ఇక కేసీఆర్ దుర్నిరీక్ష్య విజయానికి కారణాలు ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన పనిలేదు. 2014 లో పాలనాపగ్గాలు చేబట్టిన క్షణం నుంచి అవినీతిని నియంత్రించి, అభివృద్ధిపథాన్ని అనుసరించారు. ఉప ముఖ్యమంత్రి మీద స్వల్ప ఆరోపణలు రాగానే ఆ నాయకుడిని పదవినుంచి తొలగించి తన వైఖరి ఎలా ఉండబోతుందో పార్టీ నాయకులకు స్పష్టం చేశారు. ఎనభైవేలకోట్ల రూపాయల మహావ్యయాన్ని ఏమాత్రం లెక్క చెయ్యకుండా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే కాళేశ్వరం ప్రాజెక్టును ప్రారంభించి అందరిని ఆశ్చర్యచకితులను చేశారు.

సీతారామసాగర్ ను పూర్తి చేసి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పనులను పూర్తిచేసి అపర భగీరథుడు అనిపించుకున్నారు. రైతులపాలిటి ప్రసాదంగా భావించే రైతుబంధు పథకాన్ని ప్రారంభించి ఏటా ఎకరానికి ఎనిమిదివేల రూపాయల పంటసాయాన్ని అందించి రైతులకు ఆత్మబంధువు అనిపించుకున్నారు. నిజానికి రుణమాఫీ కన్నా, రైతుబంధు పథకం కింద ధనసాయం చెయ్యడం ఎంతో ఉత్తమమైన కార్యక్రమం అని ఇటీవలే ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్ వ్యాఖ్యానించారంటే కేసీఆర్ ముందు చూపు ఎంత గొప్పదో అర్థం అవుతుంది.

ఇక వృద్ధులకు నెలజీతాలు ఇచ్చినట్లు పింఛన్ సౌకర్యాన్ని కలిగించారు. కల్యాణలక్ష్మి , షాదీ ముబారక్ పథకాలను ప్రారంభించి మేజర్లు అయిన ఆడపిల్లలకు లక్షరూపాయల ఆర్థికసాయాన్ని వివాహ కానుకగా అందించారు. ఈ పథకం కారణంగా తెలంగాణాలో బాల్యవివాహాలు చాలావరకు తగ్గాయని ఇటీవలే జాతీయ మీడియా ప్రశంసించింది. నగరాలకే కాక, గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇరవైనాలుగు గంటలూ విద్యుత్ అందించడం వర్తమానకాలంలో ఒక అద్భుతంగా చెప్పుకోవచ్చు. దీని కారణంగా రైతులు అర్ధరాత్రుళ్ల పొలాలకు వెళ్లే అవసరం లేకుండా పోయింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా నాలుగువందల సంక్షేమ పథకాలు తెలంగాణాలో అమలు జరిగాయంటే ఇక ప్రజాభిమానం గూర్చి శంకించాల్సిన అవసరం ఏముంది?

ప్రజల మనస్సులో నిక్షిప్తమై ఉన్న కేసీఆర్ పట్ల ద్విగుణీకృతమైన అభిమానాన్ని అంచనా వెయ్యడంలో ప్రతిపక్ష పార్టీలే కాదు... మన మీడియా కూడా విఫలమైందని మొన్నటి ఎన్నికల ఫలితాలు రుజువు చేశాయి. విఫలమయ్యిందో, బానిసత్వానికి లోబడిందో మీడియా అంతరాత్మలకే తెలుసు. ఇకనైనా ప్రజలనాడిని పసిగట్టేటపుడు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తే మీడియా విశ్వసనీయత నిలబడుతుంది. లేదంటే ప్రజల దృష్టిలో పరిహాసాస్పదం అవుతుంది.

ఎన్నికలు మరో రెండు రోజుల్లో జరగబోతున్నాయి అనగా ఒక మాయా సర్వేశ్వరుడు మహాకూటమి గెలవబోతున్నదని, టీఆరెస్‌కు పాతిక సీట్లు రావడమే గగనం అని చిలక జోస్యాలు చెప్పి ఓటర్లను ప్రభావితం చెయ్యాలని కుట్ర చేశారు. ఇక కూటమికి పెట్టుబడిదారుడు చంద్రబాబు వేల కోట్ల రూపాయల వరదను తెలంగాణాలో పారించాడు. ఇక కాంగ్రెస్ పార్టీలో డజను మంది ముఖ్యమంత్రులు తయారయ్యారు. బహుశా.. కేసీఆర్‌కు జరిగినంత వ్యతిరేక ప్రచారం గతంలో ఏ ముఖ్యమంత్రికి జరిగి ఉండదు. ఇంత దుష్ప్రచారం జరిగినా, కేసీఆర్ మీదున్న అమితమైన విశ్వాసంతో భవిష్యత్తులో మరే పార్టీ అందుకోనంత అసాధారణవిజయాన్ని టీఆరెస్ పార్టీకి ప్రజలు కట్టబెట్టారు. అయితే, ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... ఈ ఘన విజయాన్ని మన మీడియా అతి తేలిక భావంతో తీసుకోవడం! అధికారపార్టీకి మరుసటి ఎన్నికల్లో ఎంతో కొంత వ్యతిరేకత పొటమరించడం, గెలిచినప్పటికీ సీట్లు తగ్గడం సర్వసాధారణం. కానీ, టీఆరెస్ మాత్రం గత ఎన్నికల కన్నా, ఇరవై అయిదు సీట్లు ఎక్కువ సాధించింది!

ఈ పేజీకి రచనలు పంపవలసిన మెయిల్ : editor@manatelangana.org

న్యాయదేవత విజయీభవ..!



ఎస్. కిశోర్ కుమార్
9866399219

పౌరుడు తన న్యాయం కోసం న్యాయదేవతను ఆశ్రయించటం పరిపాటి. కాని ఈ దేశంలో సాక్షాత్తు న్యాయదేవత కూడా న్యాయం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. న్యాయదేవతకు జరగాల్సిన న్యాయం కోసం గత నాలుగన్నర సంవత్సరాలుగా కేంద్రంపై అలుపెరగని పోరాటం చేసి చివరకు విజయం సాధించింది తెలంగాణ ప్రజా ప్రభుత్వం. దేశ పౌరుడికి స్ఫూర్తిగా నిలిచింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగి నాలుగున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 పూర్తిగా అమలుకు నోచుకోలేదు. ముఖ్యంగా ఈ చట్టం ప్రకారం ఏర్పడిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలకు ప్రత్యేక హైకోర్టులు ఏర్పాటు చేయాలి. పైగా, రాజ్యాంగంలోని ఆర్టికల్ 214 ప్రకారం చూసినప్పటికీ దేశంలోని ప్రతి రాష్ట్రానికి ఒక ప్రత్యేక హైకోర్టు ఉండాలి. అయితే రాజ్యాంగం కల్పించిన ఈ హక్కును రాష్ట్రానికి ప్రసాదించడానికి కేంద్ర ప్రభుత్వం నాలుగున్నర సంవత్సరాలుగా తాత్సారం చేసింది. చివరకు సుప్రీంకోర్టు నుండి తాఖీదులు వస్తే గాని స్పందించలేదు.

తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ న్యాయవాదులు, తెలంగాణకు చెందిన పార్లమెంటు సభ్యులు చట్టసభలు వేదికగా, అత్యున్నత న్యాయస్థానం సాక్షిగా కేంద్రంపై చేసిన నిరంతర ఒత్తిడి, విజ్ఞప్తులు, న్యాయపోరాటం ఫలితంగా కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి ఎట్టకేలకు ఉమ్మడి హైకోర్టు విభజన ప్రక్రియను ప్రారంభించింది. తద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు రెండు వేరువేరు న్యాయస్థానాల ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యింది. జనవరి 1, 2019 నాటి నుండి రెండు తెలుగు రాష్ట్రాలు తమ స్వంత హైకోర్టులను కలిగి ఉంటాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న హైకోర్టు ఇకనుంచి తెలంగాణ రాష్ట్ర హైకోర్టుగా ఉంటుంది. అమరావతి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నూతనంగా ఏర్పాటు కానుంది. తెలంగాణ హైకోర్టుకు 10 మంది జడ్జీలు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు 16 మంది జడ్జీలను కేటాయించడం జరిగింది. ప్రస్తుతం ఉమ్మడి హైకోర్టు ముందు సుమారు మూడున్నర లక్షల కేసులు విచారణలో ఉన్నవి. వీటిని ప్రాంతాల ప్రాతిపదికన వేరు చేసి రెండు హైకోర్టులకు కేటాయించటం జరుగుతుంది. తద్వారా కక్షిదారులకు కూడా దూరాభారం తగ్గుతుంది. కేసుల సత్వర పరిష్కారానికి మార్గం సుగమం అవుతుంది.

1990వ దశకంలో ప్రారంభమైన మలిదశ తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ న్యాయవాదుల పాత్ర అత్యంత కీలకమైనది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవ్యవస్థ నియామకాల్లో తమకు జరుగుతున్న అన్యాయాలకు, వివక్షతకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టిన తెలంగాణ న్యాయవాదులు సంఘటితమై తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో మాత్రమే తమ సమస్యలకు శాశ్వతమైన పరిష్కారం లభిస్తుందని భావించి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వైపు నడిచారు. పోరాటం ఫలించి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించినప్పటికీ ఉమ్మడి హైకోర్టు విభజన జరుగలేదు. హైకోర్టు విభజన జరగనిదే రాష్ట్ర విభజన ప్రక్రియ పరిపూర్ణం కాదు. అందుకని తెలంగాణ ప్రత్యేక హైకోర్టు కోసం మళ్లీ సుదీర్ఘకాలం పోరాటం చేయాల్సి వచ్చింది. అంతేగాకుండా, ఉమ్మడి హైకోర్టుగా ఉన్నంతకాలం న్యాయవ్యవస్థ నియామకాల్లో తమకు మళ్లీ అన్యాయం జరిగే అవకాశం ఉంటుందని అనుభవపూర్వకంగా తెలుసుకున్న తెలంగాణ న్యాయవాదులు తెలంగాణ ప్రత్యేక హైకోర్టు కోసం పోరాడారు.

2000 సంవత్సరంలో ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో దేశంలో కొత్తగా అవతరించిన జార్ఖండ్, ఉత్తరాఖండ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు తొలిరోజునే ప్రత్యేక హైకోర్టులు కూడా ఏర్పాటయ్యాయి. అయితే 2014లో దేశంలో 29వ రాష్ట్రంగా అవతరించిన తెలంగాణకు మాత్రం ప్రత్యేక హైకోర్టు ఏర్పాటు చేయటానికి నాలుగున్నర సంవత్సరాలు పట్టింది. సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడంతో ఈ ఆలస్యానికి తెరపడింది. ఇదంతా ఉద్దేశపూర్వకంగా జరిగిన ఆలస్యం. తిలాపాపం తలా పిడికెడు అన్నట్లు ఈ ఆలస్యంలో నాలుగేళ్ల పాటు కేంద్రంలో మిత్రపక్షాలుగా కొనసాగిన తెలుగుదేశం పార్టీ, బిజెపిలు ప్రధాన దోషులు.

ఓ పక్క ఉమ్మడి హైకోర్టు విభజన జరుగకుండా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు బిజెపిపై నిరంతరం ఒత్తిడి తీసుకురావటం, మరోపక్క తగుదునమ్మా అన్నట్లు అర్థంలేని ఆ ఒత్తిళ్లకు కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం వత్తాసు పలకడం, తలొగ్గడం జరిగింది. పర్యవసానంగా గత నాలుగున్నరేళ్లుగా రాజ్యాంగ విలువలకు జరుగుతున్న నష్టాన్ని నిస్సిగ్గుగా విస్మరించారు. పైగా, ఉమ్మడి హైకోర్టు హైదరాబాద్‌లోనే ఉంది కాబట్టి తెలంగాణకు ప్రత్యేక హైకోర్టు అవసరం లేదన్నట్లు బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా తన అజ్ఞానాన్ని ప్రదర్శించాడు. హైకోర్టు ఏర్పాటు అంశంలో కూడా రాజకీయ రాద్ధాంతాలు చోటు చేసుకోవటం శోచనీయం.

హైదరాబాద్ మహానగరాన్ని తానే ప్రపంచపటంలో పెట్టానని ప్రగల్భాలు పలికే చంద్రబాబు అమరావతిలో హైకోర్టు కోసం ఓ భవనాన్ని నిర్మించుకోవటానికి ఎప్పటికప్పుడు గడువు కోరుతూ నాలుగన్నరేళ్లుగా సహకరించకుండా సాగదీసి పబ్బం గడుపుకున్నాడు. ఇక ఇప్పుడు చేసేదేమిలేక ఆంధ్ర న్యాయవాదుల చేత ఉమ్మడి హైకోర్టు విభజనకు వ్యతిరేకంగా ఓ కృత్రిమ ఆందోళనకు శ్రీకారంచుట్టాడు. వాస్తవానికి రాష్ట్ర విభజన కన్నా ముందు అనేక ఏళ్లుగా సౌకర్యార్థం తమ ప్రాంతంలో ప్రత్యేకంగా హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలంటూ ఆంధ్ర న్యాయవాదులు ఆందోళనలు చేపట్టారు.

ఇప్పుడు ఏకంగా ఆంధ్రలో హైకోర్టు ఏర్పాటు అవుతుంటే వారి సంతోషానికి యిక అవధులుండవు. కాని తెలంగాణ రాష్ట్రానికి సహకరించకుండా ఏదో రకంగా ఇబ్బంది పెట్టడమే ఆది నుంచీ ఒక లక్ష్యంగా పెట్టుకున్న సంకుచిత స్వభావి చంద్రబాబు ఇప్పుడు కూడా అదే ధోరణితో ముందుకు సాగుతున్నాడు. ధర్మం జయిస్తుంది అనే నైతిక సూత్రం పట్ల విశ్వాసం ఉంచి తెలంగాణ రాష్ట్రం ముందుకు సాగుతున్నది. జనవరి 1న రెండు తెలుగు రాష్ట్రాలకు ప్రత్యేక హైకోర్టులు ఏర్పాటు కావటం నిస్సందేహంగా తెలుగు ప్రజలకు ఓ నూతన సంవత్సర కానుక. ప్రతి రాష్ట్రానికి హైకోర్టు ఉండటమన్నది రాజ్యాంగం కల్పించిన హక్కు. ఈ హక్కు ద్వారా పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర హైకోర్టు.. న్యాయదేవత విజయం.

www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 192 | మంగళవారం | 1 జనవరి, 2019

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



పాఠకులకు, ప్రకటన కర్తలకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు మన తెలంగాణ 2019 ఆంగ్ల నూతన సంవత్సరాది శుభాకాంక్షలు

- ఎడిటర్



నేటి నుంచే ప్రాజెక్టుల బాట


హైకోర్టు సిజె, న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం తరువాత నేరుగా హెలికాప్టర్‌లో మేడిగడ్డ వెళ్లనున్న సిఎం

బ్యారేజీ, కన్నెపల్లి పంప్‌హౌజ్ పనుల పరిశీలన

అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు గోలివాడ సందర్శన

మన తెలంగాణ/హైదరాబాద్

సాగునీటి పారుదల రంగానికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఇస్తున్న ప్రాధ్యాన్యాన్ని చేతల్లో చూపుతున్నారు. 2019లో నీటిపారుదల రంగంలోనే విప్లవాత్మక ఫలితాలు అందించే దిశగా కార్యాచరణ ప్రారంభించారు. రెండోసారి సిఎంగా ప్రమాణ స్వీకారం చేయగానే తొలి సమీక్షను నీటిపారుదల శాఖపైనే జరిపారు. అధికారికంగా పర్యటన ప్రారంభిస్తున్నది ప్రాజెక్టుల అధ్యయనంతోనే. కొత్త సంవత్సరాన్ని కాళేశ్వరం ప్రాజెక్టు పర్యటనోనే ప్రారంభిస్తున్నారు. ఆంగ్ల తరువాయి 14లో



ఫుడ్ ప్రాసెసింగ్‌లో

మహిళా బృందాలు

- ఫుడ్ ప్రాసెసింగ్ సామూహిక ప్రయత్నం
- మహిళా బృందాలతో పాటు పలువురు భాగస్వాములు కావాలి
- పైలట్ పద్ధతిలో ఆరేడు మండలాల్లో మహిళలకు పాత్ర
- వ్యవసాయ విధానాల్లో దేశంలోనే అగ్రభాగాన ఉండాలి
- ఉన్నత స్థాయి సమీక్షలో సిఎం కెసిఆర్

మన తెలంగాణ/హైదరాబాద్

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఒక సామూహిక ప్రయత్నమని, మహిళా బృందాలతో పాటు పలువురిని ఇందులో భాగస్వాములను చేయాలని ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రగతిభవన్‌లో సోమవారం జరిగిన వివిధ శాఖల ఉన్నతాధికారుల సమీక్షా సమావేశంలో సంబంధిత అధికారులను ఆదేశించారు. తొలుత ఆరేడు మండలాలను పైలట్ పద్ధతిన తీసుకుని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని, ఫలితాలను విశ్లేషించుకున్న తర్వాత పెద్ద ఎత్తున ప్రారంభించవచ్చని సూచించారు. రైతులు నియంత్రణా విధానంలోనే తరువాయి 14లో

బెంగాల్ రైతుబంధు కెసిఆర్ 7

ఎకరాకు 5వేలు, 2లక్షల బీమాతో కృషక్ బంధు ప్రకటించిన మమతాబెనర్జీ





ఇక మన హైకోర్టు

సిజె, న్యాయమూర్తుల ప్రమాణస్వీకారంతో నేడు ప్రారంభం, హాజరు కానున్న సిఎం

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ టిబి రాధాకృష్ణన్ మంగళవారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. రాజ్‌భవన్‌లో ఉదయం 8.30 గంటలకు జరిగే ప్రమాణ స్వీకారోత్సవ తరువాయి 14లో

త్వరలో పంచాయతీ


ఎన్నికల నోటిఫికేషన్

రాష్ట్ర ఎన్నికల సంఘానికి అందిన రిజర్వేషన్ల జాబితా

రేషన్‌డీలర్లూ పోటీ చేయొచ్చు : ఎస్ఇసి

మన తెలంగాణ/హైదరాబాద్

ఎట్టకేలకు పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నేడో, రేపో నోటిఫికేషన్ వెలువడనుంది. అన్ని జిల్లాల నుంచి వార్డులు, పంచాయతీల వారీగా రిజర్వేషన్ల జాబితా పంచాయతీరాజ్ శాఖకు చేరింది. వాటిని పరిశీలించిన ఆ శాఖ ఉన్నతాధికారులు సోమవారం రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపారు. అందుకు అనుగుణంగా జనవరి 3వ తేదీన లేదా అంతకంటే ముందే నోటిఫికేషన్ ఇచ్చేందుకు కసరత్తును పూర్తి చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికార వర్గాలు ధ్రువీకరించాయి. ఎన్నికల నిర్వహణ కోసం రూ.50 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు కూడా జారీ చేసింది. మొత్తం మూడు విడతల్లో



పంచాయతీ ఎన్నికలలు జరగనున్నాయి. ఒక విడత నుంచి మరో విడతకు నాలుగు నుంచి ఐదు రోజుల సమయం ఉండవచ్చు. గణతంత్ర దినోత్సవం కంటే ముందే మొత్తం ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం జనవరి 10వ తేదీ లోపు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ రిజర్వేషన్ల ప్రకియపై గందరగోళం నెలకొనడంతో వాటిని సరిచేసుకునేందుకు సమయం పట్టింది. అన్ని జిల్లాల లోని గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా రిజర్వేషన్లు పూర్తి చేసి పంచాయతీరాజ్ శాఖకు కలెక్టర్లు సోమవారం జాబితాను పంపించారు. ఈ వివరాలను తెలియజేస్తూ పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ రాష్ట్ర తరువాయి 14లో

రాష్ట్ర ప్రజలకు 6

గవర్నర్, సిఎం నూతన సంవత్సర శుభాకాంక్షలు

సబ్సిడీ గ్యాస్ ధర రూ. 6 తగ్గింపు 13

వరించిన వజ్రం 16

- మధ్యప్రదేశ్‌లో వజ్రం దొరికి కోటీశ్వరులైన ఇద్దరు గని కార్మికులు

న్యూఇయర్‌కి

చలి స్వాగతం

ఆదిలాబాద్ జిల్లాలో 2.7డిగ్రీలు, మెదక్‌లో ఆల్‌టైమ్ రికార్డు, తొలిసారి 5.7డిగ్రీలు



మన తెలంగాణ/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు కనీస స్థాయికి పడిపోయాయి. ఉత్తరాది రాష్ట్రాల నుంచి వీస్తున్న చలిగాలుల ప్రభావం రాష్ట్రంలోని ఉత్తర తెలంగాణలో ఎక్కువగా ఉందని, రానున్న ఐదు రోజుల వరకు వాతావరణం ఇదే స్థాయిలో కొనసాగుతుందని, అందువల్లనే జనవరి, 1, 2 తేదీల్లో ఉండే చలి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని 'ఆరంజ్' హెచ్చరికను జారీ చేసినట్లు వాతావరణ శాఖ అధికారి రాజారావు తెలిపారు. దాదాపు ఈ నెల 5వ తేదీ వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని హార్లీ ప్రాంతంలో 2.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నాలుగేళ్ళ క్రితం నాటి రికార్డును అదే గ్రామం ఇప్పుడు బద్దలు కొట్టింది. 2014 డిసెంబరు 28వ తేదీన హర్లి గ్రామంలో 2.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకాగా ఇప్పుడు దానికన్నా పడిపోయింది. మెదక్‌లో 5.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యిందని, ఆల్ టైం రికార్డు అని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 6 డిగ్రీల వరకు తక్కువగా నమోదు అవుతున్నాయని, హైదరాబాద్‌లో తరువాయి 14లో

కుంచెపోటు



అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్య


నల్లగొండలో విషాదం

మన తెలంగాణ/నల్లగొండ రూరల్

నల్లగొండ జిల్లా కేంద్రంలో సోమవారం విషాద సంఘటన చోటుచేసుకుంది. స్థానిక దేవరకొండ రోడ్డులోని అబ్బాసియా కాలనీకి చెందిన జగిని శేఖర్(40), స్వాతి (37)లు అప్పుల బాధ తాళలేక ఎలుకల మందు తాగి ఆత్యహత్య చేసుకున్నారు. సోమవారం ఉదయం జరిగిన ఈ సంఘటనకు సంబందించి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక అబ్బాసియా కాలనీలో నివాసముంటున్న జగిని శేఖర్, స్వాతిలకు ఇద్దరు కుమారులు. అయితే శేఖర్ కుటుంబంలో ఆస్థి పాస్థుల విషయంలో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే పలుమార్లు కుటుంబ సభ్యుల మధ్య చర్చలు కూడా జరిగినట్లు సమాచారం. అయితే ఇటీవల శేఖర్ కొత్త ఇంటిని తరువాయి 14లో

బాబుపై భూ బాంబు

- 400 ఎకరాల కుంభకోణం
- తెరపైకి బిల్లీరావ్ ఉదంతం
- క్రిమినల్ చర్యలు తీసుకోవాలని స్టాంపుల విభాగం ఐజికి లిఖితపూర్వక ఫిర్యాదు



మన తెలంగాణ /హైదరాబాద్

సమైక్య రాష్ట్రంలో 2004 ఫిబ్రవరిలో చంద్రబాబునాయుడు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉంటూ నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయం తీసుకుని కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాల స్థలాన్ని ఒక బోగస్ కంపెనీకి ధారాదత్తం చేయడంపై క్రిమినల్ విచారణ చేపట్టాలని, ఆ ఒప్పందాన్నిరద్దు చేయాలని కోరుతో రాష్ట్ర స్టాంపులు రిజిస్ట్రేషన్ల విభాగం ఇన్‌స్పెక్టర్ జనరల్ (కమిషనర్ కూడా)కు న్యాయవాది రామారావు ఫిర్యాదు చేశారు. అసెంబ్లీని రద్దు చేసిన తర్వాత విధాన నిర్ణయాలు తీసుకోడానికి వీలు లేనప్పటికీ చంద్రబాబునాయుడు తన అనుచరులకు లబ్ధి చేకూర్చే ప్రయత్నంలో భాగంగా 2014 ఫిబ్రవరి 10వ తేదీన 400 ఎకరాల (సర్వే నెం. 25) స్థలాన్ని కేవలం ఎకరానికి రూ. 50 వేల చొప్పున ధర నిర్ణయించి బిల్లీరావ్ అలియాస్ అహోబిలరావు, ఆయన సోదరుడు ప్రబాకర్‌రావు స్థాపించిన ఐఎంజి అకడమియా భారత అనే పేరుతో ఉన్న సంస్థకు అప్పగించారని రామారావు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ భూమిని అప్పగించడానికి ఎనిమిది రోజుల ముందే ఈ సంస్థ ఉనికిలోకి వచ్చిందని, కేవలం ఐదు లక్షల రూపాయల ఈక్విటీతో ఏర్పడిందని, క్రీడలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ సంస్థను స్థాపించినట్లు హైదరాబాద్‌లోని రిజిస్ట్రార్ కార్యాలయంలో (సిఐఎన్ నెం. యు 92413 తరువాయి 14లో

3న వైస్ ఛాన్సలర్ల సమావేశం

మనతెలంగాణ/హైదరాబాద్ : ఉన్నత విద్యలో మారుతున్న పరిస్థితులు, నైపుణ్యాభివృద్ధిపై ఈ నెల 3వ తేదీన హోటల్ ఐటిసి కాకతీయలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్లు, విద్యారంగ నిపుణులు, ఉన్నతాధికారులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. ఇండో అమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామన్స్ నిర్వహించనున్న ఈ సమావేశానికి ఉన్నత విద్యామండలి ఛైర్మన్ టి.పాపిరెడ్డి, స్పెషల్ సిఎస్ అజయ్ మిశ్రా, ఐటి శాఖ కార్యదర్శి జయేష్ రంజన్, కళాశాల విద్య కమిషనర్ నవీన్ మిట్టల్, ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్లు ఆర్.లింబాద్రి, వి.వెంకటరమణ, జెఎన్‌టియు విసి ఎ.వేణుగోపాల్ రెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఎస్.రామచంద్రం, ఇతర వర్సిటీల ఉపకులపతులు పాల్గొంటారు.

చలికి వణుకుతున్న వరిపైర్లు

- నారుమళ్ల ఎదుగుదలకు ఇబ్బంది
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్న శాస్త్రవేత్తలు
- పాలిథీన్ పట్టాకవర్లు కప్పుకోవాలని సూచనలు
- లేదంటే దిగుబడులు తగ్గే ప్రమాదం



మన తెలంగాణ/హైదరాబాద్ : వర్షం వచ్చినా.. చలి ఎక్కువైనా.. రైతన్నకు కష్టాలు ఆగడం లేదు. ప్రకృతి రైతును ఇబ్బందుల్లోకి నెట్టుతోంది. పెరుగుతున్న చలి వరి పైరుపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇప్పటికే నాట్లు వేసిన పైరు కనిష్ఠ ఉష్ణోగ్రతల కారణంగా జీవం కోల్పోతున్నాయని పేర్కొంటున్నారు. పలు జిల్లాల్లో వరినారు, పైరు.. పసుపు, ఎరుపు రంగులోకి మారుతోంది. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పడిపోయి చలి తీవ్రత పెరగడంతో వరిపైరు వణుకుతోంది. ఉత్తర భారతంలో పశ్చిమ గాలుల తీవ్రత అధికంగా ఉంది. వాతావరణ విభాగం పరిభాషలో ఈ గాలులను 'పశ్చిమ గాలులు' (వెస్టర్న్ డిస్టర్బెన్స్) అని పిలుస్తారు. ఇవి అధికంగా ఉంటే ఉష్ణోగ్రత వేగంగా పడిపోతుంది. రాత్రివేళలో మంచు పడుతుండటంతో ఇప్పుడిప్పుడే నాట్లు పడిన వరికి అగ్గి తెగులు సోకే అవకాశం ఉందని రైతులు అప్రమత్తంగా ఉండాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. మరో 10, 15 రోజుల పాటు పరిస్థితులు ఇలాగే ఉంటాయని సస్యరక్షణ చేపట్టాలని చెబుతున్నారు. చలికి ఇప్పటికే నారుమడి దశలో ఉన్న మొక్కలు సరిగ్గా ఎదగక నాట్లు కూడా ఆలస్యమయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. తెగుళ్లు వస్తే 3 క్వింటాళ్ల వరకు దిగుబడి తగ్గుతుందని హెచ్చరిస్తున్నారు.

వానకాలం పంటలో వాతావరణం అనుకూలించక, వర్షాభావ పరిస్థితులతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ రబీ వరి సాధారణ సాగు విస్తీర్ణం 17.62 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు కేవలం 1,23,000 ఎకరాల్లో (7%) మాత్రమే నాట్లు పడినట్లు ఇటీవల విడుదల చేసిన నివేదికలో వ్యవస్యా శాఖ తెలిపింది. రబీలో రైతులు అధికంగా తెలంగాణ సోన, కునారం సన్నాలు, బతుకమ్మ, శీతల్, కాటన్ దొర సన్నాలు, తెల్లహంస, జగిత్యాల సాంబ వంటి రకాలు సాగు చేస్తారు. ఈ వంగడాలు 12 డిగ్రీల్లోపు ఉష్ణోగ్రతను తట్టుకోలేవని నిపుణులు అంటున్నారు. ఒకవైపు వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం, మరోవైపు సాగునీటి ప్రాజెక్టుల ద్వారా యాసంగికి ఆయకట్టుకు లక్ష్యం మేరకు నీరందే సూచనలు కనిపించకపోవడంతో సాగు మందగిస్తోంది. ఇప్పటికే వివిధ ప్రాజెక్టుల ఆయకట్టు కింద వేసిన వరినాట్లకు నీరందక వరిమళ్లు బీడుగా మారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న చలికి వరికి తెగుళ్లు రాకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు పాటించాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. చలితో నారు ఎదుగుదల లోపించడం, నార్లు ఎర్రబడుతాయి. ఇందుకు నారు మడులను సన్నటి పాలీథీన్ పట్టాను కర్రతో అమర్చి కప్పాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి : ఆర్. జగదీశ్వర్

చలి తీవ్రత పెరిగినందున రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ శాస్త్రవేత్త డాక్టర్ ఆర్. జగదీశ్వర్ తెలిపారు. రాత్రివేళలో నారుమడిని పాలీథీన్‌తో కప్పడంతో పాటుగా ఎకరాకు సరిపడా లింగార్షక బుట్టలు అమర్చి కాండం తొలిచేపురుగును గమనించాలి. దీంతో లోపల నాలుగైదు డిగ్రీల ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఇప్పటికే నాట్లు వేసిన పొలాలకు కూడా ఎకరానికి ఒకసారి 35 నుంచి 40 కిలోల యూరియాను వేయాలి. అగ్గి తెగులు నివారణకు ట్రైసక్లజోల్ 0.5 గ్రా.లీటర్లు వాడాలని సూచించారు.

ఇద్దరు డ్రగ్స్ విక్రయదారుల అరెస్టు

89గ్రాముల కొకైన్, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు




మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో : నిషేధిత కొకైన్ విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 89 గ్రాముల కొకైన్, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కొకైన్ విలువ 10 లక్షల రూపాయలు ఉంటుంది. నగర పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్ సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గోవా రాష్ట్రం బార్‌డెజ్, ఫటావడ్లో నేరుల్‌కు చెందిన లివియో జోసెఫ్ ఆల్‌మేయిడా అలియాస్ పియూష్ వాహనాలను అద్దెకు ఇచ్చే వ్యాపారం చేస్తున్నాడు. ఏపి రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా తనుకుకు చెందిన ఉమాశంకర్ బతుకుదెరువు కోసం భార్య పిల్లలతో కలిసి హైదరాబాద్‌కు వచ్చి పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. వాహనాల అద్దె వ్యాపారంలో వస్తున్న డబ్బులు సరిపోకపోవడంతో జోసెఫ్ ఆల్‌మేయిడా నైజీరియన్ల వద్ద కొకైన్‌ను తక్కువ ధరకు కొనుగోలు చేసి అక్కడే ఎక్కువ ధరకు విక్రయించేవాడు. గ్రాము కొకైన్‌ను రూ.3,000 కొనుగోలు చేసి రూ.7,000లకు విక్రయించేవాడు. ఎనిమిది నెలల క్రితం శంకర్‌కు లివియో జోసెఫ్ ఆల్‌మేయిడాతో పరిచయమైంది. హైదరాబాద్‌లో కొకైన్ విక్రయించేందుకు సాయపడితే కమీషన్ ఇస్తానని చెప్పాడు. దీనికి అంగీకరించిన శంకర్ తరచూ గోవాలకు వెళ్లి కొకైన్ తీసుకువచ్చి కావాల్సిన వారికి గ్రాము రూ.7,000కు కొనుగోలు చేసి రూ.11,000లకు విక్రయించేవాడు. చిన్న చిన్న ప్యాకెట్‌లో గ్రాము చొప్పున ప్యాకింగ్ చేసేవాడు. ఇద్దరు బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్‌లో కలుసుకుని, డిసెంబర్ 31వ తేదీన కొకైన్ విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం రావడంతో దాడి చేసి పట్టుకున్నారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం నిందితులు ఇద్దరిని బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ డిసిపి రాధాకిషన్ రావు పర్యవేక్షణలో ఇన్స్‌స్పెక్టర్ గట్టుమల్లు, ఎస్సైలు దుర్గా రావు, మహ్మద్ ముజఫర్ ఆలీ, కానిస్టేబుళ్లు లోకేశ్వర్‌రావు, వెస్ట్ జోన్ సిబ్బంది పట్టుకున్నారు.

గవర్నర్, సిఎం కొత్త సంవత్సర శుభాకాంక్షలు

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రజలకు గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింత ముందుకు పోవాలని, ప్రతీ ఒక్కరూ సుఖ సంతోషాలతో జీవించాలని సిఎం ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాల్లో వెల్లివిరిసేలా దీవించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు.

హరీశ్‌రావు శుభాకాంక్షలు



మన తెలంగాణ / సిద్దిపేట ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర, సిద్దిపేట జిల్లా ప్రజలకు 2019 నూతన సంవత్సర శుభాకాంక్షలను మాజీ మంత్రి, సిద్దిపేట నియోజకవర్గ శాసన సభా సభ్యుడు తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సిఎం కెసిఆర్ ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని ఆదరించి ప్రజలు 2018 సంవత్సరంలో కెసిఆర్ ను తిరిగి రెండోసారి ముఖ్యమంత్రిగా చేశారన్నారు. కెసిఆర్ నాయకత్వంలో రాష్ట్రం మరో మారు అభివృద్ధి పథంలో దూసుకపోవడంతో పాటు కోటి ఎకరాల మాగాణిగా మారుతుందన్న నమ్మకం ప్రజల్లో ఎంతగానో ఉందన్నారు. ఈ నూతన సంవత్సరంలో ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ ఫలాలు ప్రజలందరికి అందడంతో పాటు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కొత్త ఆలోచనలతో ముందుకు సాగి ప్రజలు ఆరోగ్యమైన జీవితాన్ని గడపాలన్నారు.

బిసిలను కాంగ్రెస్ కరివేపాకులా చూస్తుంది



మన తెలంగాణ/హైదరాబాద్ : సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు పంచాయతీల్లో రిజర్వేషన్లు 50 శాతం మించే అవకాశమే లేదని, ఈ నేపథ్యంలో బిసిలకు 24 శాతంతోనే రిజర్వేషన్లను సరిపెట్టుకోవడం బాధాకరమే అయినా టిఆర్ఎస్ ప్రభుత్వం అంగీకరించక తప్పలేదని టిఆర్ఎస్ శాసనసభ్యుడు నోముల నర్సింహయ్య వ్యాఖ్యానించారు. టిఆర్ఎస్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిలకు రిజర్వేషన్లు పెంచాలనే చిత్తశుద్ధి టిఆర్ఎస్‌కే ఉందన్నారు. కాంగ్రెస్, టిడిపి బిసిలకు చేసిందేమీలేదని నిందించారు. కాంగ్రెస్ అధికారంలో బిసి వర్గాలకు నిధులు కేటాయించలేదని ఆరోపించారు. బిసి ఫెడరేషన్లకు కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఒక్క పైసా కూడా విడుదల చేయలేదన్నారు. బిసిలను కరివేపాకులా చూసిన కాంగ్రెస్ బిసి రిజర్వేషన్లపై మాట్లాడటం విచిత్రంగా ఉందని విమర్శించారు. బిసిలను రాజకీయంగా ఎదగకుండా చేసింది కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. చట్టసభల్లో బిసి రిజర్వేషన్లు పెంచేందుకు టిఆర్ఎస్ కృషిచేస్తుంటే కాంగ్రెస్ మౌనంగా ఉందన్నారు. బిసి రిజర్వేషన్లకోసం శాసనసభలో తీర్మానం చేసిన ఘనత టిఆర్ఎస్‌కు ఉందని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీకి ధైర్యముంటే ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోని చట్టసభల్లో బిసిలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించేలా తీర్మానాలు చేయాలని డిమాండ్ చేశారు. బిసిలకు ఎవరు ఏమి చేశారో తనతో చర్చించేందుకు కాంగ్రెస్ ఛీఫ్ ఉత్తమ్ సిద్ధంగా ఉన్నారా అని ప్రశ్నించారు. చంద్రబాబును ఎన్‌టిఆర్ స్వయంగా 'జామాత దశమ గ్రహం' అని విమర్శించింది మర్చిపోయి అసత్య ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు మాదిరిగా సిఎం. కెసిఆర్‌కు 'అండీ' అని పిలవడం రాదని, చెప్పాలనుకున్న విషయాన్ని దాపరికం లేకుండా ధైర్యంగా చెప్పడం ఆయన నైజమని చెప్పారు. గత చరిత్రను మర్చిపోయిన చంద్రబాబు వ్యవహారం వానలు కొడితే వాతలు పోవు చందంలా ఉన్నాయని విమర్శించారు.

నేడు కార్యకర్తలతో పవన్ భేటీ



మన తెలంగాణ/హైదరాబాద్ : జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ యూరప్ పర్యటన ముగించుకొని స్వదేశానికి వచ్చిన నేపథ్యంలో పార్టీ కార్యకర్తలతో మంగళవారం విజయవాడలో సమావేశం కానున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. త్వరలో పార్లమెంటు ఎన్నికలు, ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఉండడంతో పార్టీకి ఎన్నికల సంఘం కేటాయించిన 'గాజు గ్లాసు' గుర్తును ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందనే అంశాన్ని ఈ సమావేశంలో కార్యకర్తలు, నాయకులకు నొక్కిచెప్పనున్నారు. రానున్న సాధారణ ఎన్నికల్లో ఆ పార్టీ పోటీ చేయనున్నట్లు ఇప్పటికే స్పష్టం చేసినందున కార్యకర్తలకు పవన్ దిశానిర్దేశం చేయనున్నారు. ప్రధాన పార్టీ కార్యాలయంలో జరిగే సమావేశంలో 100 రోజుల్లో పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలతో పాటు యాక్షన్ ప్లాన్ విడుదల చేయాలని ఆలోచిస్తున్నారు. ఈ సమావేశానికి పార్టీ నియోజక వర్గాల కో ఆర్డినేటర్లు కూడా హాజరు కానున్నారు.

ప్రయోగాలు చేయకుండానే ప్రాక్టికల్సా?

- ప్రాక్టికల్స్‌పై విద్యార్థుల్లో కొరవడుతున్న కనీస పరిజ్ఞానం
- ఫిబ్రవరి 2 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

మనతెలంగాణ/హైదరాబాద్ : ప్రైవేట్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు ప్రాక్టికల్స్ చేయకుండానే ప్రాక్టికల్ పరీక్షలకు హాజరయ్యే పరిస్థితి నెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి 2 నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలోని జూనియర్ కళాశాలల్లో ఎక్కువగా థీయరీపైనే దృష్టి సారించి, ప్రాక్టికల్స్‌ను విస్మరించారన్న విమర్శలు ఉన్నాయి. కొన్ని కళాశాలల్లో అవసరమైనా సామాగ్రి లేకపోవడం, మరికొన్నింటిలో నేర్పించే సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల్లో సైతం ప్రాక్టికల్స్‌పై కనీస అవగాహన ఉండటం లేదు. ''ఇంటర్ విద్యార్థులకు పిప్పెట్, బ్యూరెట్ అంటే ఏంటో తెలియడం లేదు'' అని కొన్ని నెలల క్రితం జరిగిన ఓ బహిరంగ సమావేశంలో సాక్షాత్తు అప్పటి ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి అన్నారంటే కళాశాలల్లో ప్రాక్టికల్స్ నిర్వగాహన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. సాక్షాత్తు విద్యామంత్రే ఇలా మాట్లాడిన తర్వాత కూడా కళాశాలల్లో ప్రయోగాలు చేయించే విషయంలో మార్పు వచ్చినట్లు కనిపించలేదు.

కొరవడుతున్న శాస్త్రీయ పరిజ్ఞానం

కొత్త ఆవిష్కరణలకు విద్యార్థి దశలోనే పునాదులు పడాల్సి ఉంటుంది. అందుకోసం ఇంటర్‌లో సైన్స్ గ్రూపులు చదివే విద్యార్థులకు ప్రయోగాత్మక విద్యను బోధిస్తారు. ప్రైవేట్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరిపడా అధ్యాపకులు, ప్రయోగశాలలు లేకపోవడం విద్యార్థులకు శాపంగా మారుతుంది. కొన్ని కళాశాలల ప్రయోగశాలల్లో పరికరాలు, రసాయనాలు ఉన్నా యాజమాన్యాల నిర్లక్ష్యం వల్ల విద్యార్థులకు ప్రయోగాలు నిర్వహించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మరి కొన్నింటిలో ప్రయోగశాలలు కేవలం అలంకార ప్రాయంగా ఉంటున్నాయి.

ప్రాక్టికల్స్ మార్కులే కీలకం

ర్యాంకుల పందేరంలో ప్రాక్టికల్స్ మార్కులే కీలకం. ఇంటర్ ప్రాక్టికల్స్‌లో ఎంపిసి వారికి 60 మార్కులు, బైపిసి వారికి 120 మార్కులు ఉన్నాయి. ఒక్క మార్కు తేడాతో కూడా ర్యాంకులు తారుమరవుతుంటాయి. దాంతో ర్యాంకుల పోటీలో ప్రతి మార్కు కీలకంగానే మారుతుంది. ఇంటర్ మార్కులకు ఎంసెట్‌లో వెయిటేజి ఉండటంతోపాటు ఇంటర్‌లో 75 శాతం మార్కులు వస్తేనే జెఇఇకి అర్హత ఉండటంతో నామమాత్రంగా పరీక్షలు నిర్వహించి అధిక మార్కులు వేసుకునేలా ప్రైవేట్ యాజమాన్యాలు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి.

జంబ్లింగ్‌పై వెనకడుగెందుకు?

జంబ్లింగ్ విధానంలో ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ ఏటా వాయిదా పడుతూ వస్తోంది. ఈ విధానంపై ఏటా ఆఖరి నిమిషం వరకు టెన్షన్ పెట్టి...చివరి నిమిషంలో ఈ ఏడాది జంబ్లింగ్ విధానం లేదని ఇంటర్ బోర్డ్ ప్రకటిస్తుంటుంది. సుమారు దశాబ్దకాలానికిపైగా ఇదే తంతు కొనసాగుతోంది. ప్రైవేట్ కళాశాలల ఒత్తిడికి తలొగ్గి ఏదో ఒక సాకుతో బోర్డ్ ఏటా వాయిదా వేస్తోందన్న ఆరోపణలున్నాయి. ప్రాక్టికల్స్‌లో ఫుల్ మార్కులు వేయించొచ్చులే అన్న ధీమాతో ఈ కళాశాలలు నామమాత్రంగానే ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. కళాశాలల్లో మాస్ కాపీయింగ్ నిర్వహించి తమ విద్యార్థులకు ఫుల్ మార్కులు వేసుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. సొంత కళాశాలలో కాకుండా జంబ్లింగ్ విధానంలో ఇతర కాళాశాలల్లోకి వెళ్తే తమ విద్యార్థులకు ఇష్టారాజ్యంగా మార్కులు వేసుకునే అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో జంబ్లింగ్ విధానం అమలైతే తమ విద్యార్థులకు ప్రాక్టికల్స్‌లో మార్కులు తగ్గే అవకాశం ఉంటుందని భావిస్తున్న ప్రైవేట్ యాజమాన్యాలు జంబ్లింగ్‌కు అడ్డుపడుతున్నాయన్న పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



తెలంగాణ బాటలో పశ్చిమబెంగాల్

● కొత్త సంవత్సరం నుంచే ఆ రాష్ట్రంలో రైతుబంధు, బీమా పథకాలు ● ముఖ్యమంత్రి మమత ప్రకటన

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న 'రైతు బంధు', 'రైతుబీమా' పథకాలు అనేక రాష్ట్రాలకు దిక్సూచిగా మారాయి. ఇప్పటికే ఒడిశా, జార్ఖండ్ ప్రభుత్వాలు రైతుబంధు పథకాన్ని అమలుచేస్తుండగా సోమవారం నుంచి పశ్చిమబెంగాల్ కూడా ఆ జాబితాలో చేరింది. నూతన సంవత్సర కానుకగా అభివర్ణించిన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మొత్తం మూడు పథకాలను ప్రకటించారు. రైతులకు పంట పెట్టుబడి సాయం, బీమా, పంటల బీమా అనే ఈ మూడూ జనవరి 1 వ తేదీ నుంచే అమల్లోకి వస్తాయని సోమవారం మీడియాకు స్పష్టం చేశారు. ప్రతీ ఎకరానికి సంవత్సరానికి ఐదు వేల రూపాయల చొప్పున పంట పెట్టుబడి సాయంగా రెండు విడతల్లో రైతులందరికీ అందజేస్తామని ప్రకటించారు. వ్యవసాయ శాఖ నుంచి ఈ డబ్బులు లబ్ధిదారులకు చేరుతామని పేర్కొన్నారు. 'కృషక్ బంధు' పేరుతో రైతుబీమా పథకాన్ని కూడా ఆమె ప్రకటించారు. ఏదేని కారణంతో రైతులు, వ్యవసాయ కార్మికులు మృతి చెందినా, ఆత్మహత్య చేసుకున్నా వారి కుటుంబాలకు రెండు లక్షల రూపాయల పరిహారం అందుతుందని, ఈ పథకం రాష్ట్రంలోని సుమారు 72 లక్షల మందికి వర్తిస్తుందని పేర్కొన్నారు. పూర్తిస్థాయి మార్గదర్శకాలను ఆ ప్రభుత్వం ఇంకా రూపొందించనప్పటికీ 18 ఏళ్ళ మొదలు 60 ఏళ్ళ వయసున్న రైతులు, వ్యవసాయ కూలీలందరికీ ఇది వర్తిస్తుందని ఆమె స్పష్టం చేశారు. ఇక రైతులు నిత్యం పంట నష్టంతో బాధపడుతున్నందున వారికి ఆర్థిక భారం లేకుండా ఉండేలా బీమా సంస్థల నుంచి పరిహారం అందేలా ప్రభుత్వమే వారి తరఫున పూర్తిస్థాయిలో ప్రీమియం చెల్లిస్తుందని పేర్కొన్నారు. ఈ మూడు పథకాలూ జనవరి నుంచే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా భారం అయినప్పటికీ రైతుల సంక్షేమం కోసం వీటిని అమలుచేయాలన్న నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే రైతులకు భూమిపై పన్నును పూర్తిగా ఎత్తివేశామని గుర్తుచేశారు.



తెలంగాణ చూపిన బాటలో

తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న 'రైతుబంధు', 'రైతుబీమా' పథకాలను ఇప్పటికే పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఆర్థిక నిపుణులు, సీనియర్ పాత్రికేయులు, మేధావులు ప్రశంసించారు. రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఇది ఒక రూపంలో ఉపశమనంగా ఉంటుందని అశోక్ గులాటి, అరవింద్ సుబ్రమణ్యం లాంటివారు వ్యాఖ్యానించారు. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా రైతుల్ని ఆదుకోడానికి ప్రభుత్వమే భరోసా కల్పించడాన్ని ఆహ్వానించారు. దేశవ్యాప్తంగా దీన్ని అమలుచేయడం ప్రయోజనకరంగా ఉంటుందని వారివారి అభిప్రాయాలుగా వెలిబుచ్చారు. దేశవ్యాప్తంగా రైతాంగం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో, వ్యవసాయం సంక్షోభ పరిస్థితుల్లో ఉన్న సమయంలో తెలంగాణ ప్రభుత్వం ఈ రెండు పథకాలను ప్రవేశపెట్టడంపై జాతీయస్థాయిలోనే చర్చ జరుగుతోంది. కొన్ని జాతీయ మీడియా సంస్థలు సైతం తెలంగాణ పథకాలను మొత్తం దేశానికి వర్తింపజేయడం ప్రస్తుత పరిస్థితుల్లో చాలా అవసరమని, దీన్ని అమలుచేయడానికి మూడు లక్షల కోట్ల వరకు ఖర్చయ్యే అవకాశం ఉందని, కేంద్ర ప్రభుత్వానికి ఇది ఆర్థికంగా పెద్ద భారంగా భావించలేమన్న వ్యాఖ్యలు కూడా వచ్చాయి. సరిగ్గా ఇదే సమయంలో ఒడిశా, జార్ఖండ్ ప్రభుత్వాలు రైతుబంధు పథకాన్ని ప్రకటించాయి. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బెంగాల్ ప్రభుత్వం రెండు పథకాలనూ ప్రకటించడం విశేషం.

రైతులపై మోడీ మొసలి కన్నీరు

రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, పంటలు నష్టపోతే బీమా చెల్లిస్తామని గొప్పగా చెప్పుకుంటున్న మోడీ ఈ నాలుగున్నరేళ్ళ కాలంలో చేసిందేమీ లేదని మమతాబెనర్జీ విమర్శించారు. పంటల బీమా పేరుతో ప్రీమియం కట్టించుకున్నప్పటికీ అమలులో మాత్రం అనేక లోపాలు ఉన్నాయని గుర్తుచేశారు. డిసెంబరు 26న దక్షిన 24 పరగణాల జిల్లాలో జరిగిన ఒక ర్యాలీ సందర్భంగా రైతుల విషయంలో మోడీపై నిప్పులు చెరిగారు. పంటల బీమా పథకం కింద రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారాన్ని కేంద్ర ప్రభుత్వమే చెల్లిస్తున్నట్లు మోడీ చెప్పుకుంటున్నారుగానీ వాస్తవానికి ఆయన చెల్లిస్తోంది కేవలం 20 శాతం మాత్రమేనని, మిగిలిన 80 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోందని ఆమె వివరించారు.

సఫల ప్రయోగంగా తెలంగాణ పథకాలు

తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు ప్రయోజనకరంగా ఉన్నట్లు అనేక అనుభవాలు రుజువుచేస్తున్నాయి. రైతు బీమా పథకాన్ని ప్రవేశపెట్టిన తర్వాత వివిధ కారణాలతో ఇప్పటివరకు సుమారు ఐదు వేల మంది రైతులు చనిపోతే పదిహేను రోజుల వ్యవధిలోనే వారి కుటుంబాలకు బీమా సంస్థల నుంచి తలా ఐదు లక్షల రూపాయల చొప్పున పరిహారం అందింది. కుటుంబ పెద్దగా ఉన్న రైతు చనిపోతే ఆ కుటుంబం వీధిన పడవద్దన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి కెసిఆర్ బీమా పథకానికి రూపకల్పన చేయగా దాని ఫలితాలు కూడా వెంటనే వచ్చాయి. ఇటీవల ముగిసిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సైతం టిఆర్ఎస్‌కు అపూర్వ మెజారిటీ తీసుకొచ్చిన కారణాల్లో రైతుబంధు, రైతుబీమా పథకాలు ప్రధాన భూమిక పోషించాయి. రైతులకు నిజమైన సంక్షేమం లభిస్తే, ప్రభుత్వం ఒక 'పెద్ద'గా ఉందన్న భరోసా లభిస్తే ఆ పార్టీని, ప్రభుత్వాన్ని ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారన్న అంశానికి తాజా ఎన్నికల ఫలితాలే నిదర్శనంగా నిలిచాయి. ఇటీవల ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు వెళ్ళి ముఖ్యమంత్రులతో భేటీ అయిన సందర్భంగా ఈ పథకాల ఫలాలను వివరించడం గమనార్హం. ముఖ్యమంత్రి కెసిఆర్ పశ్చిమబెంగాల్ సిఎం మమతా బెనర్జీతో భేటీ అయిన వారం రోజుల్లోనే ఆమె ఈ రెండు పథకాలనూ ప్రకటించడం గమనార్హం.

టిఆర్ఎస్ విజయాన్ని పురస్కరించుకుని ఎన్ఆర్ఐల సంబరాలు

నూతనంగా టిఆర్ఎస్ యుఎస్ఎ ఆస్టిన్ విభాగం ఏర్పాటు

మనతెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ సాధించిన ఘన విజయాన్ని పురస్కరించుకుని అమెరికాలోని ఆస్టిన్ నగరంలో ఆదివారం ఎన్ఆర్ఐలు సంబురాలు జపుకున్నారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ యుఎస్ఎ ఆస్టిన్ విభాగం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అమెరికా టిఆర్ఎస్ కార్యదర్శి నరసింహరావు నాగుల వంచా ముఖ్యఅతిథిగా హాజయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టిఆర్ఎస్ అధినేత, సిఎం కెసిఆర్ నాయకత్వం పటిమ, అభివృద్ధి పథకాలు, కాళేశ్వరం ప్రాజెక్టు తదితర బృహత్తర కార్యక్రమాలు ఈ ఎన్నికల్లో టిఆర్ఎస్ ఘన విజయానికి కారణమయ్యాయని అన్నారు. టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన కెటిఆర్‌కు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఏర్పడిన టిఆర్ఎస్ ఆస్టిన్ కార్యదర్శి హరీష్‌రెడ్డి వ్యాళ్ళ మాట్లాడుతూ, ఎవరు ఎన్ని బూటకపు వాగ్దానాలు చేసినా తెలంగాణ ప్రజలు కెసిఆర్‌కు ఏకపక్ష విజయాన్ని అందించారన్నారు. తాను ప్రత్యక్షంగా మూడు నియోజకవర్గాలలో టిఆర్ఎస్ పట్ల ప్రజల అనూహ్య స్పందన చూశానని పేర్కొన్నారు. హరీష్‌రావు నిబద్ధత, క్రమశిక్షణ ఈ దేశ నాయకులకు ఆదర్శమని అన్నారు. రానున్న పంచాయతీ, లోక్‌సభ ఎన్నికల్లో కూడా టిఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ యుఎస్ఎ నాయకులు మహేష్ తన్నీరు, మహేష్ బిగాల, పూర్ణచందర్ బైరి, నవీన్ జలగం, అనిల్ కూర్మాచలం టిఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేణు జూపల్లి, రాకేష్ వడ్లూరి, శ్రీనాథ్ బొమ్మ, జగదీష్ జొన్నాడ, నవీన్ నూతి, ప్రదీప్ భట్టిప్రోలు, శ్రీనాథ్ దాసరి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ టారిఫ్ ప్రతిపాదనలకు గడువు కోరిన డిస్కంలు



మన తెలంగాణ/హైదరాబాద్ : విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలు సమర్పించడానికి మార్చి నెలాఖరు వరకు గడువు కావాలని డిస్కంలు టిఎస్ఇఆర్‌సిని కోరాయి. సరైన సమాచారం క్షేత్రస్థాయి నుంచి సేకరించడంలో కొంత ఆలస్యం, భవిష్యత్తులో వచ్చే విద్యుత్ డిమాండ్, లభ్యతపై సరైన అంచనాకు రావడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది. దీనికి తోడు ప్రభుత్వం వద్ద నుంచి సబ్సిడీ రూపంలో ఆర్థిక సహాయం ఎంత చేస్తారో స్పష్టత రావాల్సి ఉంది. ఫలితంగా సాంకేతిక, ఆర్థికపరమైన కారణాలతో వార్షిక వ్యయ అంచనాలు సమర్పించడానికి గడువు కావాలని కమిషన్‌ను డిస్కంలు కోరాయి. వాస్తవంగా ప్రతి ఏటా నవంబరు నెలాఖరుకు డిస్కంలు తమ వార్షిక అవసరాలపై ప్రతిపాదనలు ఇవ్వాల్సి ఉంది. కానీ ఎన్నికల కారణంగా డిసెంబరు వరకు గడువు ఇవ్వాలని తొలుత డిస్కంలు కోరాయి. ఇంకా ప్రతిపాదనల తయారీ పూర్తికాకపోవడంతో మార్చి నెలాఖరు వరకు గడువు కోరాయి. అయితే ఏప్రిల్ 1 నుంచి కొత్త చార్జీలు అమలుకావాల్సి ఉంది. టిఎస్ఇఆర్‌సి కొత్త చైర్మన్, సభ్యుల ఎంపికకు నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో డిస్కంలు గడువు కోసం గమనార్హం.

రెండేళ్లు మీడియాతో మాట్లాడను : రేవంత్

మనతెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ. రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. రెండు సంవత్సరాల పాటు మీడియాతో మాట్లాడనని చెప్పారు. ఇప్పటివరకు మీడియా కోసం మాట్లాడాను ఈ రెండు సంవత్సరాలు తనకోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్థి నరేందర్ రెడ్డితో పోటీపడి 9వేల ఓట్ల తేడాతో ఓడిపోయిన రేవంత్ రెడ్డి సోమవారం పార్టీ నాయకుల సమావేశం అనంతరం ఈ ప్రకటన చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఫైర్ బ్రాండ్‌గా పేరున్న రేవంత్ రెడ్డి నిర్ణయంతో పార్టీలోను, ఆయన అభిమానుల్లోనూ చర్చ జరుగుతోంది. అయితే పార్లమెంట్ స్థానానికి రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం పోటీలో నిలిపితే నిర్ణయం మార్చుకుంటారా? పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయనని చెపుతారానేది కాంగ్రెస్ వర్గాలో చర్చ నడుస్తోంది. మీడియాతో రెండు సంవత్సరాలు మాట్లాడనని చెప్పిన రేవంత్ రెడ్డి రాజకీయ వ్యూహం ఎలా ఉండబోతుందోనని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు నలుగురు అభ్యర్థులు ఎంపిక

మనతెలంగాణ/హైదరాబాద్ : గిరిజన సంక్షేమ శాఖలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్–1 పోస్టులకు నలుగురు అభ్యర్థులు ఎంపికయ్యారు. ఈ పోస్టుల భర్తీకి గత ఏడాది ఏప్రిల్ 14న సిబిఆర్‌టి పరీక్షలు నిర్వహించి, డిసెంబర్ 24న సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించినట్లు టిఎస్‌పిఎస్‌సి కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

వెబ్‌సైట్‌లో లైబ్రేరియన్ పోస్టుల ఎంపిక జాబితా

వివిధ గురుకుల విద్యాసంస్థల్లో లైబ్రేరియన్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు టిఎస్‌పిఎస్‌సి తెలిపింది. ఈ పోస్టుల భర్తీకి గత ఏడాది మే 12న రాత ప్రధాన పరీక్ష నిర్వహించి, డిసెంబర్ 19,20 తేదీలలో ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు.

7,8 తేదీలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్

వైద్య ఆరోగ్యశాఖలో ట్యూటర్ పోస్టులకు ఈ నెల 7,8 తేదీలలో నాంపల్లిలోని కమిషన్ కార్యాలయంలోని ఉదయం 10.30 గంటల నుంచి రెండవ విడత సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు టిఎస్‌పిఎస్‌సి తెలిపింది. ఈ పోస్టుల భర్తీకి 2017లో అక్టోబర్ 23,24 తేదీలలో ప్రధాన పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అభ్యర్థుల జాబితా, ఇతర వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు.

పంచాయతీ ఎన్నికల్లో విజయం మాదే



మనతెలంగాణ/హైదరాబాద్ : ఓటమి విజయానికి నాందిగా నిలుస్తుందని తెలంగాణ పిసిసి ఇన్‌ఛార్జి కుంటియా అన్నారు. శాసన సభ ఎన్నికల్లో ఓటమితో కాంగ్రెస్ పనైపోయిందనుకోవడం పొరపాటు అని చెప్పారు. ఎన్నికల అనంతరం ఢిల్లీకి వెళ్లిన కుంటియా సోమవారం హైదరాబాద్‌కు వచ్చి కాంగ్రెస్ ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఓటమి కారణాలపై చర్చించారు. ఓటమికి కుంగి పోకుండా ప్రజా క్షేత్రంలో దూకుడు పెంచాలని నిర్ణయించారు. అనంతరం మీడియాతో కుంటియా మాట్లాడుతూ శాసన సభ ఎన్నికల నిర్వహణ పై ఉన్న సందేహాలతో రాష్ట్రపతికి ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందనే ధీమాను తెలంగాణ పిసిసి ఛీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి వ్యక్తం చేశారు. అతి తక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయిన ధర్మపురి,ఇబ్రహీంపట్నం,కోదాడ స్థానాలపై ధర్మపోరాటం చేయనున్నట్లు చెప్పారు.

కన్న తల్లి మరిచింది..

ఖాకీ తల్లిలా పాలిచ్చింది

మానవత్వం చాటిన కానిస్టేబుల్ ప్రియాంక

మనతెలంగాణ, సిటీబ్యూరో : తాగిన మైకంలో కన్న తల్లి పసిపాపను(2నెలలు) ఓ వ్యక్తికి ఇచ్చి మర్చిపోగా కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఓ తల్లి పాలిచ్చి ఆకలి తీర్చింది. ఈ సంఘటన నగరంలో ఆదివారం రాత్రి ఉస్మానియా ఆస్పత్రి వద్ద జరిగింది. నగర పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్ కథనం ప్రకారం. నగరంలోని ఉస్మానియా ఆస్పత్రి వద్ద ఓ మహిళ నీరు తాగివస్తానని అక్కడ ఉన్న ఓ వ్యక్తికి ఇచ్చి వెళ్లింది. ఆమె ఎంతకీ తిరిగి రాకపోవడంతో పాప ఏడవడం ప్రారంభించింది. దీంతో పాపను యాకత్‌పురాలో ఉన్న తన ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ ప్యాకెట్ పాలు పట్టించేందుకు యత్నించగా తాగకుండా ఏడుపు ఆపలేదు. వెంటనే స్నేహితులతో కలిసి అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అక్కడ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ రవీందర్‌కు అప్పగించారు. పాప ఏడుపు ఎంతకూ ఆపకపోవడంతో తన భార్య అయిన కానిస్టేబుల్ ప్రియాంకకు ఫోన్ చేసి రమ్మన్నాడు. క్యాబ్‌లో అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి పాపకు పాలుఇచ్చి ఆకలి తీర్చింది. బేగంపేట మహిళా పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ప్రియాంక ప్రసూతీ సెలవులో ఉంది. పాప తల్లి ఆచూకి తెలియకపోవడంతో పెట్లబురుజు ప్రభుత్వ ప్రసూతీ ఆస్పత్రికి తరలించారు. తన కూతురు కనిపించడంలేదని ఓ మహిళ చెంచల్‌గూడ జైలు వద్ద ఏడుస్తుండడంతో ఎఎస్సై మహ్మద్ తహెరుద్దీన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి వివరాలు అడిగాడు. తన పేరు శభానా బేగం అని నగరంలోని ఫలక్‌నూమా, ఖాద్రీ చమన్ దర్గా వద్ద ఉంటానని, చెత్త ఏరుతూ బతుకుతున్నానని చెప్పింది. తనకు ఇద్దరు కుమార్తెలని సమ్రీన్ బేగం(5), ఫాతీమా బేగం(2నెలలు) అని చెప్పింది. ఆదివారం రాత్రి



తన చిన్న కూతురు ఫాతీమా బేగంను ఎవరికో ఇచ్చి మర్చిపోయానని తెలిపింది. కల్లుకు బానిసగా మారిన షాబానాబేగం, భర్త ఫిరోజ్ ఖాన్ మద్యం, వైటనర్‌కు బానిస కావడంతో పాటు దొంగతనం చేయడంతో పోలీసులు అరెస్టు చేశారు. షాబానా బేగంను ఆస్పత్రికి తీసుకెళ్లిగా పాప తల్లిని గుర్తుపట్టింది. ఫిరోజ్ ఖాన్ ఇంటరాగేషన్ వివరాలు, కుటుంబసభ్యుల వివరాలు తెలుసుకుని సరిపోవడంతో పాపను తల్లికి అప్పగించారు. పాపకు పాల్చిన ఆకలి తీర్చిన కానిస్టేబుల్ దంపతులను నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్,డిసిపి రమేష్‌రెడ్డి, ఎసిపి చేతన అభినందించారు.

దుప్పట్లు పంపిణీ చేసిన టిఆర్ఎస్ ఎన్అర్ఐ

మనతెలంగాణ/హైదరాబాద్ : రాజకీయాల్లోనే కాదు సామాజిక సేవలోను టిఆర్ఎస్ పార్టీ ఎన్ఆర్ఐ విభాగం ముందు వరసలోనే ఉంది. ప్రజలకు ఎలాంటి విపత్తు వచ్చినా స్పందించే టిఆర్ఎస్ ఎన్ఆర్ఐ సభ్యులు హైదరాబాద్‌లో సేవాకార్యక్రమాలు ప్రారంభించారు. ఉష్ణోగ్రతలు పడిపోయి చలికి వణుకుతూ ఫుట్‌పాత్‌లపై నివశిస్తున్న నిరుపేదలకు టిఆర్ఎస్ ఎన్ఆర్ఐ యుకె విభాగం సోమవారం దుప్పట్ల పంపిణీ చేశారు. ఇటీవల టిఆర్ఎస్ ఎన్నికల ప్రచారానికి వచ్చి హైదరాబాద్‌లో ఉన్న ఎన్ఆర్ఐ టిఆర్ఎస్ వ్యవస్థాపకుడు అనిల్ కూర్మాచలం, యుకె అధ్యక్షుడు అశోక్ గౌడ్ దూసరి దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం సేవాకార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చే ఎన్ఆర్ఐ బృందం ఈసారి దుప్పట్లను పంపిణీ చేశారని అనీల్ కూర్మాచలం చెప్పారు. సేవాకార్యక్రమాల్లో పాల్గొన్న యుకె ప్రతినిధులకు కృతజ్ఞతలు చెప్పారు.

పోలీసులకు అవార్డులు

మనతెలంగాణ, సిటీబ్యూరో : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పలువురు పోలీసులకు అవార్డులు ప్రకటించింది. పోలీస్ శౌర్య పథకం, మహోన్నత సేవా పథకం, ఉత్తమ సేవ, కఠిన సేవా, సేవా పథకాలకు గ్రేహౌండ్స్, ఇంటలీజెన్స్, ఎస్పీఎఫ్, విపత్తు నిర్వహణ సిబ్బంది, విజిలెన్స్, ఎసిబి సిబ్బందికి ప్రకటించారు. పోలీస్ శౌర్య పథకానికి గ్రేహౌండ్స్, ఇంటలీజెన్స్, ఎస్పీఎఫ్ నుంచి 16మంది, మహోన్నత సేవా పథకం పోలీసులు, ఎస్పీఎఫ్‌కు చెందిన 18మంది, ఉత్తమ సేవా పథకం పోలీసులు 91, ఎస్పీఎఫ్ నుంచి ఒకరిని, కఠిన సేవా పథకానికి 50మంది, సేవా పథకానికి పోలీసులు 371, 15మంది ఎస్పీఎఫ్ సిబ్బందిని ఎంపిక చేశారు. విపత్తు నిర్వహణ సిబ్బంది 16మంది, విజిలెన్స్‌లో 13, ఎసిబిలో 23మందిని అవార్డులకు ఎంపిక చేశారు. పోలీస్ శౌర్య పథకం ఎంపికైన వారికి నెలకు రూ.500 ఇంక్రిమెంట్, రూ.10,000 ఇన్‌సెంటివ్ ఇవ్వనున్నారు.

సిఎంవో ఉన్నతాధికారుల కొనసాగింపు

మన తెలంగాణ/హైదరాబాద్ : ముఖ్యమంత్రి కార్యాలయంలో వివిధ హోదాల్లో ప్రస్తుతం పనిచేస్తున్న ఉన్నతాధికారులకు రాష్ట్ర ప్రభుత్వం కొనసాగింపు ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు ముఖ్యకార్యదర్శిగా ఎస్.నర్సింగ్‌రావు (రిటైర్డ్ ఐఎఎస్) గత ప్రభుత్వం నుంచీ ముఖ్యమంత్రి కార్యాలయంలో ముఖ్య కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడినందున ఆయనను అదే బాధ్యతల్లో కొనసాగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక కార్యదర్శిగా పి. రాజశేఖర్‌రెడ్డి (ఐఎఎస్), కార్యదర్శులుగా స్మితా సబర్వాల్ (ఐఎఎస్), సందీప్ కుమార్ సుల్తానియా (ఐఎఎస్), అదనపు కార్యదర్శిగా కె. మాణిక్ రాజ్ (ఐఎఎస్)లను కూడా అదే హోదాల్లో కొనసాగేలా ప్రధాన కార్యదర్శి వేర్వేరు ఉత్తర్వులను జారీ చేశారు. ఇక సిఎంకు రాజకీయ కార్యదర్శిగా ఉన్న కె.భూపాల్ రెడ్డి (ఐఎఫ్ఎస్)ను ప్రత్యేక కార్యదర్శిగా నియమించారు.

జార్ఖండ్ 'పెట్టుబడి'కి

తెలంగాణ సాఫ్ట్‌వేర్

మన తెలంగాణ/హైదరాబాద్: జార్ఖండ్ రాష్ట్రంలోనూ రైతుబంధు పథకాన్ని అమలు చేసేందుకు అక్కడి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రానికి చెందిన ఉన్నతాధికారుల బృందం ఇటీవల రాష్ట్రంలో పర్యటించిన సంగతి తెలిసిందే. కొన్ని జిల్లాల్లోనూ ఆ బృందం అధ్యయనం చేసి వచ్చింది. అనంతరం తిరిగి వెళ్లిపోయారు. తెలంగాణలో ఈ ఏడాది ఖరీఫ్, రబీలకు కలిపి ఎకరానికి రూ. 8 వేల చొప్పున రైతులకు ఇచ్చారు. వచ్చే ఖరీఫ్ నుంచి దాన్ని ఏడాదికి రూ. 10 వేలు పెంచనున్నారు. అయితే జార్ఖండ్ ప్రభుత్వం మాత్రం ఎకరానికి రూ. 5 వేలు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలంగాణ వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. అంటే ఒక సీజన్‌కు ఎకరానికి రూ. 2,500 చొప్పున ఇచ్చే అవకాశముంది. మరోవైపు పశ్చిమబెంగాల్ ప్రభుత్వం కూడా రైతుబంధు పథకాన్ని అమలు చేస్తానని తాజాగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్కడి నుంచి ఒక ఉన్నతాధికారుల బృందం రాష్ట్రంలో పర్యటించి ఇక్కడ అమలు జరుగుతున్న తీరును పరిశీలిస్తుందని అధికారులు చెబుతున్నారు.

సాఫ్ట్‌వేర్ తీసుకునే యోచన

జార్ఖండ్ ప్రభుత్వం అక్కడ రైతుబంధును అమలు చేస్తే తెలంగాణకు చెందిన సాఫ్ట్‌వేర్‌ను తీసుకునే అవకాశముందని సమాచారం. ఈ మేరకు తెలంగాణ అధికారులను వారు కోరినట్లు తెలిసింది. రైతు బంధు పథకాన్ని రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేయడంలో వ్యవసాయశాఖ భారీ కసరత్తు చేసింది. రైతుల వివరాలు, వారికి ఉన్న భూమి వివరాలను పక్కాగా రూపొందించింది. ఒకటికి నాలుగుసార్లు పరిశీలించింది. ఈ మేరకు సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధిపరిచింది. దీంతో పొరపాట్లు తలెత్తకుండా పథకం అమలుజరిగింది. ఈ నేపథ్యంలో మన సాఫ్ట్‌వేర్‌ను తీసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. అవసరమైన ఆ రాష్ట్ర అధికారులకు ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చే అవకాశమున్నట్లు తెలిసింది.

ఫొటోలు మార్ఫింగ్ చేస్తున్న బాల సైబర్ నేరగాడి అరెస్ట్

మనతెలంగాణ, సిటీబ్యూరో : యువతుల ఫోటోలు సేకరించి వాటిని మార్ఫింగ్ చేసి వేధిస్తున్న సైబర్ నేరగాడిని సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సైబర్ క్రైం ఇన్స్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం ప్రకారం... తమిళనాడు రాష్ట్రం మధురైకు చెందిన ఓ బాలుడు నకిలీ ఇన్‌స్టాగ్రాం ఖాతా తెరిచి మహిళలకు ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపుతున్నాడు. వారు రిక్వెస్ట్‌ను అంగీకరించగానే వారి ఫోటోలు సేకరించి మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టింగ్ చేస్తున్నాడు. ఓ యువతి డిసెంబర్, 2018లో సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె మార్ఫింగ్ ఫోటోలను ఆమెకు పంపించాడు. తను చెప్పినట్లు వినకుంటే మార్ఫింగ్ ఫోటోలు సోషల్ మీడియాలో పెడుతానని హెచ్చరించాడు. యువతి బంధువులు, స్నేహితుల ఫోటోలు ఇవ్వాలని బెదిరించాడు. దానికి నిరాకరించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేసిన పోలీసులు తమిళనాడు రాష్ట్రం మధురైకు చెందిన బాలుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సైబరాబాద్ సైబర్ క్రైం ఎసిపి శ్రీనివాస్ కుమార్, డిసిపి జానకీ శర్మిల పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేశారు.

రైల్వే బోర్డు చైర్మన్‌గా వినోద్‌కుమార్



మన తెలంగాణ / న్యూఢిల్లీ, హైదరాబాద్ : రైల్వే బోర్డు చైర్మన్‌గా ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఐఆర్ఎస్ఇ అధికారి వినోద్ కుమార్ యాదవ్ నియమితులయ్యారు. ఆ హోదాలో ఆయన భారత ప్రభుత్వ ఎక్స్ అఫీషియో ప్రిన్సిపల్ సెక్రెటరీగా కూడా బాధ్యతలు నిర్వహిస్తారు. కేంద్ర ప్రభుత్వ ఉన్నత స్థాయి నియామక మంత్రివర్గ కమిటీ ఆయన నియామకాన్ని అమోదించింది. ప్రస్తుతం రైల్వే బోర్డు ఛైర్మన్ ఉన్న ఆశ్వనీ లోహాని స్థానంలో వినోద్‌కుమార్ త్వరలో బాధ్యతలు స్వీకరిస్తారు. భారతీయ రైల్వే సర్వీస్ ఆఫ్ ఎక్ట్రికల్ ఇంజనీర్స్ (ఐఆర్ఎస్ఇ) 1980 బ్యాకి చెందిన వినోద్ కుమార్ యాదవ్ ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ యూనివర్సిటీ నుంచి ఎంబిఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్) డిగ్రీ, ఎక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బేచలర్ డిగ్రీ పొందారు. భారతీయ రైల్వేలో 1982లో అసిస్టెంట్ ఎక్ట్రికల్ ఇంజనీర్‌గా ప్రారంభమైన సర్వీసు వివిధ రైల్వే సంస్థల్లో కార్యనిర్వహకుడిగా పనిచేశారు. డిల్లీ డివిజన్‌లో ఎడిఆర్ఎం (ఆపరేషన్)గా, లక్నో డివిజన్‌లో డిఆర్ఎంగా, ఉత్తర రైల్వే జోన్‌లో ఛీఫ్ ఎక్ట్రికల్ ఇంజనీర్ (ప్లానింగ్ / ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్)గా గతంలో పనిచేశారు. కేంద్ర పరిశ్రమల మంత్రిత్వశాఖలో, ఐఆర్‌సిటిసి లో, రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్‌లో, ఐక్య రాజ్య సమితి పారిశ్రామికాభివృద్ధి సంస్థలో డిప్యుటేషన్‌పై కొంతకాలం పనిచేశారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా తన పదవీ కాలంలో గత ఆర్థిక సంవత్సరంలో రూ. 13,673 కోట్ల ఆదాయాన్ని సాధించడంతో జోన్ చరిత్ర సృష్టించింది. ఆరు ఎఫీషియన్సీ షీల్డ్‌లను సొంతం చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కి భారతీయ రైల్వేలోనే మొట్టమొదటి గ్రీన్ రైల్వే స్టేషన్‌గా గ్రీన్‌కో ప్లాటినం రేటింగ్ అవార్డు లభించింది. ఈ కృషికి వ్యక్తిగత స్థాయిలో ఉత్తమ అవార్డు లభించింది.

13 నుంచి పతంగుల పండుగ

మన తెలంగాణ/హైదరాబాద్ : అంతర్జాతీయ పతంగుల పండుగ, మిఠాయిల పండుగలకు హైదరాబాద్ మరోమారు వేదికైంది. జనవరి 13 నుంచి 15వ తేదీ వరకు సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ వేడుకలు జరుగుతాయి. అంతర్జాతీయ పతంగుల పండుగకు అనుబంధంగా స్వీట్స్ ఫెస్టివల్ జరుగుతుంది. ఈ పండుగల నిర్వహణ, ఏర్పాట్లపై బేగంపేటలోని పర్యాటక భవన్‌లో టూరిజం శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. గత సంవత్సరం స్వీట్స్ ఫెస్టివల్‌లో 1000 రకాల స్వీట్స్‌ను ప్రదర్శించామని, వివిధ రాష్ట్రాలతో పాటు 15 దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొని, వారి సంప్రదాయక మిఠాయిలను అందరికీ రుచిచూపారని వెంకటేశం అన్నారు. దాదాపుగా 8 లక్షల మంది వరకు సందర్శకులు పాల్గొన్నారు. వెయ్యి రకాల స్వీట్లు, వివిధ రకాల పతంగులను ఒకే వేదికపై చూడడానికి సందర్శకులు రావడంపై వెంకటేశం ఆనందం వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం నిర్వహించే స్వీట్స్ ఫెస్టివల్‌కు సుమారు 20 దేశాల ప్రతినిధులు హాజరై తమ స్వీట్ స్టాళ్లను ఏర్పాటు చేశారు. 10 లక్షల మంది సందర్శకులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. దీనికి తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలని పర్యాటక శాఖ



కార్యదర్శి వెంకటేశం సమావేశంలో పాల్గొన్న వివిధ రాష్ట్రాలు, దేశాలకు చెందిన ప్రతినిధులకు సూచించారు.

స్వాతంత్ర్య సమరయోధుడు పొట్ల మలుసూరయ్య మృతి



మనతెలంగాణ/తిరుమలాయపాలెం: ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం తిప్పారెడ్డి గూడెం గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమర యోధులు, గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పొట్ల మలుసూరయ్య (86) తీవ్ర అస్వస్థతకు గురై సోమవారం హైద రాబాద్‌లోని నిమ్స్ హాస్పటల్‌లో మృతి చెందారు. మృతునికి భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. గ్రామ సర్పంచ్‌గా పనిచేసిన కాలంలో గ్రామాభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేసి ప్రజా మన్ననలు పొందారు. మాజీ మంత్రులు సంభాని చంద్రశేఖర్, రాంరెడ్డి వెంకటరెడ్డిలకు అనుచరునిగా మెలిగారు. మరోపక్క గ్రామంలో మున్నేరుపై లిఫ్టు ఇరిగేషన్ నిర్మాణంతోపాటు బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేశారు. ఈ ప్రాంతానికి సాగు, తాగునీటితోపాటు ఇతర మౌలిక వసతుల కల్పనకు తుది శ్వాస వరకు కృషి చేశారు. ఆయన మృతి వార్త తెలియగానే గ్రామ ప్రజలు తిప్పారెడ్డిగూడెంలోని ఆయన స్వగృహానికి చేరుకుని విలపించారు. గ్రామ సరిహద్దు తండాల్లో నివసిస్తున్న గిరిజనులకు విద్యా, వైద్యంతోపాటు అన్ని మౌలిక వసతుల కల్పనకు కృషి చేశారు. ఆయన మృతి వార్త తెలియగానే ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్, టిఆర్‌ఎస్, సిపిఎం, టిడిపి, సిపిఐఎంఎల్ ఎన్‌డి, బిజేపి నాయకులతోపాటు బంధువులు, స్నేహితులు ఉన్నారు. ఆయన మృతి పట్ల సంతాపం తెలిపిన వారిలో పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

పదవీ విరమణ రోజే ఎఎస్‌ఐకి పదోన్నతి



మనతెలంగాణ/ఖమ్మం క్రైం: ఖమ్మం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ లో ఎఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న పి.ఫరీద్‌బాబు సోమవా రం సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్న తి కల్పిస్తూ పోలీస్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ ఉత్తర్వులు జా రీ చేశారు. ఉద్యోగ విరమణ పొందుతున్న తరుణంలో ఫరీద్‌బాబుకు పదోన్నతి కల్పించేందుకు సిపి తీసుకున్న ప్రత్యేక చొరవతో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉత్వర్వు లు అందజేశారు. ఈ సందర్భంగా సిపి ఆయనకు పూలమాలలు వేసి ఘన ంగా సన్మానించి, ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పోలీస్ క మిషనర్ ఇక్బాల్ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగ నిర్వహణలో అంకితభావం తో పనిచేసి అందరి మన్ననలు పొందారని కొనియాడారు. పోలీస్ విభాగం లో సుదీర్ఘ కాలంగా విధులు నిర్వహించి, ఆయన చేసిన సేవలు మరువమ ని పదవీ విరమణ చేసిన పోలీస్‌లు వారి కుటుంబంలో ఎలాంటి సమస్య లు వచ్చినా సంప్రదించవచ్చన్నారు. పోలీస్ రిక్రూట్‌మెంట్ తన వృత్తికే కా ని తన వ్యక్తిత్వానికి కాదన్నారు. విధి నిర్వహణలో పగలనకా, రాత్రనకా ప ండుగల సమయంలో భార్య పిల్లలకు దూరంగా ఉండి విధులు నిర్వర్తించారని, ఇకపై కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించా రు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపిఎస్ అధికారి వినీత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కృషితోనే రాష్ట్రాభివృద్ధి

రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ బిఎస్.రాములు

మనతెలంగాణ/జగిత్యాల: విద్యార్థుల నిరంతర కృషి వల్లే తెలంగాణ అభివృద్ధి సాధ్యపడుతుందని రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ బిఎస్.రాములు అన్నారు. డాక్టర్ కర్రె సదాశివ్ పిహెచ్‌డి చేసిన 'బిఎస్.రాములు సాహిత్యం సమగ్ర పరిశీలన ' అనే గ్రంథాన్ని సోమవారం తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బిఎస్. రాములు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత విద్యావకాశాలు కల్పించే ఎన్నో విద్యా సంస్థలు ఉన్నాయని, విద్యార్థులు నిత్యం కృషి చేస్తూ ఉన్నత ఉద్యోగాలు పొందాలన్నారు. తమ మేధో సంపత్తితో రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చే అవకాశం విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు.

సిఐసి చీఫ్ కమిషనర్ సుధీర్

న్యూఢిల్లీ : నూతన చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా సుధీర్ భార్గవను కేంద్ర ప్రభుత్వం సోమవారం నియమించింది. ఇప్పటికే కేంద్రీయ సమాచార కమిషన్‌కు కొత్తగా నలుగురు కమిషనర్లను నియమిస్తూ ప్రభుత్వం ప్రకటన వెలువరించింది. ప్రస్తుతం సమాచార కమిషనర్‌గా ఉన్న భార్గవను ప్రధాన కమిషనర్‌గా నియమించారు. సిఐసికి మంజూరు అయిన కమిషనర్ల సంఖ్య 11. అయితే ఇప్పటివరకూ కేవలం ముగ్గురు కమిషనర్లతోనే దీనిని నిర్వహిస్తున్నారు. తాజాగా నలుగురిని కలిపారు. అయినప్పటికీ ఇంకా నలుగురి కమిషనర్ల నియామకం జరగాల్సి ఉంది. సిఐసిలో ఇప్పుడున్న కమిషనర్లలో వనజ ఎన్ సర్నా ఒక్కరే మహిళ.

కార్మికుల జాడకు నేవీ విఫలయత్నాలు

షిల్లాంగ్ : మేఘాలయా బొగ్గు గనులలో చిక్కుపడ్డ కార్మికుల జాడకు సోమవారం నౌకాదళ డైవర్స్ తిరిగి ప్రయత్నం చేశారు. అత్యంత ఇరుకైన కన్నం ఉన్న ఈ గని అట్టడుగు ప్రాంతానికి చేరుకునేందుకు చేస్తున్నయత్నాలు ఎంతకూ ఫలించడం లేదు. 350 అడుగుల లోతు ఉన్న ఈ గనులలో కార్మికులు చిక్కుపడి సోమవారానికి 18 రోజులు అయింది. ఆదివారం ఈ నౌకాదళ గజ ఈతగాళ్లు నీటి మట్టం లెక్కలు సరిగ్గా అంచనా వేసుకోలేకపోవడంతో అడుగు ప్రాంతానికి చేరలేకపొయ్యారు. నీటి మట్టం 75 అడుగులు ఉంటుందని తొలుత విశ్లేషించారు. అయితే దీని మట్టం 125 అడుగుల వరకూ ఉన్నట్లు డైవింగ్ ప్రక్రియ దశలో వెల్లడైంది. దీనితో వారి ప్రయత్నాలు ఫలించలేదు. సోమవారం కూడా డైవర్లు తిరిగి ప్రయత్నాలు చేశారు. ఓ వైపు నీటిని తొడేసే యంత్రాలు పనిచేస్తూ ఉన్నా నీటి మట్టం తగ్గిపోకపోవడంతో కార్మికుల ఉనికి పసికట్టడం వీలు కావడం లేదని జాతీయ విపత్తు నిర్వహణ బలగాల బృందాల అధికారులు తెలిపారు.

బంగ్లాదేశ్‌లో హసీనా ఘన విజయం

288/ 300 స్థానాలు ...ప్రతిపక్షం నిరసన

ఢాకా : బంగ్లాదేశ్‌లో ప్రధాని షేక్ హసీనాకు చెందిన అధికార కూటమి ఘన విజయం సాధించింది. సార్వత్రిక ఎన్నికలలో హసీనా కూటమికి ఇది వరుసగా మూడో విజయం. ఆదివారం నుంచే వెలువడుతోన్న ఎన్నికల ఫలితాలలో అధికార పార్టీ ఆధిక్యత సాగుతూ వచ్చింది. అయితే ఈ ఫలితాలను తాము తిరస్కరిస్తున్నట్లు ప్రతిపక్ష జాతియా ఓయిక్యా ఫ్రంట్, నేషనల్ యూనిటి ఫ్రంట్‌లు ప్రకటించాయి. అవామీ లీగ్ నాయకత్వంలోని మహా కూటమి పార్లమెంట్‌లోని మొత్తం 300 స్థానాలలో 288 స్థానాలలో విజయం సాధించింది. దీనితో దాదాపు 82 శాతం ఓట్లను రాబట్టుకున్నట్లు వెల్లడైంది. 2008 ఎన్నికలలో అవామీ లీగ్ నాయకత్వ కూటమికి 263 స్థానాలు వచ్చాయి. ఇప్పుడు ఈ ఆధిక్యత పెరిగింది. ప్రతిపక్షాలకు కేవలం ఏడు సీట్లు వచ్చాయి. ఇతరులకు మూడు దక్కాయి. ప్రతిపక్షాలకు 15 శాతం ఓట్లు పోలయ్యాయి. ఎన్నికలలో అనేక అక్రమాలు జరిగాయని , ఫలితాన్ని తాము అంగీకరించడం లేదని ప్రతిపక్షాలు తెలిపాయి. 71 సంవత్సరాల హసీనా నాలుగోసారి ప్రధాని పదవికి పోటీకి దిగారు. ఆమెకు ప్రధాన ప్రత్యర్థిగా చిరకాల వైరం ఉన్న బిఎన్‌పి నేత ఖలీదా జియా అవినీతి కేసులలో ప్రస్తుతం ఢాకా జైలులో ఉన్నారు. ఆమె ఆరోగ్యం కూడా దెబ్బతింటోంది . రాజకీయ భవిష్యత్తు కూడా క్షీణించింది. ప్రస్తుత ఎన్నికలు ఓ ప్రహసనం అని, ఫలితాలను రద్దు చేసి తిరిగి ఎన్నికలు జరిపించాలని బిఎన్‌పి సెక్రెటరీ జనరల్ మీర్జా ఫక్రుల్ ఇస్లామ్ అలంగిర్ డిమాండ్ చేశారు. ఇతర ప్రతిపక్షాలు కూడా ఇదే విధమైన డిమాండ్‌తో ఎన్నికల సంఘానికి ఇప్పటి ఎన్నికలపై ఫిర్యాదులు అందించాయి.

తుది దశకు స్మార్ట్‌గ్రిడ్ పనులు

- ఫిబ్రవరిలో అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు
- రాష్ట్రంలో మొదటి పైలెట్ ప్రాజెక్ట్
- జీడిమెట్ల పారిశ్రామికవాడలో తీరనున్న విద్యుత్ సమస్యలు







మనతెలంగాణ/కుత్బుల్లాపూర్: జీడిమెట్ల పారిశ్రామిక వాడలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ గ్రిడ్ ప్రాజెక్టు పనులు వేగవంతంగా సాగుతున్నాయి. రానున్న ఫిబ్రవరి నెల నాటికి అదుబాటులోకి రానుంది. తద్వారా విద్యుత్ సమస్యలను అధిగమించేందుకు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా రూ.33 కోట్లతో జీడిమెట్ల పారిశ్రామికవాడలో అత్యంత ప్రయోగాత్మకంగా పైలెట్ ప్రాజెక్టును చేపట్టారు. దేశవ్యాప్తంగా 14 పైలెట్ ప్రాజెక్టులను ఎంపిక చేయగా అందులో మన రాష్ట్రం నుంచి మేడ్చల్ జిల్లాలో ఉన్న జీడిమెట్ల పారిశ్రామికవాడను ఎన్నుకున్నారు. ఇందుకు అనుగుణంగా టిఎస్‌ఎస్‌పిడిసిఎల్ అధికారులు తమకు దక్కిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇందుకు తగిన విధంగానే ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతూ ఇప్పటికే 90 శాతం ఇన్‌స్టాలేషన్స్ పనులను పూర్తి చేయగలిగారు. మరో 15 రోజుల్లో కమ్యూనికేషన్ పనులను కూడా పూర్తి చేసే విధంగా పనులను ముమ్మరం చేశారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌తోపాటు నిరంతరాయ సేవలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వాలు స్మార్ట్ గ్రిడ్‌లను ఏర్పాటు చేస్తున్నాయి. విద్యుత్ సరఫరా పూర్తిగా కంట్రాల్ రూం పర్యవేక్షణలో ఆన్‌లైన్ ద్వారా సేవలను అందించే అవకాశం ఉంటుంది. జీడిమెట్ల పారిశ్రామికవాడలో ఏర్పాటవుతున్న స్మార్ట్ గ్రిడ్ అందుబాటులోకి వస్తే 12 వేల మంది వినియోగదారులకు సేవలను అందించే అవకాశం ఉంది. 16 కిలోమీటర్ల విస్తీర్ణంలో దీని ప్రభావం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

పర్యవేక్షణ ఇలా...

స్మార్ట్ గ్రిడ్‌ల ఏర్పాటుకు డిఎస్, ఐటి, స్కాడా అమలు కోసం అధునాతన మీటర్స్ ఇన్‌ఫ్రాస్టక్చర్, డిస్ట్రిబ్యూషన్ ఆటోమేషన్ కోసం ఆర్‌ఎపిడిఆర్‌సిపి విభాగాలుగా ప్రాజెక్టు పనులు సాగుతున్నాయి. డేటా కంట్రోల్ యూనిట్స్, రూటర్స్, మీటర్ డేటా సేకరణ వ్యవస్థ, మీటర్ డేటా, మేనేజ్‌మెంట్స్ తదితర సౌకర్యాలు వినియోగదారులకు అందుబాటులోకి రానున్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా 8882 సింగిల్ ఫేజ్ స్మార్ట్ మీటర్లను అమర్చాల్సి ఉండగా ఇప్పటికే 84020 మీటర్లను అమర్చారు. 2200 డిసియులు, 400 రూటర్స్, 71 ఆటో రీక్లోజర్స్, 89 సెక్షన్ లైజర్స్, 82 ఆర్ఎంయులు ఇప్పటికే అమర్చారు. స్మార్ట్ గ్రిడ్ నెట్‌వర్క్ పర్యవేక్షణ, నియంత్రణ కోసం నగరంలోని అమీర్‌పేట కల్యాణ్‌నగర్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూంను కూడా ఏర్పాటు చేస్తారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించవచ్చు



స్మార్ట్ గ్రిడ్ ప్రాజెక్టును వచ్చే ఫిబవరి నాటికి అందుబాటులోకి తీసుకురావడానికి అన్ని విధాలుగా ఏర్పాట్లు చేస్తున్నామని జీడిమెట్ల డిఇ టి.గరుత్మంత్‌రాజు తెలిపారు. విద్యుత్ అంతరాయాలు, హెచ్చుతగ్గులు తదితర సమస్యలను ఆన్‌లైన్‌లోనే గుర్తించే అవకాశం స్మార్ట్‌గ్రిడ్‌ల ఏర్పాటుతో కలుగుతుందన్నారు. తద్వారా సమస్యలను వెనువెంటనే గుర్తించి తగిన విధంగా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. ఇలా చేయడం వల్ల వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండానే నిరంతరాయంగా సమస్యను పరిష్కరించడంతోపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

టి.గరుత్మంత్‌రాజు, జీడిమెట్ల డిఇ

నిప్పంటుకొని మూడిళ్లు దగ్ధం

రూ.35 లక్షల ఆస్తి నష్టం • కట్టుబట్టలతో వీధినపడిన కుటుంబీకులు



మన తెలంగాణ / ఆసిఫాబాద్ ప్రతినిధి :ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మూడు ఇళ్లు దగ్ధమైన సంఘటన కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని బురుగుడాత గ్రామంలో చోటు చేసుకుంది. సోమవారం మధ్యాహ్నం 12గంటల సమయంలో బురుగుడాత గ్రామానికి చెందిన బోడ సంతయ్య ఇంటి నుంచి పొగలు రావడంతో చుట్టుపక్కల వారు గమనించి ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించే లోపే భారీగా మంటలు చెలరేగాయి. దీంతో ఆ ఇంటి పక్కనే ఉన్న మరో రెండు ఇళ్లకు మంటలు వ్యాపించాయి. పక్కనే ఉన్న బోడ పుల్లయ్య, బోడ నారాయణ ఇళ్లకూడా పూర్తిగా కాలిపోయాయి. ఈ అగ్నికి బోడ సంతయ్య ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలిపోవడంతో మంటలు మరింత ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. దీంతో ఆ మూడు ఇళ్లు పూర్తిగా దగ్ధం కావడంతో కుటుంబీకులు కట్టుబట్టలతో వీధినపడ్డారు. సోమవారం ఉదయం బోడ సంతయ్య కూలి పనికి వెళ్లగా అతని భార్య పని నిమిత్తం ఆసిఫాబాద్‌కు వెళ్లింది. బోడ పుల్లయ్య కుటుంబీకులు కూడా పత్తి ఏరడానికి చేనుకు వెల్లడంతో బోడ నారాయణ వృద్ధుడు ఒక్కడే ఇంట్లో ఉండటంతో చుట్టు పక్కల వారు అతన్ని ఇంట్లో నుంచి బయటకు తీసుకొచ్చారు. మధ్యాహ్న సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో భారీగా మంటలు చెలరేగి మూడు ఇండ్లు పూర్తిగా కాలిపోయాయి. బోడ సంతయ్య నూతన ఇంటి నిర్మాణం కోసం రూ.నాలుగు లక్షల నగదును ఇంట్లో దాచుకోగా పూర్తిగా కాలిబూడిదయ్యాయి. అతని భార్యకు చెందిన ఎనిమిది తులాల బంగారు నగలతోపాటు ఇంట్లో కూలర్, టివి, ఫ్రిజ్, ఎలక్ట్రానిక్ వస్తువులు, పట్టాపాస్ పుస్తకాలు, డాక్యుమెంట్లు పూర్తిగా కాలిపోయాయి. రూ.15లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని, బోడ పుల్లయ్య, నారాయణలకు పది లక్షల చొప్పున ఆస్తి, మొత్తం 35లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు తహసీల్దార్ కిషన్ పంచనామా నిర్వహించి తెలిపారు.

'ముందస్తు'గా బాబుకు బుద్ధిచెప్పాం

- విభజనను వ్యతిరేకించానని నిన్నకూడా అంగీకరించారు
- చంద్రబాబుపై కెసిఆర్ వ్యాఖ్యలు ముమ్మాటికీ సబబే
- మీడియా సమావేశంలో ఏపి సిఎంపై ఎంపి గుత్తా సుఖేందర్‌రెడ్డి ధ్వజం



మన తెలంగాణ/ నల్లగొండ ప్రతినిధి: దేశ ప్రజలంతా చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలు, కపట నాటకాలను నిశితంగా గమనిస్తున్నారని నల్లగొండ పార్లమెంటు సభ్యులు, రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షులు గుత్తా సుఖేందర్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం ఆయన తన నివాసంలో నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డిలతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన ముందస్తు ఎన్నికల్లో తెలంగాణలో కెసిఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని కుతంత్రంతో చంద్రబాబు ఎన్ని నాటకాలు ఆడినా తెలంగాణ ప్రజలు చవుదెబ్బతీసి చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఎపి సిఎం చంద్రబాబుపై చేసిన ప్రతి వ్యాఖ్య కూడా ముమ్మాటికీ సబబేనంటూ, ప్రతిమాట నూటికినూరుశాతం నిజమే మాట్లాడారని అన్నారు. రాష్ట్ర విభజనను వ్యతిరేకించానని నిన్నటికి నిన్న కూడా ఆంధ్ర మీడియా సమావేశంలో చంద్రబాబు అంగీకరించాని గుర్తు చేశారు. తెలంగాణలోని ముందస్తు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చంద్రబాబు డబ్బులు ఇవ్వలేదని తిరుపతి వెంకన్నస్వామి మీద ప్రమాణం చేయగలరా? అన్ని ప్రశ్నించారు. తెలంగాణలోని కాంగ్రెస్ నాయకులకు ఆంధ్ర సిఎం చంద్రబాబు రూ.500కోట్లు పంపించడం నిజం కాదా? అని అన్నారు. దేశంలో కుట్రలకు, మోసాలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు అని, మొన్నటి వరకు బిజెపి సంకనెక్కి తిరిగారని, ఇప్పుడు రాహుల్‌గాంధీ చుట్టూ తిరుగుతున్నారని, చంద్రబాబు అంటే ఏమిటో దేశ ప్రజలందరికి తెలుసు అని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా కెసిఆర్ ప్రధానమంత్రిని కలిస్తే చంద్రబాబు అవహేళనగా మాట్లాడడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. చంద్రబాబుకు హైకోర్టు విభజన ఇష్టం లేదని, అందుకోసమే ఇప్పటివరకు అక్కడ హైకోర్టు భవనం ఏర్పాటుచేసుకోలేదని, కావాలనే చంద్రబాబు ఇన్నిరోజులు ఉద్దేశ్యపూర్వకంగా ఆలస్యం చేశారని ఆరోపించారు.

టేబుల్ టెన్నిస్ జట్టు రాష్ట్ర మేనేజర్‌గా పుష్పవాణి

ఆదర్శ పాఠశాల పిఈటికి అరుదైన అవకాశం • జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు వడోదరకు పయనం



మన తెలంగాణ/పెద్దశంకరంపేట: తెలంగాణ ఆదర్శ పాఠశాల తిరుమలాపూర్ పాఠశాలలో పిఈటిగా పనిచేస్తున్న పుష్పవాణికి అరుదైన అవకాశం లభించింది. ఆమె తెలంగాణ టేబుల్ టెన్నిస్ జట్టు మేనేజర్‌గా మన రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. జాతీయ స్థాయిలో జనవరి 2 నుంచి 6 వరకు గుజరాత్ రాష్ట్రంలోని వడోదరలో నిర్వహించే జాతీయ స్థాయి 14 సంవత్సరాల లోపు బాల బాలికల పాఠశాల క్రీడా సమాఖ్య అధ్వర్యంలో జరిగే టేబుల్ టెన్నిస్ పోటీలకు రాష్ట్ర జట్టు తరపున మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. సోమవారం ఆమె వడోదర బయలు దేరేముందు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రం తరపున ఈ అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నాని చెప్పారు. జాతీయ స్థాయిలో తెలంగాణ జట్టు విజయం సాధించేలా ఆటగాళ్లకు మంచి తర్ఫీదు ఇస్తానని చెప్పారు. తనపై నమ్మకం ఉంచి తనను ఎంపిక చేసిన జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ రవికాంత్ రావుకు, పాఠశాల క్రీడా సమాఖ్య (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎస్‌జిఎఫ్) కార్యదర్శి కిశోర్‌కుమార్, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పిడి ఎస్‌జిఎఫ్ జిల్లా కన్వీనర్ ఆర్.నాగరాజులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పుష్పవాణి తమ పాఠశాల నుంచి జాతీయ స్థాయిలో జట్టు మేనేజర్‌గా ఎంపిక కావడం పట్ల తిరుమలాపూర్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సభావత్ విఠల్ నాయక్, (ఎస్.వి), ఇతర సిబ్బంది హర్షం వెలిబుచ్చారు.

100 రోజులు.. 20 రాష్ట్రాలు

దేశవ్యాప్త ప్రచారానికి మోడీ సన్నాహాలు



న్యూఢిల్లీ : వంద రోజులలో 20 రాష్ట్రాలలో పర్యటించడమే ప్రధాని నరేంద్ర మోడీ ప్రస్తుత లక్ష్యంగా పెట్టుకున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికలకు మెరుపు వేగపు పర్యనకు దిగాలనిచ పార్టీ శ్రేణులలో ఉత్తేజం నింపాలని యోచిస్తున్నారు. ఈ విషయాన్ని బిజెపి సీనియర్ నిర్వాహకులు ఒకరు సోమవారం తెలిపారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి పరాజయం మూటగట్టుకుంది. ఇది పార్టీ ప్రతిష్టను దెబ్బతీసింది. లోక్‌సభ ఎన్నికల నాటికి సరైన రీతిలో నష్ట నివారణ జరగకపోతే మొదటికే మోసం, కేంద్రంలో అధికారానికే ఎసరు అని పార్టీ శ్రేణులు, ప్రత్యేకించి బిజెపి అధినేత అమిత్ షాలో బోలెడు కలవరం పట్టుకుంది. ప్రసంగ చాతుర్యంలో దిట్టగా ఉన్న ప్రధానిని ఎక్కువగా ప్రచారానికి కేంద్రీకృతం చేసుకోవల్సి ఉంటుందని బిజెపి వర్గాలు భావిస్తున్నాయి. ప్రతిపక్షాలు కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంఘటితం అవుతున్న వైనాన్ని బిజెపి జాగ్రత్తగా పరిశీలిస్తోంది. దీనికి విరుగుడుగా వివిధ ప్రాంతాలలో విజయానికి నూతన వ్యూహాలను, అవసరం అయిన చోట్ల తాజాగా ఎన్నికల సర్దుబాట్లను కుదుర్చుకోవాలని సంకల్పించినట్లు బిజెపి వర్గాలు తెలిపాయి. ప్రధానంగా వచ్చే వంద రోజులలో అంటే దాదాపు మూడు నెలల కాలంలో 20 రాష్ట్రాలలో ప్రధాని పర్యటనను ఖరారు చేస్తారు. గత లోక్‌సభ ఎన్నికలలో ఫలితాలు, పార్టీకి దక్కిన సీట్లను విశ్లేషించుకుని తదనుగుణంగా బిజెపి మిషన్ 123ని ఖరారు చేసుకుంది. అప్పట్లో బిజెపికి అసాధారణ రీతిలో 282 స్థానాలు వచ్చాయి. అయితే మోడీ గాలి బలంగా ఉన్నా తాము పోటీ చేసిన 123 స్థానాలలో బిజెపికి విజయం దక్కలేదు. ఇప్పుడు ఈ స్థానాలపై దృష్టి సారిస్తూ మిషన్ 123ను జాగ్రత్తగా రూపొందించారు. దీని మేరకు ఆయా నియోజకవర్గాలను బిజెపి గత ఏడాది 25 సముదాయాలుగా గుర్తించింది. ఒక్కోదానికి ఒక్కో నేతను పర్యవేక్షకుడిగా నియమించారు. ఇప్పుడు ప్రధాని రాబోయే వంద రోజులలో జరిపే 20 రాష్ట్రాల ప్రచార యాత్రంలో బిజెపి విజయావకాశాలు బాగా ఉన్న ప్రాంతాలను ఇప్పటికే 123 సముదాయాలుగా గుర్తించారు. వీటిలో ప్రధాని పర్యటనకు విశేష ప్రాధాన్యత ఇవ్వనున్నారని తెలిసింది. ఈ సముదాయాలలో బిజెపి కార్యకర్తలకు ఉత్సాహం కల్పించడం, ఓటర్ల మద్దతు పొందడానికి మోడీ సభలు ఏర్పాటు అవుతాయి. పశ్చిమ బెంగాల్, ఒడిషా, అసోం వంటి రాష్ట్రాలలో మొత్తం లోక్‌సభ స్థానాలు 77 వరకూ ఉన్నాయి. అయితే బిజెపికి వీటిలో దక్కింది కేవలం పది స్థానాలే. మిషన్ 123లో ఇటువంటి బలహీన ప్రాంతాలను గుర్తించారు. బిజెపి పట్ల మోడీ పట్ల సానుకూలత ఉన్న ప్రాంతాల కన్నా ఆదరణ లేని ప్రాంతాలపై దృష్టి సారించడం వల్ల వీటిని కూడా గెల్చుకునేందుకు వీలుంటుందని విశ్లేషించుకున్నారు. ఈ రాష్ట్రాలతో పాటు కేరళ, తమిళనాడు, తెలంగాణ వంటి ప్రాంతాలలో కూడా బిజెపి బలం అంతగా లేదు. లోక్‌సభ ఎన్నికలలో ఇక్కడ కూడా పుంజుకునేందుకు బిజెపి యోచిస్తోంది. ప్రధాని మోడీనే ఇప్పటికీ తిరుగులేని ఆదరణయుత నేత, కేంద్రంలో సుస్థిర ప్రభుత్వ స్థాపన సామర్థ్యం ఆయనకే సొంతం అని బిజెపి ప్రధాన కార్యదర్శి ఒకరు ఇటీవల చెప్పారు. తాము ఈ బలాన్ని ప్రాతిపదికగా చేసుకుని ప్రచారానికి దిగుతామన్నారు.

మోడీ పర్యటనలన్నీ 123 పరిధిలోనే

ఇప్పటికే ప్రధాని మోడీ సభలు , వీడియో కాన్ఫరెన్స్‌లు అన్నీ కూడా బిజెపి మిషన్ 123 పరిధిలోనే ఖరారు అయినట్లు వెల్లడైంది. ఇక ముందువి కూడా ఇదే విధంగా ఉంటాయని భావిస్తున్నారు. గత వారంలో ప్రధాని జరిపిన పర్యటనలు, జరిపిన సమావేశాలు అన్నీ కూడా ఈ విషయాన్ని స్పష్టం చేశాయి. డిసెంబర్ 24వ తేదీన ప్రధాని మోడీ ఒడిషాకు వెళ్లారు. భువనేశ్వర్‌లో న్యూ ఇండియన్ ఇనిస్టూట్ ఆఫ్ టెక్నాలజీ క్యాంపస్‌కు ప్రారంభోత్సవం నిర్వహించారు. తరువాత కుర్దాకు వెళ్లారు. ఆ మరుసటి రోజున ఆయన అసోంకు వెళ్లి, అక్కడ దేశంలోనే అతి పొడవైన రోడు రైలు వంతెనను బ్రహ్మపుత్ర నదిపై ఆవిష్కరించారు. ఈ సుదీర్ఘ వంతెనపై ప్రచార రాజసంతో నడయాడారు. ఇక జనవరి 4వ తేదీన ప్రధాని మోడీ అసోంలోని సిల్చార్‌కు తిరిగి వెళ్లుతారు. అసోంలో మొత్తం 14 లోక్‌సభ స్థానాలలో కనీసం 11 వరకూ గెల్చుకోవాలని బిజెపి ఆశిస్తోంది. ఇంతకు ముందటి స్థానాలతో పోలిస్తే ఇది నాలుగు అదనం. ఆ తరువాత జనవరి 5వ తేదీన మోడీ ఒడిషాలో పర్యటిస్తారు. మయూర్‌భంజ్ సభలో ప్రసంగిస్తారు. ఆ తరువాత జనవరి 15వ తేదీన తిరిగి రాష్ట్రంలో సభలలో పాల్గొంటారు.

స్థానిక పోరుకు సాంకేతిక వైభవం

- సిద్ధమైన టిఈ-పోల్ వెబ్‌సైట్
- ముందస్తుగా శిక్షణ తరగతులు
- అధికారులకు తగ్గనున్న పనిభారం

స్థానిక సంస్థల ఎన్నికలకు సైతం సాంకేతిక విప్లవం తోడుకానుంది. ఇప్పడిప్పడే పల్లెల్లో ఎన్నికల సందడి ఆరంభమైంది. వచ్చే నెలాఖరు వరకు పంచాయతీ ఎన్నికలను ఎట్టిపరిస్థితుల్లోనూ పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. పల్లె పోరులో పారదర్శకతకు పెద్ద పీట వేస్తూ ప్రభుత్వం ఈసారి వినూత్నంగా సాంకేతికతను జోడించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానుంది. ఇందులో భాగంగా ఇప్పటికే టిఈ-పోల్ అనే కొత్త వెబ్‌సైట్‌కు రూపకల్పన చేసింది. ఈ వెబ్‌సైట్‌లో పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

మన తెలంగాణ/పెద్దశంకరంపేట : చేసే ప్రతి పనిలో పారదర్శకతకు పెద్ద పీట వేస్తున్న తెలంగాణ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. గతంలో ఎక్కడా చేయని విధంగా స్థానిక సంస్థలకు సంబంధించిన ఎన్నికల వివరాలను సైతం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచేందుకు ఒక కొత్త వెబ్ సైట్‌ను రూపకల్పన చేసింది. ఓటరు స్లిప్ నుంచి నామినేషన్‌ల ప్రక్రియ వరకు ప్రతి అంశాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ (tsecgov.in) వెబ్‌సైట్‌లోకి వెళ్తే పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన పూర్తి వివరాల సమాచారం ఇట్టే తెలిసిపోతుంది. మెదక్ జిల్లాలో కొత్త పంచాయతీలతో కలుపుకుని మొత్తం 469 గ్రామ పంచాయతీలున్నాయి. కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రభుత్వం పంచాయతీలకు ఎన్నికలను నిర్వహించనుంది. ఎన్నికలకు సంబంధించిన అన్ని రకాల సమాచారాన్ని వివిధ ఫార్మెట్లలో నింపి ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఒక ప్రత్యేకమైన వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికే ఈ వెబ్‌సైట్ నిర్వహణపై అధికారులకు ఒక విడత శిక్షణ కూడా ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశాన్ని ఇంటర్నెట్‌లో ఉంచాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉన్నతాధికారుల సూచన మేరకు ఆన్‌లైన్ ప్రక్రియ ఆరంభమైందని తెలిసింది. సర్పంచ్ పదవికి నామినేషన్ వేసేదెవరు. ఉపసంహరించుకునే వారెవరు. చివరకు మిగిలింది ఎవరు. వారి విద్యార్హతలు ఎంటి? అనే విషయాలన్నీ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లోనే చూసుకోవచ్చు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తొలిసారిగా వెబ్‌పోర్టల్‌ను ఆవిష్కరించారు. ఈ పోర్టల్‌ను ఎలా వినియోగించుకోవాలనే అంశంపై డిపిఓ కార్యాలయంలోని సిబ్బందికి గతంలోనే హైదరాబాద్‌లో ప్రత్యేక శిక్షణనిచ్చారు. వారు జిల్లా స్థాయిలో ఎంపిడిఓలు, తహసీల్దార్‌లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. టీఈ పోల్ వెబ్ పోర్టల్‌లో లాగిన్ అయ్యేందుకు ఎంపిడిఓలకు ప్రత్యేక పాస్ వర్డ్‌ను కేటాయించారు. తొలుత డిపిఓ కార్యాలయం నుంచి మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు వార్డులకు సంబంధించిన ఓటరు జాబితాను ఆన్‌లైన్‌లో పంపించారు. ఎంపిడిఓలు, ఈవోపిఆర్‌డిలు కలిసి క్షేత్రస్థాయిలో సర్వే జరిపి అభ్యంతరాలకు అనుగుణంగా మార్పులు, చేర్పులు చేసి తిరిగి దానిని డిపిఓ కార్యాలయానికి పంపారు. ఈ మార్పుల ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే కొనసాగింది. దీంతో అధికారులపై పనిభారం తగ్గిందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. సమయం వృథా కాకుండా సులభంగా పనులు పూర్తి చేసేందుకు ఈ విధానం భాగా ఉపయోగుపడుతుందని వారంటున్నారు.



గత పంచాయతీ ఎన్నికల్లో అధికారులు ఓటర్ల తుది జాబితాను తయారు చేసేందుకు చాలా ఇబ్బందులకు గురికావాల్సి వచ్చింది. వీటితోపాటు కొత్తగా ఏర్పడిన పంచాయతీలను పాత పంచాయతీల జాబితా నుంచి తొలగించి వేరు చేశారు. పంచాయతీల వారీగా వార్డులను, ఓటర్ల జాబితాను విభజించి పూర్తిగా ఆన్‌లైన్ చేసేశారు. ఇప్పుడు సాంకేతికతో పనిభారం తగ్గిపోవడంతో అధికారులకు ఇతర పనులు చేసుకునేందుకు వెసులుబాటు లభించింది. ఇదిలాఉంటే ఎన్నికల్లో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది కోసం ప్రత్యేకంగా ఒక పోర్టల్‌ను కూడా రూపొందించారు. పంచాయతీ ఎన్నికల్లో అధికారులు అనుసరించాల్సిన విధివిధానాలు, నియమ నిబంధనలు ఇందులో పొందుపరిచారు. అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని ఎలా పర్యవేక్షించాలి. ఎన్నికలపై రూపొందించిన రిపోర్టును ఎలా సమర్పించాలనే అంశాలన్నింటిని ఇందులో అందుబాటులో ఉంచారు.

ఇక ఇంటర్నెట్‌లోనే అన్నీ...

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచ్, వార్డు సభ్యులు నేరుగా ఆన్‌లైన్ ద్వారానే తమ నామినేషన్ వేసేందుకు వీలుంది. సంబంధిత అధికారులకు ఒక సెట్ నామినేషన్ పత్రాలు పంపిస్తే సరిపోతుంది. ఎన్నికల ఖర్చులకు సంబంధించిన వివరాలను కూడా అభ్యర్థులు ఏ రోజుకారోజు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఓటరు జాబితాను టిఈపోల్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలాగే ఓటరు తన ఓటు స్లిప్పును కూడా ఇదే వెబ్‌సైట్ నుంచి తీసుకోవచ్చు. ఏ గ్రామ పరిధిలో ఓటరుగా నమోదై ఉన్నారో ఆ గ్రామంలో నివాసముంటున్న వారు ఓటరు స్లిప్పు డౌన్ లోడ్ చేసుకోవాడానికి వీలుంది. ఎన్నికల విధుల్లో భాగస్వామ్యం కానున్న ఉద్యోగులు, ఉపాధ్యాయుల వివరాలను కూడా మండల స్థాయి ఎన్నికల అధికారులు ఇదే వైబ్‌సైట్‌లో పొందుపరిచి ఉన్నతాధికారులనుంచి అనుమతి తీసుకుంటారు. దీంతో ఎన్నికల విధులు నిర్వహించనున్న సంబంధిత ఉద్యోగి సెల్‌ఫోన్‌కు ఫలానా గ్రామంలో ఎన్నికల విధులు నిర్వహించాలంటూ సమాచారం వెళ్తుంది. ఎన్నికలకు సంబంధించిన అన్ని రకాల నివేదికలను సైతం ఇదే వెబ్‌సైట్‌లో ఆప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇలా అప్‌లోడ్ చేసిన సమాచారం మండలాల నుంచి రాష్ట్రానికి నిమిషాల వ్యవధిలో చేరిపోతుంది.

కార్పొరేట్‌కు దీటుగా గురుకులాలు

బిసి కమిషన్ సభ్యులు జూలూరి గౌరీశంకర్



మనతెలంగాణ/నడిగూడెం: తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పనిచేస్తున్నాయని బిసి కమిషన్ సభ్యుడు జూలూరి గౌరిశంకర్ అన్నారు. మండల కేంద్రలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడుగు బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు విద్యార్థులకు కావలసిన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎస్సి గురుకుల కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బిసి గురుకుల సంస్థ కార్యదర్శి బుర్ర వెంకటేశం దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా రాష్ట్రంలో అనేక గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయడంతో పేదలకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చిందన్నారు. గురుకుల పాఠశాలల్లో విద్యనభ్యసించిన అనేక మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. రాష్ట్రంలో త్వరలోనే, విద్య, ఆరోగ్య రంగాలను పైలెట్ ప్రాజెక్టుగా రూపొందించనున్నట్లు తెలిపారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్, పూలేలను ఆదర్శంగా తీసుకుని గురుకులాలను నిర్వహిస్తున్నామన్నారు. ఆయన వెంట గురుకుల సంస్థ ఉమ్మడి జిల్లా ప్రాంతీయ కోఆర్డినేటర్ హెచ్.అరుణకుమారి, స్థానిక గురుకుల ప్రిన్సిపాల్ ఆకుల భిక్షమయ్య, బిసి సంక్షేమాభివృద్ధి అధికారి జ్యోతి, ప్రముఖ విశ్లేశకుడు కె.జితేంద్రబాబు తదితరులు ఉన్నారు.

వరకట్న వేధింపులకు మహిళ ఆత్మహత్య



మన తెలంగాణ/ తాండూరు రూరల్ : వరకట్న వేధింపులతో పురుగుల మందు తాగి ఓ మహిళ మృతి చెందిన సంఘటన కరన్‌కోట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంగెంకలాన్ గ్రామంలో చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 2017 నంవబర్‌లో ఎరుకలి సంతోష్‌కుమార్ మల్కాపూర్ గ్రామానికి చెందిన బోయిని లక్ష్మి ప్రేమ వివాహం చేసుకొని హైదరాబాద్‌లో కాపురం కొనసాగించారు. పెళ్లైన ఆరు నెలల నుంచి కట్నం కోసం ఎరుకలి సంతోష్‌కుమార్ కుటుంబ సభ్యుల వేధింపులు మొదలయ్యాయి. రూ.లక్ష కట్నం కావాలని లక్ష్మి తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పి రోదించింది. ఈనేపథ్యంలో సోమవారం ఉదయం పురుగుల తాగి ఆత్మహత్యకు యత్నించింది. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు లక్ష్మి(21)ని తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో ఆస్పత్రి డాక్టర్‌లు ప్రథమ చికిత్స నిర్వహించి హైదరాబాద్‌కు తరలించాలని సూచించారు. దీంతో వికారాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స నిర్వహిస్తుండగా మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. వరకట్న వేధింపుల వల్లే తన కూతురు మృతి చెందిందని మృతురాలి తండ్రి బోయిని నర్సింలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

విద్యార్థి అనుమానాస్పద మృతి

హత్యగా అనుమానిస్తున్న పోలీసులు



మన తెలంగాణ/శంషాబాద్ రూరల్ : పాల్మాకుల గ్రామానికి చెందిన దళిత బాలుడు దినేష్ అనుమానాస్పదంగా మరణించాడు. గ్రామ శివార్లలోని వ్యవసాయ పొలం వద్ద దినేష్ మృతదేహం పడి ఉండటంతో గుర్తు తెలియని వ్యక్తులు హతమార్చి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. శంషాబాద్ రూరల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం... పాల్మాకుల గ్రామానికి చెందిన మద్దురి చిన్నరాజు, నిర్మల దంపతులు. నిర్మల శంషాబాద్ ఆర్‌జిఐఎలో పని చేస్తుండగా ఆమె భర్త చిన్న రాజు ప్రైవేట్ కంపనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం నుంచి బాలుడు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు అతడి కోసం గాలించారు. గ్రామ శివార్లలో ఉన్న రైసుమిల్లు వెనుక భాగంలో నాల్గవ తరగతి విద్యార్థి దినేష్ (9)కి సంబంధించిన సైకిల్ లభించింది. మరికొద్ది దూరంలో అతని మృతదేహం లభించింది. ఆదివారం రాత్రి పదిగంటల సమయంలో దినేష్ విగతజీవిగా కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తర్వాత హత్య లేక ప్రమాదవశాత్తు జరిగిందా అనేది తెలుస్తుందని పోలీసులు అన్నారు.

చోరీలకు పాల్పడిన వ్యక్తుల అరెస్ట్

3లక్షల విలువగల కంప్యూటర్ సామగ్రి స్వాధీనం



మన తెలంగాణ/వీణవంక: గత కొంతకాలంగా వీణవంక, సైదాపూర్, మానకొండూర్, శంకరపట్నం మండలాల్లోని పాఠశాలల్లో ఉన్న విలువైన సామాగ్రి , కంప్యూటర్ సామానులను చోరీచేసిన నిందితులను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం వీణవంక పోలీస్‌స్టేషన్‌లో ఎసిపి కృపాకర్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామానికి చెందిన పాలెపు శశికుమార్, మరో ముగ్గురు మైనర్ యువకులు అదే గ్రామానికి చెందిన వారు ముఠాగా ఏర్పడి రెక్కి చేసి రాత్రివేళల్లో పాఠశాలల్లో విలువైన సామగ్రిని చోరీలకు పాల్పడుతున్నారు. గత 6నెలల కాలంలో వివిధ పాఠశాలల్లోని 3.5 లక్షల విలువచేసే వస్తువులను దొంగిలించారు. వీణవంక ఉన్నత పాఠశాలలో ఆగస్టులోఒకసారి, డిసెంబర్ 26న మరోసారి చోరీ చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ వేగవంతం చేశారు. మండల కేంద్రంలోని పాఠశాలలో రెండుసార్లు చోరీ జరగడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. పోలీసులు అన్ని కోణాల్లో కూపీలాగడంతో నిందితులను పట్టుకుని కంప్యూటర్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో వీణవంక ఎస్‌ఐ కృష్ణారెడ్డి, సిఐ నారాయణ, సిబ్బందిని ఎసిపి అభినందించారు. పిల్లల గూర్చి తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని లేనియెడల జల్సాలకు అలవాటు పడి వీరివలె జీవితాలను నాశనం చేసుకుంటారని ఎసిపి కృపాకర్ వివరించారు. అలాగే సీనియర్ సిటిజన్‌కు, మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ఒక్క ఫోన్‌కాల్, మెసేజ్ చేసినా పోలీసులు వారి వద్దకు వెళ్లి పిటిషన్ తీసుకుని చర్యలు తీసుకుంటారని తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను ప్రజలు శృతి మించకుండా జరుపుకోవాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, అతిశబ్దాలు చేస్తూ ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రహరీని ఢీకొట్టిన బస్సు

పది మందికి గాయాలు • తప్పిన పెను ప్రమాదం



మన తెలంగాణ/మెదక్/చేగుంట: ఆర్‌టిసి బస్సు అదుపుతప్పిన ఘటనలో 10 మందికి గాయాలైన సంఘటన మెదక్ జిల్లా చేగుంట మండల పరిధిలోని రెడ్డిపల్లి బైపాస్ రోడ్డు వద్ద సోమవారం ఉదయం చోటు చేసుకుంది. కామారెడ్డి డిపోకు చెందిన ఆర్‌టిసి డీలక్స్ బస్సు చేగుంట రెడ్డిపల్లి బైపాస్ వద్ద బైకును తప్పించబోయి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొడుతూ పక్కనే ఉన్న ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ ప్రహరీ గోడను ఢీకొట్టింది. అందులో ప్రయాణిస్తున్న 10 మందికి గాయాలయ్యాయి. బస్సులో సుమారు 46 మంది ప్రయాణికులు, నలుగురు స్టాఫ్ ఉన్నారు. డ్రైవర్ ఎదురుగా వస్తున్న బైకులను తప్పించబోయి రోడ్డు కిందకు వెళ్లినట్లు ప్రయాణికులు చెబుతున్నారు. డ్రైవర్ వాహెద్ మియా జాగ్రత్త వల్లనే తాము బతికి బయటపడ్డామని కొందరు తెలిపారు. కామారెడ్డి నుండి హైదరాబాద్‌కు వెళ్తున్న బస్సు ఇవతల రోడ్డు కిందకు దిగి ప్రహరీని ఢీకొట్టిన ఘటనలో వెంకటి (మేడ్చల్), సిద్దిరాములు (కామరెడ్డి), స్వామి (కామారెడ్డి), జ్యోతి (దేమ), రవి, పోచయ్యలతోపాటు పలువురికి గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు, హైవే అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలైన వారిని స్థానిక హస్పటల్‌లో చికిత్స చేయించి ఇద్దరిని హైవే అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలించారు. మిగతా వారు వేరే బస్సులో వెళ్లిపోయారు. పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకున్నారు.





ముగిసిన ధ్యాన సంబరాలు

మన తెలంగాణ/కడ్తాల్: మండల కేంద్రంలోని మహేశ్వర మహా పిరమిడ్‌లో గత పది రోజులుగా జరుగుతున్న ధ్యాన మహాచక్రం సంబరాలు సోమవారం ముగిసాయి. చివరి రోజు ప్రాతఃకాల ధ్యానం అనంతరం పత్రీజీ ధ్యానులనుద్దేశించి ప్రసంగించారు. ధ్యానం సకల రోగ నివారిణి అని, ధ్యానం, శాకాహార ప్రచారంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. నోటిలో మౌనం, మనసులోని శూన్యమే ధ్యానమని, ధ్యానంతో ఆనందమయ జీవితాన్ని పొందవచ్చని సూచించారు. ధ్యాన మహాచక్రం సంబరాలను విజయవంతం చేసిన ధ్యానులు, పిరమిడ్ మాస్టర్లకు పత్రీజీ, ట్రస్టు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సన్మానించారు. 2019లో జరిగే ధ్యాన చక్రం వేడుకలు మహిళా ధ్యానోత్సవాలని, మహిళలు వేడుకలను విజయవంతం చేసేందుకు ఇప్పటి నుంచే కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు ధ్యానులు రచించిన పుస్తకాలను పత్రీజీ ఆవిష్కరించారు. పిరమిడ్ వేదికపై కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాకారులను పిరమిడ్ ట్రస్టు నిర్వాహకులు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు సాంబశివరావు, ప్రేమయ్య, రాంబాబు, విజయ్‌భాస్కర్‌రెడ్డి, నంద ప్రసాద్, దామోదర్‌రెడ్డి, సురేష్ బాబు, శివప్రసాద్, రవికుమార్, మాధవి, మీడియా ఇంచార్జి రవిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పట్టా పాస్ పుస్తకాల కోసం వినతి



మన తెలంగాణ/మోత్కూరు: పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని, లావుణి పట్టాలు, సాదాబైనామా పట్టాలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం దాచారం గ్రామానికి చెందిన రైతులు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం రైతులు తహశీల్దార్ వి.యాదాబాయికి వినతిపత్రం అందజేశారు. మండలంలోని దాచారం గ్రామానికి చెందిన 50మంది రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వలేదని, సాదాబైనామా, లావుణి పట్టాలకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వకపోవడంతో సుమారు 100 మంది రైతులు మొదటి విడత రైతు బంధు పంట పెట్టుబడిసాయం పొందలేకపోయారని, రెండవ విడత రైతు బంధు నగదు పొందలేని దుస్థితి నెలకొందని రైతులు వాపోయారు. విఆర్ఓ నిర్లక్ష్యం, బాధ్యతా రహిత్యంతోనే రైతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. పాత పాస్ పుస్తకాల ప్రకారం నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. ఈధర్నాలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కల్వల సదానందరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పైల్ల యాదిరెడ్డి, బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కొంగరి బాలరాజు, నాయకులు, రైతులు శేఖరాచారి, లచ్చయ్య, నర్సింహ్మా, ఎల్లయ్య, అంజయ్య, లతీఫ్, రాములు, చిన్న లింగయ్య, లచ్చయ్య, మల్లయ్యసాదుల అంజయ్య, యాదిరెడ్డి, నర్సయ్య , చంద్రయ్య, సోమయ్య, బుచ్చయ్య, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి : జోగు

మన తెలంగాణ/ఆదిలాబాద్: నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే జోగురామన్న పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే రామన్న సోమవారం నూతన సంవత్సరంలో నిర్వహించబోయే అభివృద్ధి పనుల వివరాలను వెల్లడించారు. బ్యారేజి పనులను పూర్తి చేసి యాభై వేల ఎకరాలకు సాగు నీరు అందించి రైతుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఆదిలాబాద్ పట్టణాన్ని 120 కోట్లు వెచ్చింది మౌలిక సదుపాయాల కల్పనతోపాటు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీ పునప్రారంభానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే మంజూరైన రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ ప్రారంభించడానికి శంకుస్థాపన చేస్తామన్నారు. దీర్ఘకాలిక సమస్యలైన రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేసి పనులను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.

చిగురుమామిడి ఎంపిపిగా సుజాత ఏకగ్రీవం

- నెరవేరిన నాలుగున్నర సంవత్సరాల కల
- సుజాతను అభినందించిన మాజీ మంత్రి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే సతీష్‌కుమార్
- మెట్‌పల్లి ఎంపిపిగా డాకూరి కమల





మన తెలంగాణ/చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి గ్రామ ఎంపిటిసి సభ్యురాలు అందె సూజాత ఎట్టకేలకు చిగురుమామిడి ఎంపిపిగా సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఎంపిపి ఎన్నికకు తిమ్మాపూర్ స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్ ముఖ్యఅతిథిగా హాజరై ఎంపిపి ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి ఎన్నికకు 12మంది ఎంపిటిసి సభ్యులకు గాను మొత్తం 10 మంది ఎంపిటిసి సభ్యులు మాత్రమే హాజరయ్యారు. ఇందుర్తి ఎంపిటిసి సభ్యురాలు అందె సూజాతను బొమ్మనపల్లి ఎంపిటిసి సభ్యుడు కత్తుల రమేష్ ప్రతిపదించగా, చిగురుమామిడి ఎంపిటిసి సభ్యురాలు ఆకవరం భవాని బలపర్చారు. రేకొండ ఎంపిటిసి సభ్యుడు మైయిలరపు మల్లయ్యను అదే గ్రామా ఎంపిటిసి సభ్యుడు కొండయ్య ప్రతిపాదించగా మల్లయ్యను బలపరిచేవారు లేకపోవటంతో సూజాత ఎంపిపిగా ఏకగ్రీవమైనట్లు అధికారులు వెల్లడించారు. సూజాత గతంలో కాంగ్రెస్ పార్టీ నుండి ఎంపిటిసిగా గెలిచి ఎంపిపి కోసం పోటిలో ఉన్నారు. అప్పుడు ఎంపిటిసిల సరిబలంతో అధికారులు డ్రా తీయటంతో సుందరగిరి ఎంపిటిసి సభ్యుడు కిష్టయ్య సిపిఐ పార్టీ నుండి ఎంపిపిగా ఎన్నికయ్యారు. కిష్టయ్య సిపిఐ నుండి టిఆర్ఎస్ చేరగా టిఆర్ఎస్‌కు చెందిన ఎంపిటిసిలే కిష్టయ్యపై అవిశ్వాస తీర్మానం పెట్టారు. అప్పటి నుండి ఇంచార్జీ ఎంపిపిగా వైస్ ఎంపిపి భవాని బాధ్యతలు చెపట్టారు. ఎంపిపి పదవి కోసం నాలుగున్నర సంవత్సరాలుగా వేచి చూసిన సూజాత ఎట్టికేలకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపిపిగా ఎన్నికైన సుజాతను మాజీ మంత్రి ఈటల రాజేందర్, హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌లు అభినందించారు. సూజాత ఎన్నికపై ఇందుర్తితోపాటు టిఆర్ఎస్ మండలాధ్యక్షులు రామోజు కృష్ణమాచారి, వైస్ ఎంపిపి ఆకవరం భవాని శివప్రసాద్, పన్యాల శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

మెట్‌పల్లి ఎంపిపిగా డాకూరి కమల ఎన్నిక



జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండల పరిషత్ కార్యలయంలో నిర్వహించిన ఎంపిపి ఎన్నికల్లో జగ్గసాగర్ ఎంపిటిసి డాకూరి కమల ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఆనంద్ తెలిపారు. మెట్‌పల్లి ఎంపిపిగా ఉన్న గురుజెల రాజుపై మెజార్టీ ఎంపిటిసిలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడంతో అవిశ్వాస తీర్మానం జూలై 24న నెగ్గింది. దీంతో మెట్‌పల్లి ఎంపిపి ఎన్నిక అనివార్యమైంది. ఇందులో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ అదేశాల మేరకు డిసెంబర్ 31న మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి ఆనంద్ ఎంపిపి ఎన్నికను నిర్వహించారు. ఈ సమావేశానికి 9మంది ఎంపిటిసిలకు గాను ఏడుగురు ఎంపిటిసిలు హాజరయ్యారు. దీంతో కోరం సరిపోవడంతో ఎంపిపి పదవికి నిర్వహించిన ఎన్నికల్లో జగ్గసాగర్ నుండి ఎన్నికైన డాకూరి కమల ఒక్కరె నామినేషన్ వేయడంతో ఆమెను ఎంపిపిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ఎంపిడిఓ కల్పన, రాజశ్రీనివాస్ హాజరయ్యారు.

మన తెలంగాణ
10
హైదరాబాద్
మంగళవారం
1 జనవరి 2019
www.manatelangana.news



సాంకేతిక పరిజ్ఞానంలో కొత్తపుంతలు

సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకీ కొత్త పుంతలు తొక్కుతోంది. పోయిన సంవత్సరంలో మార్పులు, ఆవిష్కరణలు చోటుచేసుకున్నాయి. వాటిల్లో చేతిలో ఇమిడిపోయే కంప్యూటర్లు, చెబితే వినే ఫోన్లు ఇలాంటివెన్నో ఉన్నాయి. 2018 లో ట్రెండ్ క్రియేట్ చేసిన అంశాలు, యూజర్లు కట్టిపడేసిన ఫోన్లు, ఆకట్టుకున్న యాప్స్ మనల్ని ఆకట్టుకున్నాయి. అవేంటో ఓసారి చూద్దాం...




ఇయర్ ప్రింట్ : బయోమెట్రిక్ సిస్టమ్ అందుబాటులోకి వచ్చాక ఫింగర్ ప్రింట్‌తో పని మరింత పెరిగింది. కాకపోతే మనకు తెలియకుండానే ఈ టెక్నాలజీ చోరీకి గురవుతోంది. మరి ఈ సమస్యకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో 'ఇయర్ ప్రింట్' టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. ఇదెలా పనిచేస్తుందంటే...ఇందులో మొబైల్ నుంచీ మన చెవికి ఓ ధ్వనిని పంపిస్తారు. ఆ ధ్వని తిరిగి వెనక్కి వెళ్తుంది. ఈ ధ్వని ఒక్కొక్కరికీ ఒక్కోలా ఉంటుంది. ఇయర్ ప్రింట్ కావాలంటే, స్పెషల్ సాఫ్ట్‌వేర్‌ని మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. అది స్మార్ట్ ఫోన్ సెన్సార్లను ఉపయోగించుకుంటుంది. ఇది చాలా సులభంగా జరిగే ప్రక్రియ. చెవి దగ్గర మొబైల్ పెట్టి, టచ్ స్క్రీన్‌ను ట్యాప్ చేస్తే కావల్సిన పని జరిగిపోతుంది. భవిష్యత్తులో ఫింగర్ ప్రింట్స్ బదులు ఇయర్ ప్రింట్స్ వస్తాయంటున్నారు సైంటిస్టులు. సైబర్ సెక్యూరిటీకి ఇది ఎంతగానో మేలు చేయనున్నట్లు చెబుతున్నారు.

రోబో జెల్లీఫిష్: వాతావరణ కాలుష్యం వల్ల సముద్రాల్లో ఉండే పగడపు దిబ్బలు, వాటిలోని అరుదైన జీవులు, విలువైన మొక్కలు అంతరించిపోతున్నాయి. పగడపు దిబ్బలను కాపాడాలంటే అక్కడి వాతావరణాన్ని నిరంతరం గమనిస్తూ ఉండటానికి ఏర్పాటుచేసిందే రోబో జెల్లీ ఫిష్. ఇది పగడపు దిబ్బలకు ఎటువంటి హాని కలిగించదు. అక్కడి జీవులకు అపాయం రానీయదు. అమెరికా, ఫ్లోరిడాలోని అట్లాంటిక్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు దీన్ని రూపొందించారు.

గూగుల్ ఏఐ: వెబ్ సెర్చింగ్‌లో దూసుకుపోతున్న సెర్చింజిన్ 'గూగుల్'. ఈ ఏడాదిలో మరో అద్భుతాన్ని ఆవిష్కరించింది. మనిషి కంటిని చూసి అతనికి వచ్చిన రోగం ఏంటో పక్కాగా చెప్పేలా ఓ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను సృష్టించింది. దయాబెటిస్ లాంటి మొండి రోగాల్ని తేలిగ్గా గుర్తించేందుకు ఇది వీలు కల్పిస్తోంది. మన కళ్లను చూసి కంటి డాక్టర్ల కంటే కచ్చితంగా షుగర్ లెవెల్స్‌ని లెక్కకట్టి చెప్పేస్తుందీ గూగుల్ ఏఐ. ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డయాబెటిక్ రెటినోపతి ఆవిష్కరణను త్వరలోనే భారతదేశంలోని క్లినిక్స్‌కు అందించనుంది గూగుల్.



త్రీడీ ప్రింటింగ్ : ప్రింటింగ్ అంటే కేవలం సాఫ్ట్ కాపీని కేన్వాస్ మీదనో, పేపర్ మీదనో ప్రింట్ తీయటం. కానీ త్రీడీ ప్రింటింగ్ అంటే ఒక వస్తువును సృష్టించటం. సాఫ్ట్ కాపీ నుంచి త్రీడీ ప్రింటర్ ద్వారా అచ్చంగా అదే వస్తువును తయారు చేయటం. ఈ టెక్నాలజీ తో కావాల్సిన భారీ లోహ నిర్మాణాల్ని అప్పటికప్పుడే తయారు చేయించుకోవచ్చు. ఇదివరకు సాధ్యం కాని క్లిష్టమైన లోహ ఆకృతుల్ని కూడా ఇప్పుడు త్రీడీ ప్రింటర్లు తయారుచేస్తున్నాయి.



గతేడాదితో పోల్చితే ఈఏడాది సోషల్ మీడియా టూల్స్‌లో అదిరిపోయే ఫీచర్లు వచ్చాయి. ప్రధానంగా ఫేస్‌బుక్, వాట్సాప్‌లు ఎప్పటికప్పుడూ కొత్త కొత్త ఫీచర్లను రిలీజ్ చేస్తూ వినియోగదారులను ఆకట్టుకున్నాయి. మరోవైపు యూజర్ల ప్రైవసీని కాపాడే విధంగానూ ఫీచర్లు రావటంతో వాటికి మరింత ఆదరణ పెరిగింది. ఫేస్‌బుక్ జోడించిన ఫీచర్లలో ప్రధానం లైవ్ స్ట్రీమ్, పోస్ట్ రియాక్షన్స్, ఆడియో లైవ్, జిప్ ఫైల్స్ షేరింగ్ ఫీచర్లు వచ్చాయి. దీంతో పాటు యూజర్ సెక్యూరిటీలోనూ మార్పులు వచ్చాయి. వాట్సాప్ కూడా వేగంగా ఫీచర్లను రిలీజ్ చేస్తూ వచ్చింది. ప్రధానంగా ఫార్వర్డ్ మెసేజ్‌లను, ఫేక్ న్యూస్‌ను అరికట్టేందుకు గట్టి చర్యలు తీసుకుంటుంటోంది. మనీ ట్రాన్ఫఫర్, వీడియో కాలింగ్, గ్రూప్ వీడియో కాలింగ్, డార్క్ మోడ్, స్టికర్స్, స్వైప్‌టు రిప్లే, డాక్యుమెంట్, లొకేషన్ షేరింగ్ వంటి అదిరే ఫీచర్లను జోడించి వినియోగదారులకు మరింత చేరువైంది. గ్రూప్ అడ్మిన్ రూల్స్‌లో మార్పులతో సెక్యూరిటీ, ప్రైవసీ పెంచింది. ఆండ్రాయిడ్, ఐఫోన్‌లకూ దాదాపు ఒకే సారి ఫీచర్లను అందించటంలో సక్సెస్ అయింది. వాట్సాప్, ఫేస్‌బుక్‌లు ఇన్‌స్టంట్ మెసెజింగ్‌లో ట్రెండ్‌గా మారటంతో హైక్, స్కైప్, వైబర్ వంటి సోషల్ యాప్‌లు వెనకబడ్డాయి. ఎంటర్టైయిన్, షేరింగ్ ఫీచర్లతో ఉన్న ఇన్‌స్టా, షేర్‌చాట్‌లను నెటిజన్లు ఆదరించారు.

2018లో ప్రధానంగా హాట్‌టాపిక్ గా మారిన టెక్నాలజీ 'అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్'. ఈ టెక్నాలజీపై ప్రపంచ దేశాలు ఫోకస్ చేశాయి. ఇండియాలోనూ ఏఐ టెక్నాలజీ ప్రభావం కనిపించింది. 1956లో అమెరికా శాస్త్రవేత్త జాన్ మెక్‌కార్తీ... ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పదాన్ని సృష్టిం చారు. యంత్రాలు మనుషుల్లా పని చెయ్యడం, మాట్లాడ గలగడం, ఆలోచించ గలగడమే దీని లక్ష్యం. ఇప్పుడిప్పుడే ఈ కల సాకారం అవుతోంది. స్మార్ట్ మొబైళ్ల రాకతో, సామాన్యులు కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కి దగ్గరయ్యారు. ఈ టెక్నాలజీతో రూపొందిన హ్యూమనాయిడ్ రోబోలు ఇప్పటికే చాలా రంగాల్లో సేవలందిస్తున్నాయి.

నకిలీ వార్తలతో కలవరం..



ఈ మధ్య కాలంలో సోషల్ మీడియా వ్యాప్తి చేస్తున్న నకిలీ వార్తలు ప్రవాహం తీవ్రంగా పెరిగిపోతుంది. నిజానిజాలు తెలుసుకోకుండా రాసే ఈ వార్తలు కొన్ని సార్లు పరిమితులను మించి పోతున్నాయి.వ్యూస్ లక్ష్యంగా కొన్ని వెబ్‌సైట్‌లు విచ్చలవిడిగా ఫేక్‌న్యూస్‌లని ప్రచారం చేస్తున్నాయి. ఈ ఫేక్ న్యూస్‌ల బారి నుండి సెలబ్రెటీలు కూడా తప్పించుకోలేక పోతున్నారు. ఇలా 2018 లో సోషల్ మీడియాకి బలైన టాప్ సెలబ్రిటీల గురించి ఒకసారి చూద్దాం.. ఈ మధ్యకాలంలో సోషల్ మీడియా సృష్టించిన సోనాలి బింద్రె మరణ వార్త పెను దుమారమే రేపింది. క్యాన్సర్ వ్యాధికి గురై న్యూయార్క్‌లో ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న సోనాలి మరణించిందంటూ వచ్చిన వార్తను ఓ పార్టీ ఎమ్మెల్యే ట్వీట్ చేయడంతో అందరూ ఆశ్చర్యపోయారు. హిందీ, మరాఠీ చిత్రసీమలో తనదైన ముద్ర వేసుకొన్న సొనాలి బింద్రే ఇకలేరు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ అమెరికాలో కన్నుమూశారు అనే వార్త సోషల్ మీడియాలో వచ్చిన సందేశాన్ని ఆయన షేర్ చేశాడు. అయితే ఆ వార్త నిజమా? వాస్తవమేంతా అనే విషయాన్ని పట్టించుకోలేకుండా సోషల్ మీడియాలో షేర్ చేయడం వివాదాస్పదమైంది. సోనాలి భర్త మీడియా ముందుకు వచ్చి ఈ వార్తను ఖండించడంతో ఆమె అభిమానులు ఎమ్మెల్యే పై విమర్శల వర్షం కురిపించారు. ప్రముఖ నటుడు సిల్వెస్టర్ స్టలోని కూడా ఈ నకిలీ వార్తలు వదలలేదు. సిల్వెస్టర్ మరణించారనే వార్తతో ఆయన అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు.



ఇందుకు సంబంధించిన నకిలీ వీడియోలు, ఫొటోలు కూడా సోషల్ మీడియాలో దర్శనమిచ్చాయి. ఆఖరికి సిల్వెస్టర్ మీడియా ముందుకు వచ్చి నేను బతికే వున్నానని చెప్పడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రముఖ మాజీ క్రికెటర్, పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ కూడా ఈ వార్తల నుండి తప్పించుకోలేకపోయారు. ఏకంగా రక్తపు మడుగులో పడివున్న ఇమ్రాన్ ఖాన్ వీడియోలను చూసి ఆయన అభిమానులు తీవ్ర కలత చెందారు. కొందరు దుండగులు ఇమ్రాన్‌ని హత్య చేశారని వచ్చిన ఈ వార్త చివరికి ప్రతిపక్షాలు సృష్టించిన బూటకమని తేలింది.

మాజీ అమెరికా తొలి మహిళ బార్‌బర బుష్ అనారోగ్యంతో మరణించిందని ప్రముఖ న్యూస్ ఛానల్ ప్రసారం చేయడంతో ప్రపంచ వ్యాప్తంగా ఆమె అభిమానులు నిర్ఘాంతపోయారు. ఆమె మనవరాలు మీడియా ముందుకు వచ్చి బుష్ బతికే ఉన్నారని తెలియజేయడంతో అందరూ కాస్త కుదుటపడ్డారు. కానీ దురదృష్టవ శాత్తు ఆమె అదే నెలలో ఏప్రియల్ 17, 2018 లో తుది శ్వాస విడిచారు.





వైవిధ్య నటి ముంతాజ్ గుండెపోటుతో మరణించిందని ఒక జర్నలిస్ట్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అందరూ ఒక్క సారిగా ఉలిక్కిపడ్డారు. చివరికి ఈ వార్త ఆమె కూతురిని చేరడంతో ఆమె ఆ వార్తని ఖండిస్తూ తన తల్లి రోమ్‌లో ఎంజాయ్ చేస్తున్న వీడియోని షేర్ చేసింది.



జెర్సీ..నానీ

వెండితెరపై వరుస హిట్లతో క్రేజీ హీరోగా మారిన నేచురల్ స్టార్ నాని లేటస్ట్‌గా ఇప్పుడు క్రికెట్ బ్యాట్ పట్టుకుని సిక్స్‌లు బాదేందుకు 'జెర్సీ' అంటూ గ్రౌండ్ లోకి దిగుతున్నారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో సితార ఎంటర్ టైన్‌మెంట్ పతాకంపై సూర్య దేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. 1980 90ల మధ్య జరిగే ఈ స్టోరీలో నాని అర్జున్ అనే క్రికెటర్ పాత్రను పోషి స్తున్నాడు.ఈ చిత్రంలో నానికి జోడీగా శ్రద్ధ శ్రీనాథ్, రెబా మోనికా జాన్లు నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన కొత్త లుక్ ని నాని ట్విట్టర్ ద్వారా రిలీజ్ చేశారు. 36 యేళ్ల వయస్సులో తనని తాను నిరూపించుకోవడానికి క్రికెట్‌లో ఇంకా ఏం మిగలలేదు. తన కలలు మాత్రం మిగిలిపోయాయి.రంజీ ట్రోఫీ తనకు బ్యాటింగ్‌పై ఉన్న ప్రేమను మాత్రమే చూపించింది అంటూ నాని ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. రిలీజ్ చేసిన కొన్ని నిమిషాల్లో ఫస్ట్ లుక్ విపరీతమైన క్రేజ్‌ని సంపాదించుకుంది.

చార్జ్ 3తో మరింత ఫిట్‌నెస్

ఫిట్‌నెస్‌కు సంబంధించిన సరికొత్త పరికరాలను అందించే ఫిట్‌బిట్ సంస్థ తాజాగా చార్జ్ 3 పేరిట సరికొత్త ఫిట్‌నెస్ ట్రాకర్‌ను మార్కెట్‌లో విడుదల చేసింది. ఈ ఫిట్‌నెస్ ట్రాకర్ రూ.13,999 ధరకు వినియోగదారులకు అందుబాటులో ఉంది. ఈ ఫిట్‌నెస్ ట్రాకర్‌కు చెందిన స్పెషల్ ఎడిషన్ వేరియెంట్ ను రూ.15,999 ధరకు విక్రయిస్తున్నారు.

ఇక ఈ ట్రాకర్‌కు ప్రత్యేక బ్యాండ్లను కూడా విడిగా అందిస్తున్నారు. క్లాసిక్ బ్యాండ్ ధర రూ.2,990 ఉండగా, వోవెన్ బ్యాండ్ ధర రూ.3,490 గా ఉంది. లెదర్ బ్యాండ్ ను రూ.4,490 ధరకు సంస్థ అందిస్తుంది. ఇక దీని ఫీచర్లు చూస్తే.. * స్లీప్ ట్రాకింగ్, స్విమ్ ప్రూఫ్ డిజైన్

* టచ్ స్క్రీన్ డిస్‌ప్లే, 7 రోజుల బ్యాటరీ లైఫ్
* గొరిల్లా గ్లాస్ 3 ఓలెడ్ డిస్‌ప్లే
* ఎస్‌పీఓ2 సెన్సార్ తదితర ఫీచర్లు ఉన్నాయి.




అమీర్ ఖాన్ కొత్త సినిమా!

బాలీవుడ్ సూపర్ స్టార్ అమీర్ ఖాన్ హీరోగానే కాకుండా నిర్మాతగా కూడా తనదైన శైలిలో చిత్రాలని రూపొందిస్తారు. తాజాగా స్టార్ ప్లస్ తో కలిసి అమీర్ ఖాన్ ప్రొడక్షన్ బ్యానర్ పై ఆయన నిర్మించిన చిత్రం 'రూబరు రోషిణి'. కాగా ఈ చిత్రాన్ని గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా టీవీ ప్రీమియర్ల ద్వారా ప్రదర్శించనున్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఇదే తాను ప్రేక్షకుల కోసం చేసిన ప్లాన్ అని అమీర్ స్పష్టం చేశారు. ఇక అమీర్ నటించిన పిరియాడికల్ మూవీ థగ్స్ అఫ్ హిందుస్థాన్ గత నెల 8న విడుదలై నెగిటివ్ టాక్ తో ఫ్లాప్ సినిమాల జాబితాలో చేరింది. కత్రినా కైఫ్, అమితాబ్ బచ్చన్, ఫాతిమా సన షేక్ వంటి స్టార్ కాస్ట్ కూడా ఈ సినిమాను కాపాడలేకపోయారు.

వైరల్

స్నేహబంధమూ ఎంత మధురమూ....!



మనుష్యులు, పెంపుడు జంతువుల మధ్య ఉన్న బంధం చాలా ప్రత్యేకమైనది. చాలా మంది తమ ఇంట్లో సభ్యులుగా భావిస్తూ పెంపుడు జంతువులను ప్రేమిస్తుంటారు. సరదాగా వాటితో ఆడుతూ,పాడుతూ అన్ని బాధల్ని మర్చిపోతుంటారు. సాధారణంగా మనుష్యులు కుక్కనో లేదా పిల్లినో పెంచుకోవడం మనం చూస్తూనే వుంటాం. కానీ పిల్లీ ,కుక్క రెండూ ఒకే తాటిపై ఉంటే ఎలా వుంటుంది. కుక్కని చూస్తే పిల్లి ఆమడ దూరం పారిపోతుంది. ఇక పిల్లి కనబడితే చాలు కుక్క శత్రువులా వెంటాడుతూ వుంటుందని అందరూ అనుకుంటారు. కానీ ఆ మాటలకు భిన్నంగా వాటి మధ్య స్నేహాన్ని తెలిపే వీడియోస్ నెట్‌లో తరుచూ వస్తున్నాయ్. అలా ఈ మధ్యకాలంలో అందరి మనస్సుని దోచుకున్నాయి మ్యాగి పమ్‌కిన్ అనే కుక్క, పిల్లి. అవి రెండూ ఒకరినొకరు ఆత్మీయంగా దగ్గరికి తీసుకొని కౌగిలించుకున్న ఈ దృశ్యాన్ని జార్‌దన్ అనే మహిళ తన ట్విట్టర్ అకౌంట్‌లో షేర్ చేసింది. ఈ వీడియో ఒక్క రోజులోనే 4 మిలియన్ వ్యూస్‌ని సొంతం చేసుకుని ప్రస్తుతం నెట్‌లో హల్‌చల్ చేస్తుంది.

గారాలపట్టితో...!



ఎమ్.ఎస్ ధోని తన గారాలపట్టి జివాతో గడిపిన మధుర క్షణాలు ఎప్పుడూ అభిమానుల్ని అలరిస్తూ ఉంటాయి. కూల్ కెప్టెన్‌గా మాత్రమే పరిచయమున్న ధోని సూపర్ కూల్ తండ్రిగా జివాతో ఆడి,పాడే వీడియోస్ చూడటానికి అభిమానులూ ఎప్పుడూ ఉత్సాహం చూపిస్తుంటారు. ధోని కూడా వీలు దొరికితే చాలు ఫ్యామిలీ టూర్స్‌లో తన ముద్దుల కూతురితో బిజీబిజీగా గడుపుతుంటారు.

కూతురు జివా ఆటలను, పాటలను,అల్లరిని షేర్ చేస్తూ తన సంతోషాన్ని అభిమానులతో పంచుకోవాడికి ధోని భార్య సాక్షి కూడా ఇష్టపడుతుంటారు . అలా సాక్షి తన ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రస్తుతం పోస్ట్ చేసిన తండ్రీ, కూతుర్ల అనుబంధం అందరి మనస్సులను హద్దుకుంటుంది. ఈ వీడియోలో బీచ్‌లో ఆడుకుంటున్న జివా చేతిని పట్టుకొని అపురూపంగా మురిసిపోతున్న ధోనిని చూసి అభిమానులు కూడా మురిసిపోతున్నారు. ప్రస్తుతం ఈ వీడియో అభిమానుల్ని అలరిస్తూ ఇంటర్ నెట్‌లో వైరల్ అవుతోంది.

నేటి నుంచి ఈ ఫోన్లలో వాట్సాప్ బంద్!

నేటి నుంచి వాట్సాప్ కొన్ని ఫోన్లలో పని చేయదని కంపెనీ వెల్లడించింది. ఈ పని చేయని ఫోన్లలో అన్ని ఆపరేటింగ్ సిస్టమ్‌ల పాత వెర్షన్లు ఉన్నాయి. నోకియా ఎస్40తోపాటు విండోస్ ఫోన్ 7, ఐఫోన్ ఐఓఎస్ 6, నోకియా సింబియాన్ 60లలో మంగళవారం నుంచి వాట్సాప్ పని చేయదు. ఇక ఆండ్రాయిడ్ ఓఎస్‌లో వెర్షన్ 2.3.7, అంతకంటే ముందు వెర్షన్లు ఉన్న ఫోన్లలో, ఐఓఎస్ 7, అంతకన్నా ముందు వెర్షన్లు ఉన్న ఐఫోన్లలో 2020, ఫిబ్రవరి 1 నుంచి వాట్సాప్ పని చేయదని కంపెనీ స్పష్టం చేసింది. ఐఓఎస్ 7 ప్రస్తుతం ఐఫోన్ 4, ఐఫోన్ 4ఎస్, ఐఫోన్ 5, ఐఫోన్ 5సీ, ఐఫోన్ 5ఎస్‌లలో ఉంది. ఈ ప్లాట్‌ఫామ్‌లు భవిష్యత్తులో తమ యాప్ ఫీచర్లను అందుకోలేవని వాట్సాప్ చెప్పింది. ఈ వెర్షన్ ఫోన్లు వాడేవాళ్లు కొత్త వెర్షన్‌లకు అప్‌డేట్ కావాలని సూచించింది. ఆండ్రాయిడ్ అయితే కనీసం 4+, ఐఫోన్ అయితే ఐఓఎస్ 7+, విండోస్ అయితే కనీసం 8.1+ వెర్షన్లు ఉండాలని వాట్సాప్ తెలిపింది. జియో ఫోన్, జియో ఫోన్ 2లలోనూ వాట్సాప్ అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే.



పోటీ

ఎస్ లక్ష్మీనారాయణ
డైరెక్టర్, రామయ్య
కాంపిటీటివ్ కోచింగ్ సెంటర్
దిల్‌సుఖ్ నగర్, హైదరాబాద్,
8885555202

ఏయే ప్రాంతాలను దక్షిణసంధిగా ఏర్పరిచారు





- అక్బర్ సమకాలీన విజయనగరరాజు – 2వ వెంకటపతి రాయులు (అరవీటి వంశం)
- అక్బర్ స్పెయిన్ రాజైన 2వ పిలిప్ వద్దకు 1582లో దౌత్య వర్గాన్ని పంపాడు.
- అక్బర్‌ను ఇంగ్లాండులోని ఎలిజబెత్‌లో, ఫ్రాన్స్‌లోని 4వ హెన్రీతో, పర్షియా రాజు షాఅబ్బాస్‌తో చరిత్రకారులు పోల్చుతారు.
- 1605 అక్టోబర్ 17న అక్బర్ ఆగ్రాలో మరణించాడు. ఇతని సమాధి ఢిల్లీలో సమీపంలోని సికిందర్‌లో ఉంది.
- అక్బర్ సమాధి బౌద్ధ విహారలక్షణాతో ఉందని చరిత్రకారుల భావన.

జహంగీర్ (1605 – 27)

- అసలు పేరు – సలీమ్
- **జననము :** 1560 ఆగస్టు 30 (అజ్మీర్‌లోని షేక్ సలీమ్ చిష్తీ దర్గాలో)
- చిత్రలేఖనలో గొప్పవాడు.(మినీయేచర్ సూక్ష్మ చిత్రకళ – దీని సృష్టికర్త – మీర్‌హాసీం)
- 1599, 1601, 1603లో 3సార్లు తండ్రికి వ్యతిరేకంగా దండెత్తి ఓడిపోయాడు.
- అక్బర్, జహంగీర్ మధ్య సంబంధాలను పునరుద్ధరించడానికి ప్రయత్నించిన అబుల్‌ఫజల్‌ను బుందేల్‌ఖండ్‌లో 'బీర్‌సింగ్‌దేవ్' చేత జహంగీర్ చంపించాడు.
- జహంగీర్, అనార్కలీ అనే నాట్యకత్తెను ప్రేమించాడు. దీనిని వ్యతిరేకించి అక్బర్ ''అనార్కలీని' సజీవ సమాధి చేశాడు.
- అక్బర్, సలీమ్‌ల మధ్య సామరస్యాన్ని కుదిర్చిన వారు – మరియం మకాని (సలీం నాయనమ్మ)
- 1605 నవంబర్ 3న 'నూరోద్దీన్ మహ్మద్ జహంగీర్' షాదూషా ఘాజీ' అనే బిరుదుతో పట్టాభిషేకం చేసుకున్నాడు.
- జహంగార్ రాజ్యానికి రాగానే 12 సంస్కరణలు చేశాడు.
- దీనిలో గొప్పది ఆగ్రాకోటలో యమునానది ఒడ్డున నిలిపిన బంగారు ధర్మ గంట (3లక్షలు)
- జహంగీర్‌కు నలుగురు కుమారులు ఉన్నారు. 1)షెహ్రియర్ 2) ఖుస్రూ 3) పార్విజ్ 4) ఖుర్రమ్ (షాజహన్)

ఖుస్రూ

- తల్లి – మన్‌బాయి (జహంగీర్ మొదటి భార్య, రాజాభగవన్‌దాస్ కుమార్తె, రాజామాన్‌సింగ్ సోదరి)
- 1606లో అక్బర్ సమాధిని సందర్శించే నెపంతో తండ్రిని ఎదిరించి పంజాబ్‌లోని తరుణ్ ప్రదేశం వద్ద 5వ సిక్కుమత గురువైన అర్జున్‌సింగ్ ఆమోదంతో లాహోర్‌ను ముట్టడించాడు. కానీ జహంగీర్ ఖుస్రూను ఓడించి లాహోర్‌లో బంధించగా 1616లో ఖుర్రమ్ చేత విషప్రయోగం చేయబడి బుర్హాన్‌పూర్‌లో చంపబడ్డాడు.
- అర్జున్‌సింగ్ ఖుస్రూకు సహాయం చేశాడు అనే కోపంతో జహంగీర్ అర్జున్ సింగ్‌ను వెంటనే 5 లక్షల రూపాయలు చెల్లించాలని కబురుపంపి తిరస్కరించడంతో ఉరి తీశాడు (1606).

నూర్జహాన్‌తో వివాహం (1611)

- నూర్జహాన్ అసలు పేరు – మెహరున్నీసా (స్త్రీ జాతిలో మాణిక్యం వంటిది)
- జన్మించిన ప్రదేశం – 1576) కాందహార్‌లో
- తండ్రి – గియాజ్ బేగ్, తల్లి – అస్మత్ బేగం, అన్న – అసఫ్‌ఖాన్
- మొదటి భర్త పేరు – షేర్ అఫ్ఘన్ (పర్షియా జాతీయుడు)
- వీరి కుటుంబం భారత్‌కు రావడానికి సహకరించినవాడు 'మాలిక్ మసూద్' అనే ఒంటెల వ్యాపారి.
- గియాజ్ బేగ్‌నకు ఉన్నత ఉద్యోగాన్ని ఇచ్చి అతనికి 'ఇత్ ముద్దౌలా' అనే బిరుదునిచ్చిన మొగల్‌రాజు – అక్బర్ (1605)
- షేర్ అఫ్ఘన్ 'బర్ద్వాన్'పై ఫౌజ్‌దార్‌గా నియమింపబడ్డాడు.
- నూర్జహాన్, షేర్ అఫ్ఘన్‌ల కుమార్తె – లాడ్లీ బేగమ్.
- 1607లో షేర్ అఫ్ఘన్ మరణించగా మెహరున్నీసాను ప్రధాన రాణి సలీమా బేగంకు చెలికత్తెగా నియమించాడు.
- 1611లో నౌరోజీ పండుగ రోజున అంతఃపురంలో జహంగీర్ మెహరున్నీసాను ఆమె 35వ ఏట వివాహం చేసుకొని మొదట నూర్‌మహల్(ఇంటికి వెలుగు)గా తరువాత 'నూర్జహన్' (ప్రపంచానికి వెలుగు)గా బిరుదు ఇచ్చి ప్రధాన రాణిగా చేసుకున్నాడు.
- నూర్జహాన్ నగలు చేయడంలో, రెడీమేడ్ దుస్తుల తయారీలో, గులాబీల నుండి అత్తరు చేయడం ఈమెనే మొదటిసారిగా ప్రవేశపెట్టింది.

నూర్జహాన్ జుంటా పాలన (1614%1626)

- గియాజ్ బేగ్ – తండ్రి (వజీర్ పదవి) అసఫ్ ఖాన్ – అన్న – దివాన్ (ఆర్థిక శాఖ)
- అస్మత్‌ళ బేగ్ – తల్లి – అంతరంగిక సలహాదారు, ఖుర్రమ్ – రాజకుమారుడు – ప్రధాన సేనాపతి.
- ఇతనికి సమాంతరంగా మహజత్‌ఖాన్ అనే వాడిని సేనాపతిగా నియమించింది.
- తన కూతురు లాడ్లీ బేగమ్‌ను 'షహ్రియర్'కిచిచ వివాహం చేయగా అసఫ్ ఖాన్ తన కూతురు మంతాజ్‌బేగంను ఖుర్రంకు ఇచ్చి వివాహం చేసాడు.
- జహంగీర్ మొదటి దండయాత్ర బెంగాల్‌పై జరిగింది. బారాబయ్యాలను (12 మంది సోదరులను ఓడించారు. వీరి నాయకుడు 'మూసాఖాన్'

మేవాడ్‌పై యుద్ధము (1605–1615. 3 సార్లు)

- 1597లో రాణాప్రతాప్‌సింగ్ మరణించాడు. ఇతని కుమారుడు అమర్ సింగ్ రాజుగా ఉన్నప్పుడు 1613లో ఖుర్రమ్ మేవాడ్‌పై జరిపిన 3వ దండయాత్రలో అమర్‌సింగ్‌ను ఓడించి మొదటిసారిగా చిత్తోడ్‌పై పూర్తి విజయమును సాధించి మేవాడ్ సంధి చేసుకున్నాడు.
- జహంగీర్ 1606లో కాందహార్‌ను జయించి తిరిగి కోల్పోయాడు.

దక్కన్ దండయాత్రలు (1708–1627)

- చాంద్‌బీబీ తరువాత అహ్మద్‌నగర్ పాలకుడిగా వచ్చినబాడు – మాలిక్ అంబర్ (అబిసీనియా జాతీయుడు)
- మొదటిసారిగా మహారాష్ట్రులను సైన్యంలోకి తీసుకున్న అహ్మద్‌నగర్ పాలకుడు – మాలిక్ అంబర్
- ఖుర్రమ్ 1616లో మాలిక్ అంబర్‌ను జయించి 'అహ్మద్‌నగర్ సంధి' చేసుకున్నాడు.
- ఈ విజయం వలన ఖుర్రమ్‌ను మన్‌సబ్‌దారీ హోదాను పెంచి దక్కన్ గవర్నర్‌గా నియమించడమే గాక జహంగీర్ ఖుర్రమ్‌కు 'షాజ్‌హాన్' అనే బిరుదును ఇచ్చాడు.
- మొదటిసారిగా బీజాపూరు, గోల్కొండ, సుల్తాలను ఓడించి వారి నుండి కప్పమును పొందిన మొదటి చక్రవర్తి – జహంగీర్.
- అహ్మద్‌నగర్, బీజాపూర్, గొల్కొండలను కలిపి జహంగీర్ 'దక్షిణసంధి'గా ఏర్పర్చి గవర్నర్‌గా షాజహాన్‌ను నిలిపాడు.
- షాజహాన్ 1622లో అసఫ్‌ఖాన్ సలహాపై నూర్జహాన్‌పై దండెత్తి 'ఫతేపూర్ సిక్రీ' వద్ద ఓడి భార్య పిల్లలను నూర్జహాన్ వద్ద హామీగా ఉంచి బాలాఘాట్‌పై గవర్నరుగా నియమింపబడ్డాడు.
- 1626లో మహబత్‌ఖాన్ పార్విజ్‌ను వారసునిగా ప్రకటించి జహంగీర్‌ను జీలం నడి ఒడ్డున బంధించి 'శతదిన పాలన' చేసి రాజుకు లొంగిపోయాడు.
- భారతదేశంలో ఆంగ్లేయుల మొదటి వర్తక స్థావరం – సూరత్. (అనుమతిని జహంగార్‌లో ఇచ్చాడు)
- భారతదేశంలో ఆంగ్లేయులు వర్తకం ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవడానికి ఈస్ట్ ఇండియా కంపెనీకి 1615లో అనుమతిని ఇచ్చిన మొఘల్‌రాజు – జహంగీర్.
- అనుమతి పొందిన ఆంగ్లేయ వర్తకుడు సర్‌థామస్‌రో.
- ఈ కాలంనాటి ఇంగ్లండ్ రాజు – మొదటి జేమ్స్.
- జహంగీర్ పంజాబ్ నుండి ఢిల్లీకి ఇస్తూ లాహోర్, కాశ్మీర్‌ల మధ్యలో ఉన్న 'జరీరా' అనే ప్రదేశం వద్ద 1627 అక్టోబర్ 28న మరణించాడు.
- జహంగీర్ చరిత్రను రాసినవాడు – బేనీ ప్రసాద్
- తుజ్‌కి – ఇ – జహంగీర్, జహంగీర్ స్వీయచరిత్ర.
- ఇతని ఆస్థాన చిత్రకారుడు – క్వాజా మన్‌సూర్.
- జహంగీర్ 'మెహర్' బంగారు నాణెలను విడుదల చేసినట్లు తెలుస్తుంది.
- ఇతని పాలనా కాలంలో పంజాబ్‌లో 1616లో బొబ్బలప్లేగు వ్యాధి వచ్చింది.
- వ్యసనాలకు, నూర్జహాన్‌పై మోజుకు గురికాకుండా ఉన్నట్లయితే జహంగీర్ గొప్ప చక్రవర్తి అయ్యేవాడు అన్నది – జాఫర్.

షాజహాన్ (1628–1658)

- ఇతని పాలనా కాలమును స్వర్ణయుగముగా పేర్కొంటారు.
- అసలు పేరు – ఖుర్రమ్ తండ్రి : జహంగీర్, జన్మస్థలం 1592 జనవరి 5న లాహోర్‌లో
- తల్లి : జకత్ గోసైన (మన్మతి) (రాజపుత్రరాణి : ఉదయ్‌సింగ్ కుమార్తె)
- షాజహాన్ అసఫ్‌ఖాన్ ఆహ్వానం మేరకు దక్కన్ నుండి ఢిల్లీకి వచ్చి షహ్రియర్‌ను అంధుని గావించి దన్యాల్ రాజకుమారుని, దవార్‌భక్ష్‌లను హతమార్చి (ఖుస్రూ కుమారులు) రాజ్యానికి వచ్చాడు (1628 ఫిబ్రవరి 14)
- షాజహాన్ అసఫ్‌ఖాన్‌ను వజీరుగా నియమించాడు. నాణెములపై ఒక వైపున నలుగురు మొదటి ఖలీఫాను ముద్రించాడు.
- నూర్జహాన్ మరణించే వరకు (1645) అమెకు సాలుకు లక్ష రుపాయల మనోవర్తిని ఇచ్చాడు.
- ఉదయ్‌పూర్ రాజైన రాజాకరణ్‌కు షాజహాన్ గౌరవ దుస్తులను, రత్నఖడ్గంను రూ. 30,000 ఖరీదు చేసే బదక్షిచీ అనే పేరు గల రూబీని వెండి అంచరీ గల ఏనుగును, బంగారు జీను గల గుర్రమును బహూకరించాడు.

దక్కను దండయాత్రలు (1629)


- వారసత్వ యుద్ధంలో నూర్జహాన్‌కు మద్ధతు పలికిన ఖాన్‌జహాన్‌పై దండెత్తగా అతడు అహ్మద్‌నగర్ రాజుల ఆశ్రయం పొందాడు.
- మొఘల్ చరిత్రలో మొదటిసారిగా మహారాష్ట్రను సైన్యంలోకి తీసుకున్న మొదటిరాజు – షాజహాన్.
- 1631లో అహ్మద్‌నగర్ వారికి మద్ధతుగా వచ్చిన 'రణదుల్లాఖాన్' నాయకత్వంలోని బీజాపూర్ సేనలను 'పరండా' యుద్ధంలో ఓడించాడు.
- 1631లో ముంతాజ్‌బేగం మరణించగా దక్కన్ దండయాత్ర మధ్యలోనే ఆగిపోయింది.
- దక్కన్‌పై షాజహాన్ మొహబత్‌ఖాన్‌ను దక్కన్ గవర్నర్‌గా నియమించాడు.
- 1633లో అహ్మద్‌నగర్ నిజాంషాహీ రాజైన హుస్సేన్‌ను ఓడించి గ్వాలియర్ కోటలో బంధీగా చేసాడు.
- ఈ యుద్ధంలో అహ్మద్‌నగర్‌వైపు పోరాడిన నాయకుడు షాజీబోంస్లే.
- 1636లో మహోలి యుద్ధంలో షాజీబోంస్లే పూర్తిగా ఓడిపోవడంతో నిజాం షాహి వంశం అంతరించి అహ్మద్‌నగర్ మొఘులుల వంశం అయ్యింది.
- 1636లో బీజాపూర్‌ను పూర్తిగా షాజహాన్ ఆక్రమించాడు.
- గోల్కొండ నవాబు అబ్దుల్లా కుతబ్‌షాను 1636లో షాజహాన్ ఓడించి రెండు లక్షల కప్పమును (హక్‌లను) తీసుకున్నాడు.
- ఈశాన్య సరిహద్దులో ఉన్న బల్కిస్థాన్ (చిన్న టిబెట్)పైకి జాఫర్‌ఖాన్‌ను పంపగా దానిని వశపరుచుకున్నాడు.

భవన నిర్మాణములు

ఆగ్రా నివాసయోగ్యముగా లేదని 1639 – 1648 వరకు షాజహానాబాద్ అనే పేరుతో ఢిల్లీ సమీపంలో నగరమును నిర్మించాడు.

జన్యుమార్పు రోగుల పర్యవేక్షణలో వైఫల్యం

జన్యుమార్పు చేయించుకున్న రోగులను పర్యవేక్షించడంలో డాక్టర్లు విఫలం చెందుతున్నారు. క్రిస్పర్ –కేస్ 92 సాధనంతో ఎవరి జన్యువులు మార్పు చెందాయో ఆ రోగుల బాగోగుల సంగతి శాస్త్రవేత్తలు పట్టించుకోకపోవడంతో జన్యు సంక్షిప్త పరిశోధన భవిష్యత్తు అగమ్య గోచరంలో పడుతోందని అమెరికా మీడియా కథనం వెల్లడించింది. భారత దేశానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి అయిన అన్నవాహిక క్యాన్సర్ రోగి 57 ఏళ్ల సంజిత్ కుమార్ సమాల్ జన్యుసంక్షిప్తాన్ని చేయించుకున్నప్పటికీ చనిపోయాడు. క్రిస్పర్ చికిత్స ద్వారా జన్యుసంక్షిప్తం చేయించుకున్న తరువాత సమాల్ క్యాన్సర్ కణితి కరిగి ఆరోగ్యం మెరుగుపడిందని కుటుంబ సభ్యులు చెప్పారు. కానీ గుండెవైఫల్యం, బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి సెప్టెంబరులో సమాల్ చనిపోయాడు. ఇదివరకు సమాల్ గుండె విఫలమైన సమస్య ఏదీ లేదు. మరోకేసు అన్వాల్ కెడ్‌జీన్ బయోటెక్నాలజీ ప్రైవేట్ సంస్థ. ఇక్కడ జన్యువు డిఎన్‌ఎ మార్పు చేసిన తరువాత ఆయా రోగుల సంగతి ఏమిటో తెలియకుండా పోయింది. జన్యు సంక్షిప్త సాధనాన్ని కనుగొన్న వారిలో ఒకరైన జెన్నిఫర్ డౌడ్నా మానవ జన్యుక్రమాన్ని ఇంకా సరిగ్గా అర్థం చేసుకోలేకపోతున్నామని, అలాగే క్రిస్పర్ క్యాస్ టెక్నాలజీని ఇంకా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అందువల్ల ఆయా రోగులకు ఎదురయ్యే పరిణామాలు జీవితాంతం పర్యవేక్షించ వలసిన అగత్యం ఏర్పడిందని అన్నారు. ఈ టెక్నాలజీని కనుగొన్న మరోశాస్త్రవేత్త ఫెంగ్‌జాగ్ రోగుల విషయంలో సరైన చికిత్స విధానం, రెగ్యులర్ ఫాలోఅప్స్ ముఖ్యమని చెప్పారు. నవంబర్ నుంచి క్రిస్పర్ టెక్నాలజీ వార్తల్లో నానుతోంది. పిండాల జన్యువులను తాను మార్పిడి చేశానని చైనా శాస్త్రవేత్త ప్రకటించిన తరువాత ఈ జన్యు మార్పిడి ప్రయోగం అనేక వివాదాలకు దారి తీసింది. ఒక సాధనం ద్వారా జన్యువులను సంక్షిప్తం చేయడం చైనా, అమెరికా దేశాల్లో నేరమేమీ కాదు. అయితే ఇవి చేయడానికి ముందు అనుమతులు తీసుకోవడం తప్పనిసరి. అనేక విభాగాలు అనుమతిస్తేనే ఈ ప్రయోగాలు చేయడానికి అమెరికాలో వీలవుతుంది. చైనాలో హాస్పిటల్ ఎథిక్స్ ప్యానెల్ కమిటీ అనుమతి అవసరం. 2018 జనవరి నాటికి12 ప్రయోగాల ద్వారా 86 తీవ్ర క్యాన్సర్ బాధితుల జన్యువులను సంక్షిప్తం చేయడమైంది. వీరిలో చాలా మంది కెడ్‌జీన్ అనే ప్రైవేట్ సంస్థ ద్వారా జన్యుసంక్షిప్తం చేయించుకున్నారు. ఈ కంపెనీ ప్లాను ప్రకారం ప్రయోగాలు పూర్తి చేయకుండానే ఆయా రోగులతో సంబంధాలు తెంచుకుంది. ట్రీట్‌మెంట్ సమయంలో ఎవరూ చనిపోలేదు. సమాల్ రెండు సార్లు క్రిస్పర్ ద్వారా రక్తమార్పిడి చేయించుకున్న తరువాత ఆరోగ్యం మెరుగుపడింది. 90 శాతం కణితి కరిగిందని డాక్టర్లు నిర్ధారించారు. అయితే రక్త మార్పిడికి చైనా వచ్చిన ఆరు వారాల తరువాత సమాల్ చనిపోయాడని కుటుంబ సభ్యులు చెప్పారు.




– మనతెలంగాణ, సైన్స్ విభాగం

చంద్రుని చీకటి వైపు చైనా వ్యోమనౌక

బీజింగ్ : చైనా పరిశోధక వ్యోమనౌక డ్రాగన్ ఆదివారం అనుకున్న విధంగా చంద్రుని కక్ష్యలోకి చేరింది. చంద్రుని అవతల చీకటి వైపునకు చేరాలన్న ప్రయత్నానికి ఇది నాంది. చంద్రుని అవతలి వైపునకు చేరుకోవాలన్న ప్రయత్నం ఇదే మొదటి సారి. చంద్రుని పరిణామ క్రమం నుంచి చంద్రుని అదే పార్శ్వం భూమివైపు ఒకేలా పరిభ్రమిస్తుండడం జరుగుతోంది. చంద్రుని మరో పార్శ్వం భూమికి ఎప్పుడూ కనిపించదు. ఆ భాగాన్నే చీకటి పార్శ్వం అంటారు. ఈ చాంగ్ ఇ 4 ప్రోబ్ చంద్రుని బాదం ఆకారంలో ఉండే కక్ష్య లోకి ప్రవేశించింది. చంద్రుని చీకటి వైపు ఎక్కడ ఎప్పుడు దిగాల్లో కంట్రోల్ సెంటర్ ఎంపిక చేస్తుంది. లాండర్, రోవర్‌తో కలిపి చాంగ్ ఇ 4 ప్రోబ్ సియాచిన్ లోని జిచాంగ్ శాటిలైట్ లాంచ్ సెంటర్ నుంచి డిసెంబర్ 8 న ప్రయోగించడమైంది. చంద్రుని చీకటి పార్శ్వం లోని దక్షిణ ధ్రువ ప్రాంతంలో అయిట్‌కెన్ లోయలో ఈ ప్రోబ్ దిగుతుంది. ఇది శాస్త్రవేత్తల పరిశోధనకు ఇదో అగ్నిపరీక్ష అని చెప్పాలి. చంద్రుని ఉపరితలంపై ఉన్న ఎత్తుపల్లాలు, చంద్రుని గర్భంలో ఖనిజాలు, చంద్రుని ఉపరితల గుల్ల ప్రదేశం, న్యూట్రాన్ రేడియేషన్ ఇవన్నీ పరిశోధించడమే ఈ ప్రోబ్ లక్ష్యం.

– సైన్స్ విభాగం



మృణాల్‌ను సినీ సేనానిగా మార్చిన మృగయా

న్యూఢిల్లీ : మృగయా ..రాజరికపు దర్జా ప్రభువులు సాగించే వేట. ప్రముఖ దర్శకులు మృణాల్ సేన్ సృజనాత్మకతకు అంతకు మించిన జీవన స్థితిగతుల అన్వేషణా బలానికి ఈ మృగయా సినిమా అద్దం పడుతుంది. ఈ చిత్రంలో ప్రధాన పాత్రధారిగా డిస్కో డాన్సర్ మిథున్ చక్రవర్తి జీవం పోశారు. 1976లో ఈ సినిమా వచ్చింది. భగ్‌బతి చరణ్ పాణిగ్రహి రాసిన కథ షికారు ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది. బ్రిటిష్ వలసపాలకులు, దేశంలోని గ్రామస్తులకు మధ్య ఉండే సంబంధాన్ని ఈ చిత్రంలో కళ్లకు కట్టినట్టుగా మృణాల్ తెరకెక్కించారు. 1920 ప్రాంతంలో తెల్లదొరలు సాగించినదురాగాతాలు, అమాయక పల్లె ప్రజలపై సాగించిన జులుం ఈ చిత్రంలో ప్రదర్శితం అయింది. ప్రజలను ఏదో విధంగా మచ్చిక చేసుకుని పాలనపగ్గాలు దక్కించుకున్న దొరలు తమ ఆధీనంలోని ప్రజలను ఏ విధంగా తమ అవసరాలకు వాడుకున్నారు? తమ అలవాట్లను తమ వ్యసనాలను తీర్చుకోవడానికి వీరిని ఏ విధంగా బలిపశువులను చేశారనేది ఈ చిత్రంలో చూపించారు. ఒక బ్రిటిష్ పాలకుడు తాను పరిపాలించే ప్రాంతంలో స్థానిక గిరిజన యువకుడితో ఏ విధంగా స్నేహం పెంచుకున్నాడు? ఈ స్నేహం ఆసరాగా చేసుకుని తన వేట వ్యసనాన్ని ఏ విధంగా సాగించాడు? అనేది ఈ సినిమాలోని ఇతివృత్తం. విలువిద్యలో ఆరితేరిన గిరిజన యువకుడి ప్రతిభను గుర్తించి ఏ విధంగా వేటకు వాడుకున్నాడు? అనేది మృగయాలో ప్రధాన అంశం. ఈ సినిమా కళాత్మక విలువలు, అంతర్లీనంగా వాణిజ్యపరమైన అంశాలు మేళవించి ఉన్నాయి. మిథున్ ఈ గిరిజన యువకుడిగా , గిరిజన యువతిగా మమత శంకర్ నటించారు. వీరికి ఇదే తొలిసినిమా. సంగీతం సలీల్ చౌదరి అందించారు. ఈ సినిమా పలు అవార్డులను అంతకు మించి ప్రజల మన్ననలను పొందింది. దీని ఖ్యాతి ఎల్లలు దాటింది.



గ్రామీణ నేపథ్యంలో సాగే కథకు మృణాల్ జీవం పోశారు. ఒక కుగ్రామంలో నివసించే గిరిజన తెగ ఆ ప్రాంతంలోని అడవులు అందులోని క్రూర మృగాల మధ్య జీవనం సాగిస్తూ ఉంటుంది. పులులు, ఎలుగుబంట్ల మధ్య వీరి బతుకు పయనం సాగుతుంది. ఈ దశలోనే అక్కడికి బ్రిటిష్ పాలనా అధికారిగా ఒక వ్యక్తి వస్తాడు. తనకున్న వేట అభిరుచిని కొనసాగించేందుకు స్థానిక యువకుడు గినూవాతో స్నేహం చేస్తాడు. వేటకు గిరిజన యువకుడి సాయం తీసుకుంటాడు. మృగాలను వేటాడినప్పుడల్లా యువకుడికి కానుకలు అందిస్తాడు. ఆ తరువాత కుగ్రామంలోకి ఒక విప్లవకారుడు రావడం, ఆయనపై హత్యా నేరం పడటం, తరువాత ఆయన మృతి చెందడం, ఈ దశలోనే గ్రామంలోని వడ్డీవ్యాపారి గిరిజన యువకుడి భార్యను ఎత్తుకెవెళ్లడంతో యువకుడు ఈ వ్యాపారిని చంపివేయడం జరుగుతుంది. తరువాత బ్రిటిష్ అధికారి వద్దకు వెళ్లి వేటకు వెళ్లేందుకు సిద్ధం అవుతాడు. అయితే వ్యక్తిని హత్య చేసినందుకు యువకుడికి ఉరిశిక్ష వేస్తారు. అడవులలో జీవుల ప్రాణాలు తీసినందుకు నజరానాలు, ఇప్పుడు తనకేమో మరణదండనలా..ఏమిటీ న్యాయం అనుకుంటూనే యువకుడు ఉరికంభం ఎక్కడంతో సినిమా ముగుస్తుంది. అప్పటి వరకూ రాజకీయ నేపథ్యపు సినిమాలు తీస్తూ వచ్చిన మృణాల్‌కు ఈ సినిమా భిన్నమైన సినిమాగా నిలిచింది. ప్రత్యేకించి మానవ సంబంధాలు, అధికార జులుంతో దెబ్బ తిన్న గిరిజన యువత సంఘర్షణ వంటివి ఈ సినిమాకు జీవం పోశాయి. అంతకు ముందు 1974లో తీసిన కోరస్ ఆర్థికంగా దెబ్బతింది. తానే నిర్మించిన ఈ సినిమా వైఫల్యంతో మృణాల్‌కు ఆర్థిక చిక్కులు ఏర్పడ్డాయి. ఈ దశలో గ్రామీణ నేపథ్యపు సినిమాలను అందులోనూ ఉత్కంఠభరిత ఘటనలకు వీలుండే కథను ఎంచుకుని తరువాతి సినిమాగా మృగయాను తీశారు. ఈ సిన్మాకు కె రాజేశ్వర రావు నిర్మాతగా వ్యవహరించారు. మృణాల్ సేన్‌కు ఇది తొలి రంగుల చిత్రం అయింది. అప్పట్లో మిథున్ ఫిల్మ్ ఇనిస్ట్యూట్‌లో విద్యార్థిగా ఉన్నారు. ఆయనను చూడగానే మృగయా కీలక పాత్రకు సరిపోతారని గ్రహించి మృణాల్ సాగారు.

'ఎ లవ్ అన్‌కండీషనల్' అనే పుస్తకాన్ని నేను పవన్‌ను ఉద్దేశిస్తూ రాయలేదు. ఇందులో ఎలాంటి వివాదాస్పద అంశాలను ప్రస్తావించలేదు. పవన్‌ను మనసులో పెట్టుకునే నేను రొమాన్స్, సంతోషం, బాధల గురించి వివరిస్తూ పద్యాలు రాశానని అంటున్నారు. అందులో ఏమాత్రం నిజం లేదు.
– నటి రేణు దేశాయ్

సినిమా

క్రేజీ కాంబినేషన్‌లో...



స్టైలిష్ స్టార్ అల్లుఅర్జున్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్‌ల కాంబినేషన్‌లో మరో చిత్రం రూపుదిద్దుకోనుంది. జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి చిత్రాల తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న మూడవ చిత్రమిది. హీరోగా అల్లు అర్జున్‌కు ఇది 19వ చిత్రం. హారిక అండ్ హాసిని క్రియేషన్స్, గీతాఆర్ట్స్ బ్యానర్‌లపై ఎస్.రాధాకృష్ణ, అల్లు అరవింద్‌లు ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఇప్పటికే సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర తారాగణం, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే తెలియజేయనున్నారు. జనవరిలో ఈ చిత్రం ప్రారంభమవుతుందని నిర్మాతలు ఎస్.రాధాకృష్ణ, అల్లు అరవింద్ తెలిపారు.

అల్లుఅర్జున్, త్రివిక్రమ్, అల్లు అరవింద్, ఎస్.రాధాకృష్ణ



'ఎఫ్2' బిగ్ సీడీని విడుదల చేస్తున్న మంత్రి గంటా శ్రీనివాస్‌రావు. చిత్రంలో వెంకటేశ్, వరుణ్‌తేజ్, దేవిశ్రీ ప్రసాద్, దిల్‌రాజు, లక్ష్మణ్, శిరీష్.


మైమరపిస్తున్న మహేష్ లుక్



సూపర్‌స్టార్ మహేష్‌బాబు హీరోగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, వైజయంతి మూవీస్, పివిపి సినిమా పతాకాలపై రూపొందుతున్న భారీ చిత్రం 'మహర్షి'. మహేష్‌కు ఇది 25వ చిత్రం కావడం విశేషం. ఈ చిత్రం సెకండ్ లుక్‌ను నూతన సంవత్సర కానుకగా విడుదల చేశారు. ఇక రామోజీ ఫిల్మ్‌సిటీ షెడ్యూల్ పూర్తయింది. జనవరి రెండో వారం నుంచి మార్చి వరకు జరిగే కొత్త షెడ్యూల్‌తో మొత్తం సినిమా షూటింగ్ పూర్తవుతుంది. సమ్మర్ స్పెషల్‌గా ఏప్రిల్‌లో ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మహేష్ సరసన పూజా హెగ్డే కథానాయికగా నటిస్తోంది. అల్లరి నరేష్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని సమకూరుస్తున్న ఈ చిత్రానికి మోహనన్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. హరి సాల్మన్, సునీల్‌బాబు, కె.ఎల్.ప్రవీణ్, రాజు సుందరం, శ్రీమణి, రామ్ లక్ష్మణ్ ఈ చిత్రానికి పనిచేస్తున్న ముఖ్య సాంకేతిక వర్గం.

క్రికెటర్‌గా ఆకట్టుకుంటున్నాడు

హీరో నాని 'భీమిలి కబడ్డీ జట్టు' చిత్రంలో అచ్చమైన కబడ్డీ ప్లేయర్‌గా కనిపించి ఆకట్టుకున్నాడు. ఆ చిత్రం అతనికి మంచి పేరును తీసుకువచ్చింది. మళ్లీ ఇన్నాళ్ల తర్వాత క్రీడల నేపథ్యంలో సినిమా చేస్తున్నాడు. 'జెర్సీ' పేరుతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇప్పుడు సినిమా ఫస్ట్ లుక్ కూడా వచ్చింది. క్రికెట్ నేపథ్యంలో రూపొందుతున్న 'జెర్సీ'లో నాని లుక్ డిఫరెంట్‌గా ఉంది. క్రికెటర్‌గా నాని కాస్త రఫ్‌గా, పెరిగిన జట్టు, గడ్డంతో కనిపించాడు. 'మళ్లీ రావా' ఫేం గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్న ఈ సినిమాకు తమిళ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ సంగీతాన్ని అందిస్తున్నాడు.



సంక్రాంతి అల్లుళ్లు వస్తున్నారు

సీనియర్ స్టార్ వెంకటేశ్, యంగ్ స్టార్ వరుణ్‌తేజ్ హీరోలుగా తమన్నా, మెహరీన్ హీరోయిన్లుగా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్‌రాజు నిర్మిస్తున్న చిత్రం 'ఎఫ్2'. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 12న విడుదల కానుంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందించిన పాటలను వైజాగ్ ఆర్.కె. బీచ్‌లో జరిగిన విశాఖ ఉత్సవంలో విడుదల చేశారు. ఆడియో సీడీలను ఆంధ్రప్రదేశ్ మంత్రి గంటా శ్రీనివాస్‌రావు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్ మాట్లాడుతూ ''నా తొలి సినిమా 'కలియుగ పాండవులు'తో పాటు స్వర్ణ కమలం, సుందరకాండ, మల్లీశ్వరి, గురు తదితర చిత్రాలను వైజాగ్‌లో చేశాం. వైజాగ్ ఉత్సవాల్లో మా సినిమా పాటలను విడుదల చేయడం ఆనందంగా ఉంది. దర్శకుడు అనిల్ వండర్‌ఫుల్ స్క్రిప్ట్ రాశాడు. దేవిశ్రీ ప్రసాద్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు. 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' తర్వాత దిల్‌రాజుతో చేసిన సినిమా ఇది. ఆ సమయంలో మహేష్‌ను ఓ సోదరుడిలా చూసుకున్నాను. ఇప్పుడు 'ఎఫ్2'లో వరుణ్‌తేజ్‌ను సోదరుడిలా చూసుకున్నాను. జనవరి 12న ఈ సినిమా విడుదల కానుంది''అని అన్నారు. వరుణ్‌తేజ్ మాట్లాడుతూ ''వైజాగ్‌లో నేను సత్యానంద్ దగ్గర నటనలో శిక్షణ తీసుకున్నాను. ఇక దేవిశ్రీ ప్రసాద్‌తో తొలిసారి పనిచేశాను. ఆయన మంచి పాటలు ఇచ్చారు. దర్శకుడు అనిల్ నాకు మంచి పాత్ర ఇచ్చాడు. వెంకటేశ్‌తో కలిసి పనిచేయడం గౌరవంగా భావిస్తున్నాను''అని తెలిపారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ ''ఎఫ్2 కథను వైజాగ్‌లో చర్చించి రాసుకున్నాను. ఇక దిల్‌రాజుతో ఇది నా మూడో సినిమా. వెంకటేశ్‌తో పనిచేయడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను. ఆయన కామెడీ టైమింగ్ ఎంతో బాగుంటుంది. వరుణ్‌తేజ్ తొలిసారి కామెడీ జోనర్‌లో నటిస్తున్నాడు. దేవిశ్రీ అందించిన ఆరు పాటలు బావున్నాయి. ఈ సంక్రాంతికి ఫ్యామిలీతో మా సినిమాకు వస్తే ఆనందంగా నవ్వుకుంటూ వెళ్తారు''అని చెప్పారు. దిల్‌రాజు మాట్లాడుతూ ''వెంకటేశ్‌తో మా బ్యానర్‌లో చేసిన 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' సంక్రాంతికి విడుదలై పెద్ద విజయాన్ని సాధిస్తే... వరుణ్‌తో 'ఫిదా' చేసి హిట్ కొట్టాం. ఇప్పుడు ఇద్దరూ కలిసి మా బ్యానర్‌లో మల్టీస్టారర్ చేశారు. ఈ చిత్రం ద్వారా వరుణ్ ఫ్యామిలీ ఆడియన్స్‌కు మరింత దగ్గరవుతాడు. దర్శకుడు అనిల్ రావిపూడి ఈ సినిమా కథ చెబుతున్నప్పుడు నవ్వుతూనే ఉన్నాను. 'ఎఫ్2' పక్కా ఫ్యామిలీ సినిమా. కుటుంబంతో వచ్చే ప్రేక్షకులు రెండున్నర గంటల సేపు నవ్వుకుంటారు. అందుకనే సంక్రాంతి అల్లుళ్లు వస్తున్నారు అనే మరో ట్యాగ్‌లైన్ కూడా అనిల్ యాడ్ చేశాడు. వెంకటేశ్ ఆంధ్ర అల్లుడైతే, వరుణ్ తెలంగాణ అల్లుడు''అని అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, శిరీష్, కాసర్ల శ్యామ్, శ్రీమణి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



చిన్న సినిమాల్లో పెద్ద సినిమా

సత్యదేవ్, నందితా శ్వేత హీరోహీరోయిన్లుగా శ్రీదేవి మూవీస్ సంస్థ అధినేత శివలెంక కృష్ణ ప్రసాద్ సమర్పణలో తెరకెక్కిన చిత్రం 'బ్లఫ్ మాస్టర్'. గోపీ గణేశ్ పట్టాభి దర్శకత్వంలో అభిషేక్ ఫిలిమ్స్ అధినేత రమేష్ పిళ్లై నిర్మించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైంది. హైదరాబాద్‌లో జరిగిన సినిమా సక్సెస్‌మీట్‌లో సత్యదేవ్ మాట్లాడుతూ ''మా సినిమాకు పనిచేసిన యూనిట్ సభ్యులు, నా స్నేహితులు, కుటుంబ సభ్యులు సినిమా బావుందన్నప్పుడు నా మీద ప్రేమతో చెప్పారనుకున్నాను. అయితే మూడు రోజులుగా థియేటర్లలో ప్రేక్షకుల స్పందన చూసి గర్వంగా అనిపించింది''అని అన్నారు. గోపీగణేష్ మాట్లాడుతూ ''సినిమాకు వస్తున్న స్పందన సంతోషాన్నిచ్చింది. చిత్రంలోని డైలాగులు బాగున్నాయని అందరూ అంటున్నారు''అని తెలిపారు. శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ''ఇది చిన్న సినిమాల్లో పెద్ద సినిమా. గీతా ఆర్ట్స్, సురేష్ ప్రొడక్షన్స్, ఇతర బ్యానర్ వాళ్లు ఈ సినిమా బాగుందని అంటున్నారు. నిర్మాతగా నాకు మంచి సంతృప్తినిచ్చిన సినిమా ఇది''అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మారుతి, లక్ష్మీ భూపాల్, నందితా శ్వేత పాల్గొన్నారు.



త్వరలోనే విశాల్ నిశ్చితార్థం



తమిళ్ హీరో విశాల్ ప్రేమ, పెళ్లి విషయమై చాలా కాలంగా మీడియాలో వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. వరలక్ష్మితో ప్రేమాయణం గురించి ఎన్నో సార్లు వార్తలు వచ్చాయి. కానీ ఇద్దరు కూడా పలుసార్లు తమ ప్రేమ విషయాన్ని కొట్టిపారేశారు. ఇక తాజాగా విశాల్ వివాహం గురించి మరో వార్త మీడియాలో హల్‌చల్ చేస్తోంది. త్వరలోనే విశాల్ హైదరాబాదీ అమ్మాయి అనీషాను పెళ్లి చేసుకోబోతున్నాడని... త్వరలోనే వీరి నిశ్చితార్థం కూడా జరుగుతుందని తమిళ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఇక గత మూడు, నాలుగు సంవత్సరాలుగా విశాల్ తన పెళ్లిని వాయిదా వేస్తూ వస్తున్నాడు. నడిగర్ సంఘం భవనం పూర్తయిన తర్వాతే పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. ఇక నడిగర్ సంఘం భవన నిర్మాణం పూర్తికాబోతోంది. ఈ నేపథ్యంలో విశాల్ పెళ్లికి సిద్ధమైనట్లు తెలిసింది. 2019 చివరలో విశాల్ వివాహం జరుగుతుందని తమిళ సినీ వర్గాలు అంటున్నాయి.

కళ్యాణం కమనీయం















రాజమౌళి తనయుడు ఎస్.ఎస్.కార్తికేయ, పూజల వివాహం జైపూర్‌లో ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. పెళ్లికి రెండు రోజుల ముందు నుండే సందడి మొదలైంది. సంగీత్ కార్యక్రమంలో టాలీవుడ్ స్టార్స్ చేసిన డ్యాన్సులతో పెళ్లి వేడుక అదిరిపోయింది. ప్రభాస్, ఎన్టీఆర్, రామ్‌చరణ్, రానా, అనుష్కలు హుషారుగా స్టెప్పులు వేసి అలరించారు. వీరికి తోడుగా రాజమౌళి, ఎం.ఎం.కీరవాణి సైతం డ్యాన్స్ చేసి ఆకట్టుకున్నారు. పెళ్లి పక్కా హిందూ సంప్రదాయంలో ఎంతో పద్ధతిగా జరిగింది. వివాహ వేడుకలో స్టార్స్ చేసిన సందడి అంతా ఇంతా కాదు. ఇక ఈ వేడుకలో పెళ్లి కూతురు పూజను పల్లకిలో తీసుకువచ్చిన సమయంలో ప్రభాస్ పక్కనే ఉండటం అందరి దృష్టిని ఆకర్షించింది. పూజను పల్లకిలో ప్రభాస్ తీసుకు వస్తున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ప్రభాస్‌తో పాటు ఇంకా పలువురు స్టార్స్ ఈ పెళ్లి వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తమ ఇంట్లో పెళ్లి అన్నంత హడావుడి చేశారు. తన సినిమాల్లో అద్భుతమైన సెట్టింగ్స్‌ను వేయించే రాజమౌళి తన కొడుకు పెళ్లి కోసం అందమైన వివాహ వేదికను ఏర్పాటు చేయించాడు. పెళ్లి మండపం ఎంతో అందంగా ఉందంటూ పెళ్లికి హాజరైన వారు అభినందించారు. మొత్తానికి కార్తికేయ, పూజల వివాహం కన్నుల పండువగా జరిగింది.

సన్నీ గ్లామర్ రేంజే వేరు



సన్నీలియాన్... గ్లామర్ ప్రేమికులకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేని పేరు. ఏ సినిమాలో అయినా తన గ్లామర్‌తో ప్రత్యేక ఆకర్షణ అవుతోంది ఈ భామ. తన అందచందాలను ప్రదర్శిస్తూ ఆమె చేసిన ఐటమ్ సాంగ్‌లు యూత్‌ను మైమరపించాయి. 'రాయిస్'లో ఆమె చేసిన ఐటమ్‌సాంగ్ 'లైలా ఓ లైలా...' సూపర్ హిట్టయింది. ఆ పాటలో తన ఒంపుసొంపులను ప్రదర్శిస్తూ సన్నీ చేసిన డ్యాన్స్‌కు మంచి పేరు వచ్చింది. తన గ్లామర్‌తో మురిపిస్తున్న ఈ హాట్ బ్యూటీకి హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా అవకాశాలు వస్తూనే ఉన్నాయి. తెలుగులో మంచు మనోజ్ సినిమా 'కరెంట్ తీగ'లో హాట్‌గా కనిపించి అలరించింది. ఇక సన్నీలియాన్ తన ట్విట్టర్ అకౌంట్‌లో పోస్ట్ చేసే చిత్రాలు చూస్తే ఆమెలోని గ్లామర్ అట్రాక్షన్ ఏంటో తెలుస్తుంది. రొటీన్ లుక్స్‌లో కాకుండా కొత్తగా కనిపిస్తూ తనలోని ప్రత్యేకత ఏంటో చూపిస్తోంది. అందుకే ట్విట్టర్‌లో రెండు మిలియన్ల మందికి పైగా ఆమెను ఫాలో అయిపోతున్నారు. ఏదేమైన సన్నీ గ్లామర్ రేంజే వేరు.

అదా ట్రీట్ అదరహో




యంగ్ బ్యూటీ అదా శర్మ ఈమధ్య సోషల్ మీడియాలో హాట్ ఫొటోషూట్లు, వీడియోలతో సందడి చేస్తోంది. 2018లో అదా ట్రీట్ అదరహో... అన్న తీరుగా సాగింది. వీలున్న ప్రతి సందర్భంలో ఈ అమ్మడు సామాజిక మాధ్యమాల్లో తన ఫొటోలతో ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. దీంతో ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌లో అదాకు అధిక సంఖ్యలో ఫాలోవర్స్ ఉన్నారు. తాజాగా మరో అదిరిపోయే ఫొటోను తన ఫాలోవర్స్ ముందుకు తీసుకువచ్చింది ఈ భామ. ఈసారి బికినీ ట్రీట్‌తో మురిపించింది. వంకాయ రంగు బికినీలో అదా శర్మ కుర్రకారును మైమరపిస్తోంది. అయితే 2019లోనైనా ఈ యంగ్ బ్యూటీకి తెలుగులో మంచి అవకాశాలు వస్తాయా అనేది చూడాలి. ప్రస్తుతం అదాశర్మ తమిళంలో చార్లీచాప్లిన్ 2 చిత్రంలో నటిస్తోంది. హిందీలో బైపాస్ రోడ్డు అనే సినిమాతో పాటు కమాండో 3 అనే వెబ్ సిరీస్ కూడా చేస్తోంది.



సంక్రాంతి అనంతరం 'రాకుమారుడు' షూటింగ్ ప్రారంభం

కత్తివీరుడు కాంతారావు జీవిత విశేషాలతో రూపొందుతున్న చిత్రం 'రాకుమారుడు'. ఈ సినిమా యూనిట్ రూపొందించిన 2019 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి విడుదల చేసి తొలి కాపీని చిత్ర దర్శకుడు పి.సి.ఆదిత్యకు అందజేశారు. అనంతరం సినిమా నటీనటులు, సాంకేతిక నిపుణులకు ఈ క్యాలెండర్ కాపీలను బహూకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ''తెలుగు సినీ రంగంలో మహోన్నతంగా వెలిగిన కత్తివీరుడు కాంతారావు ప్రేక్షకులను ఎంతగానో అలరించారు. అంతటి గొప్ప నటుడి జీవితాన్ని 'రాకుమారుడు' పేరుతో బయోపిక్‌గా రూపొందిస్తున్న దర్శకుడు పి.సి.ఆదిత్యకు అభినందనలు''అని తెలిపారు. దర్శకుడు పి.సి.ఆదిత్య మాట్లాడుతూ పాటల రికార్డింగ్ పూర్తయిన 'రాకుమారుడు' సినిమా షూటింగ్‌ను సంక్రాంతి పండుగ అనంతరం కాంతారావు స్వగ్రామం గుడిబండలో (కోదాడ సమీపంలో) ప్రారంభిస్తామని అన్నారు. కార్యక్రమంలో సంగీత దర్శకుడు ఉదయ్, కావూరి శ్రీనివాస్, ఎం.అరవింద్ రెడ్డి, రావుల మోహన్ రెడ్డి, ప్రేమ్, దీక్ష, మహాలక్ష్మి ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.



మెరిసిన బంగారం

2018లో 6 శాతం రాబడి ఇచ్చిన పసిడి

ముంబై: ఈ ఏడాదిలో బంగారం 6 శాతం రాబడిని ఇచ్చింది. 2018 ఆఖరి సెషన్ రోజు బలహీనంగా కనిపించిన పసిడి ధర రూ.370 (10 గ్రాములుపై) పతనమైంది. ఆఖరికి పది గ్రాములు పసిడి ధర రూ.32,270 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా ట్రెండ్ బలహీనంగా ఉండడం, దేశీయంగానే ఆశించిన మేరకు డిమాండ్ లేకపోవడంతో పసిడి ధర తగ్గించిందని మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. వెండి కూడా బంగారం బాటలోనే పయనించింది. కిలో వెండి ధర రూ.125 తగ్గి రూ.39,100కు చేరింది.

డీలాపడిన రూపాయి

2019లో 9 శాతం పతనం



ముంబై: 2018 ఆఖరి ట్రేడింగ్ సెషన్‌లో రూపాయి 18 పైసలు లాభపడి 69.77 వద్ద ముగిసింది. ఈ ఏడాదిలో అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ మొత్తంగా 9.23 శాతం క్షీణించింది. ఏడాది–ఏడాది ఆధారంగా చూస్తే రూపాయి విలువ 509 పైసలు (9.23 శాతం) నష్టపోయింది. గతేడాది (2017) ఇదే సమయంలో రూపాయి విలువ 63.87 వద్ద ఉంది. సానుకూల వృద్ధి అంశాలు, వేగవంతమైన మారక నిల్వలతో వచ్చే ఆరు నుంచి 12 నెలల్లో రూపాయి మరింతగా పుంజుకునే అవకాశముందని ఫారెక్స్ ట్రేడర్లు భావిస్తున్నారు.

స్టాక్ మార్కెట్

ఈ రోజు మార్కెట్ ముగింపు		మార్పు	%
సెన్సెక్స్	36,068.33	-8.39	-0.02%
నిఫ్టీ	10,862.55	2.65	0.02%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	69.89
యూరో	79.92
బ్రిటిష్ పౌండ్	88.76
ఆస్ట్రేలియన్ డాలర్	49.40
కెనెడియన్ డాలర్	51.43
సింగపూర్ డాలర్	51.19
స్విస్ ఫ్రాంక్	71.14
చైనీస్ యువాన్	10.22
మలేషియన్ రింగిట్	16.85
న్యూజిలాండ్ డాలర్	47.03
హాంకాంగ్ డాలర్	8.94
జపనీస్ యెన్	0.63
కువైట్ దినార్	230.23
సౌతాఫ్రికన్ రాండ్	4.84

బులియన్



బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	30170	32267.38	0.07%
ముంబై	30660	32791.44	0%
ఢిల్లీ	30800	32941.18	0.16%
కోల్‌కతా	31260	33433.16	0.26%
కేరళ	29300	31336.90	0.51%
బెంగళూరు	29650	31711.23	0.17%
హైదరాబాద్	30170	32267.38	0.07%
గల్ఫ్	135.81	145.25	0.52%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 40900.00
ముంబై	₹ 40900.00
ఢిల్లీ	₹ 40900.00
కోల్‌కతా	₹ 40900.00
హైదరాబాద్	₹ 40900.00



కీలక రంగాల వృద్ధి 16 నెలల కనిష్టానికి



- నవంబర్‌లో 3.5 శాతం నమోదు
- ముడి చమురు, ఎరువుల ఉత్పత్తిలో ప్రతికూల వృద్ధి
- ప్రభుత్వ గణాంకాల శాఖ వెల్లడి

ముంబై: క్రూడ్ ఆయిల్, ఫర్టిలైజర్ ఉత్పత్తిలో క్షీణత వల్ల నవంబర్‌లో ఎనిమిది కీలక రంగాల వృద్ధి రేటు మందగించింది. 3.5 శాతం వృద్ధి రేటుతో 16 నెలల కనిష్టానికి పడిపోయింది. ఈమేరకు సోమవారం ప్రభుత్వ గణాంకాల శాఖ(సిఎస్ఒ) వెల్లడించింది. 2017 జూలైలో ఈ కీలక రంగాల వృద్ధి అత్యంత కనిష్ట స్థాయిలో 2.9 శాతం నమోదైంది. ఎనిమిది కీలక మౌలిక సదుపాయ రంగాల్లో బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, స్టీల్, సిమెంట్, విద్యుత్ వంటివి ఉంటాయి. గతేడాది నవంబర్‌లో ఈ కీలక రంగాల వృద్ధి 6.9 శాతంగా ఉంది. అయితే ఈసారి ముడి చమురు 3.5 శాతం, ఎరువుల ఉత్పత్తి 8.1 శాతంతో ప్రతికూల వృద్ధిని నమోదు చేశాయి. సహజ వాయువు 0.5 శాతం, రిఫైనరీ ఉత్పత్తులు 2.3 శాతం, స్టీల్ 6 శాతం, సిమెంట్ ఉత్పత్తిలో 8.8 శాతం వృద్ధి రేటు తో ఈసారి ఆశించిన మేరకు వృద్ధిని నమోదు చేయలేదు. కీలక రంగాల్లో వృద్ధి మందగమనం పారిశ్రామిక ఉత్పత్తి సూచీ(ఐఐపి)పైనా ప్రభావం చూపనుంది. బొగ్గు, విద్యుత్ రంగాల్లో వృద్ధి వరుసగా 3.7 శాతం, 5.4 శాతం నమోదవగా, గతేడాది ఇదే సమయంలో 0.7 శాతం, 3.9 శాతంగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2018–19) ఏప్రిల్–నవంబర్‌లో ఎనిమిది కీలక రంగాల వృద్ధి 5.1 శాతం నమోదవగా, గతేడాది ఇదే సమయంలో 3.9 శాతంగా ఉంది.



సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ధర రూ.6 తగ్గింపు

నాన్ సబ్సిడీ సిలిండర్‌పై రూ.120

ముంబై : సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ధరను ప్రభుత్వం మరోసారి తగ్గించింది. ఎల్‌పిజి సిలిండర్‌పై రూ.5.91 మేరకు తగ్గించగా, సబ్సిడీ యేతర సిలిండర్‌పై అత్యధికంగా రూ.120 తగ్గించింది. ఈమేరకు సోమవారం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఒసి) ప్రకటించింది. ఎల్‌పిజి రేటు తగ్గించడం ఇది వరసగా రెండో నెల. ఇంతకుముందు డిసెంబర్ 1న సబ్సిడీ ఎల్‌పిజి ధర సిలిండర్‌పై రూ.6.52 పైసలు తగ్గించింది. జూన్ నుంచి వరుసగా ఆరు నెలలుగా ఎల్‌పిజి రేటు పెరుగుతూ వచ్చిన తర్వాత గ్యాస్ ధర తగ్గడం ఇదే. నాన్ సబ్సిడీ లేదా మార్కెట్ ధర ఎల్‌పిజి రేటు అత్యధికంగా రూ.120.50 తగ్గించడానికి కారణం అంతర్జాతీయ మార్కెట్‌లో ఎల్‌పిజి ధరలు తగ్గడం, అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ బలపడడమేనని ఐఒసి వెల్లడించింది. దీని ప్రకారం, ప్రస్తుతం ఢిల్లీలో సిలిండర్ (14.2 కిలోలు) ధర రూ.689గా ఉంది. డిసెంబర్ 1న నాన్ సబ్సిడీ ఎల్‌పిజి రేటు రూ.133 తగ్గింది. ఎల్‌పిజి వినియోగదారులు అందరూ ఇంధనాన్ని మార్కెట్ ధర వద్ద కొనుగోలు చేయవచ్చు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం 12 సబ్సిడీ సిలిండర్లు సబ్సిడీ సిలిండర్లను అందిస్తోంది. ఈ సబ్సిడీ నగదు డైరెక్ట్‌గా గ్యాస్ వినియోగదారుడి బ్యాంక్ ఖాతాలో జమ అవుతుంది.


ఫ్లాట్ ముగింపుతో 2018కి వీడ్కోలు



ముంబై: 2018 ఆఖరి ట్రేడింగ్ రోజు సూచీలు తీవ్ర ఒడిదుడుకుల మధ్య ఫ్లాట్‌గా ముగిశాయి. తొలుత లాభాలతో ప్రారంభమైనప్పటికీ చివరికి ఎక్కడి సూచీలు అక్కడే అన్నట్టుగా ముగిశాయి. సెన్సెక్స్ స్వల్పంగా 8 పాయింట్లు క్షీణించి 36,068 వద్ద నిలిచింది. ఇక నిఫ్టీ 3 పాయింట్ల నామమాత్ర లాభంతో 10,862 వద్ద స్థిరపడింది. తొలుత సెన్సెక్స్ డబుల్ సెంచరీ సాధించి, ఓ దశలో 36,285 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. అయితే ఆ తర్వాత 36,034 వరకూ క్షీణించింది. అంతర్జాతీయ మార్కెట్లకు సెలవు నేపథ్యంలో ట్రేడింగ్ యాక్టివిటీ పరిమితమైనట్లు నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో రోజంతా మార్కెట్లు స్వల్ప ఒడిదొడుల మధ్య కదిలాయి. మార్కెట్లను మించుతూ మిడ్, స్మాల్ క్యాప్స్ జోరుగా ట్రేడయ్యాయి. మిడ్ క్యాప్స్‌లో కెఐఒసిఎల్ 10 శాతం దూసుకెళ్లగా, ఎయు బ్యాంక్, దివాన్ హౌసింగ్, ఎండ్యూరెన్స్, నాల్కో, సెయిల్, ఇమామీ, ఆల్కెమ్, టీఐ ఫైనాన్స్, ముత్తూట్ ఫైనాన్స్, కంకార్, ఐఐఎఫ్ఎల్, కాల్గేట్ పామోలివ్, బ్లూడార్ట్, గోద్రెజ్ ఇండస్ట్రీస్, జిందాల్ స్టీల్ తదితరాలు 6 నుంచి 2 శాతం మధ్య పెరిగాయి. శుక్రవారం విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పిఐలు) రూ.120 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించారు. మరోవైపు దేశీ ఫండ్స్(డిఐఐలు) రూ.1199 కోట్లకుపైగా ఇన్వెస్ట్ చేశాయి. సెన్సెక్స్ దిగ్గజాలలో టాటా స్టీల్, వేదాంతా, సన్ ఫార్మా, టాటా మోటార్స్, ఇండస్‌ఇండ్, కొటక్ బ్యాంక్, హెచ్‌సిఎల్ టెక్, ఇన్ఫోసిస్, ఎస్‌బిఐ 1.6 శాతం నుంచి 0.5 శాతం మధ్య లాభపడ్డాయి. అయితే హీరోమోటో, యాక్సిస్, మారుతీ, ఎన్‌టిపిసి, కోల్ ఇండియా, హెచ్‌డిఎఫ్‌సి, పవర్‌గ్రిడ్, ఎయిర్‌టెల్, ఆర్‌ఐఎల్ బలహీనపడ్డాయి. బిఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ 0.6 శాతం చొప్పున లాభపడ్డాయి. ట్రేడైన మొత్తం షేర్లలో 1517 లాభపడగా, 1,083 షేర్లు నష్టాలతో ముగిశాయి.

కోలుకుంటున్న బ్యాంకింగ్

మొండి బకాయిలు తగ్గుముఖం పట్టాయి: ఆర్‌బిఐ నివేదిక



న్యూఢిల్లీ: బ్యాంకింగ్ రంగం కోలుకునే దిశలో ఉందని, అయితే ప్రభుత్వరంగ బ్యాంకులు పాలనలో సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఆర్‌బిఐ నివేదిక పేర్కొంది. రీక్యాపిటలైజేషన్ ద్వారా బలహీన బ్యాంకులకు సహాయం చేయాల్సిన అవసరం ఉందని, ఆర్‌బిఐ అర్ధవార్షిక ఆర్థిక స్థిరత్వ నివేదిక(ఎఫ్ఎస్ఆర్)లో ఈ విషయాన్ని ప్రస్తావించామని గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. చాలా కాలంగా ఒత్తిడిని ఎదుర్కొంటున్న బ్యాంకింగ్ రంగం ఇప్పుడు కోలుకునే దిశలో ఉందని, ఎన్‌పిఎ(నిరర్థక ఆస్తులు) లేదా మొండి బకాయిల భారం తగ్గుముఖం పడుతోందని దాస్ అన్నారు. ఉర్జిత్ పటేల్ రాజీనామా అనంతరం శక్తికాంత దాస్ ఆర్‌బిఐ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ వరకు పరిశీలిస్తే స్థూల ఎన్‌పిఎ నిష్పత్తిలో క్షీణత కనిపిస్తోందని, మూడు సంవత్సరాల్లో ఎన్‌పిఎ తగ్గడం ఇదే తొలిసారి అని ఆయన అన్నారు. అదే సమయంలో ప్రొవిజన్ కవరేజ్ నిష్పత్తిలోనూ మెరుగుదల కనిపిస్తోందని, దీని ఆధారంగా బ్యాంకుల పరిస్థితి సానుకూల దిశలో ఉందని తెలుస్తోందని అన్నారు.

ఎఫ్ఎస్ఆర్ ప్రకారం, స్థూల ఎన్‌పిఎ నిష్పత్తి 2018 మార్చిలో 11.5 శాతం నుంచి 2018 సెప్టెంబర్‌లో 10.8 శాతానికి తగ్గింది. ప్రభుత్వరంగ బ్యాంకులకు ఎన్‌పిఎలు 2018 సెప్టెంబర్‌లో 14.8 శాతంగా ఉండగా, 2018 మార్చిలో 15.2 శాతంగా ఉంది. గణాంకాల ప్రకారం, అన్ని బ్యాంకుల స్థూల ఎన్‌పిఎ నిష్పత్తి 2018 సెప్టెంబర్‌లో 10.8 శాతం నుంచి 2019 మార్చిలో 10.3 శాతానికి తగ్గాయని నివేదిక వివరించింది. ప్రస్తుత ఎన్‌పిఎ స్థాయి అత్యధికంగా ఉన్నా, ఆర్‌బిఐ పరిశీలనలో భవిష్యత్‌లో మెరుగుదల కనిపించనుందని దాస్ అన్నారు. మొండి బకాయిల విషయంలో చాలా పనులు ప్రక్రియలో ఉన్నాయని, ఆస్తుల నాణ్యత పరిశీలన ద్వారా గుర్తింపు వేగవంతమైందని ఆయన తెలిపారు. భారీ మొత్తంలో ఉన్న ఆస్తుల విషయంలో ప్రభుత్వరంగ బ్యాంకుల్లో కార్యనిర్వహణ మెరుగుదల అవసరం ఉందన్నారు.

పిసిఎ ప్రణాళికతో తగ్గిన నష్టాలు

బ్యాంకింగ్ వ్యవస్థలో నష్టాలను తగ్గించడంలో పిసిఎ(తక్షణ దిద్దుబాటు చర్య) ప్రణాళిక ఎంతగానో దోహదం చేసిందని ఆర్‌బిఐ నివేదిక పేర్కొంది. పిసిఎ కింద 11 బ్యాంకులు రుణాలు ఇచ్చే విషయంలో, ఇతరత్రా ఆంక్షలు ఎదుర్కొంటున్నాయి. బ్యాంక్ ఆఫ్ ఇండియా, అలహాబాద్ బ్యాంక్, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కార్పొరేషన్ బ్యాంక్, ఐడిబిఐ బ్యాంక్, యుకో బ్యాంక్‌లు పిసిఎ నిబంధనలు ఎదుర్కొంటున్న 11 బ్యాంకుల్లో ఉన్నాయి. పిసిఎ పరిధిలో ఉన్న బ్యాంకుల రుణాలు ఇచ్చే విషయంలో ఆంక్షలు ఉన్నాయి. ఇలాంటి కఠిన నిబంధనల వల్ల బ్యాంకింగ్ వ్యవస్థలో అవినీతి, నష్టాలు తగ్గాయని ఆర్‌బిఐ ఎఫ్ఎస్ఆర్‌లో పేర్కొంది.





రూ.7.25 లక్షల కోట్లు మటాష్

2018లో తుడిచిపెట్టుకుపోయిన ఇన్వెస్టర్ల సంపద

న్యూఢిల్లీ: తీవ్ర హెచ్చుతగ్గుల మార్కెట్లో 2018లో ఇన్వెస్టర్ల సంపద రూ.7.25 లక్షల కోట్లు తుడిచిపెట్టుకుపోయింది. ఈ ఏడాదిలో బిఎస్ఇ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ మూలధనం(ఎం–క్యాప్) రూ.7,25,401 కోట్లు నష్టపోయి రూ.1,44,48,465 కోట్లకు చేరింది. 2018లో బిఎస్ఇ బెంచ్‌మార్క్ సెన్సెక్స్ 2,011.5 పాయింట్లు (5.90 శాతం) లాభపడింది. 2018 ఆగస్టు 29న 38,989.65 పాయింట్ల వద్ద ఉన్నా సెన్సెక్స్.. భారీగా 2,921.32 పాయింట్లు పతనమై (7.5 శాతం) ఆఖరికి 36,068 పాయింట్లకు చేరింది. అంతర్జాతీయ అంశాలు, దేశీయ పరిణామాలు వెరసి మార్కెట్ భారీగా పతనమైందని ఎమ్కే వెల్త్ మేనేజ్‌మెంట్ హెడ్ రీసెర్చ్ జోసెఫ్ థామస్ అన్నారు. 2018 ఆఖరి ట్రేడింగ్ సెషన్‌లో బిఎస్ఇ సెన్సెక్స్ 8.39 పాయింట్లు పతనమై 36,068.33 పాయింట్ల వద్ద ముగిసింది.


టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం%
జెఎస్‌డబ్ల్యూ స్టీల్	307.90	300.10	306.75	298.10	8.65	2.90
టాటా స్టీల్	525.00	516.20	521.05	512.85	8.20	1.60
వేదాంత	203.60	200.60	202.20	199.40	2.80	1.40
టెక్ మహీంద్ర	726.45	715.10	723.15	714.00	9.15	1.28
సన్‌ఫార్మా	432.30	425.50	430.50	425.20	5.30	1.25
కోటక్ మహీంద్ర	1,262.50	1,233.50	1,256.50	1,241.35	15.15	1.22
హిండాల్కో	228.50	225.25	226.20	223.50	2.70	1.21
గెయిల్	361.80	354.00	360.30	356.30	4.00	1.12
టాటామోటార్స్	173.90	171.75	172.70	170.85	1.85	1.08
ఇండస్‌ఇండ్	1,604.00	1,585.60	1,599.30	1,583.25	16.05	1.01

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం%
భారతి ఇన్‌ఫ్రాటెల్	265.00	257.20	259.00	263.00	4.00	1.52
భారతి ఎయిర్‌టెల్	320.90	311.10	312.50	316.55	4.05	1.28
హెచ్‌పిసిఎల్	258.60	252.40	253.25	255.90	2.65	1.04
ఐఒసి	139.00	136.55	137.05	138.20	1.15	0.83
యాక్సిస్ బ్యాంకు	631.95	618.80	619.90	625.05	5.15	0.82
కోల్ ఇండియా	244.40	240.10	240.75	242.30	1.55	0.64
హెచ్‌డిఎఫ్‌సి	1,989.75	1,961.55	1,968.35	1,979.95	11.60	0.59
హీరోమోటోకార్ప్	3,159.05	3,087.00	3,104.25	3,122.60	18.35	0.59
మారుతి సుజుకి	7,572.75	7,443.10	7,465.50	7,505.55	40.05	0.53
ఎన్‌టిపిసి	150.05	148.10	149.05	149.85	0.80	0.53

ప్రముఖ కన్నడ నటుడు లోక్‌నాథ్ మృతి



బెంగళూరు: సీనియర్ కన్నడ నటుడు సిహెచ్ లోక్‌నాథ్ (91) గుండెపోటుతో సోమవారం మధ్యాహ్నం ఇక్కడి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కన్ను మూశారు. కన్ను మూశారు. ఆయన కొంతకాలంగా వయసుకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన భౌతిక కాయాన్నిఅభిమానుల సందర్శనార్థం రవీంద్ర కళాక్షేత్ర ప్రాంగణంలో ఉంచిన అనంతరం సాయంత్రం బనశంకరి ప్రాంతంలో అంత్యక్రియలు నిర్వహించారు. దాదాపు ఆరు దశాబ్దాల నట జీవితంలో లోక్‌నాథ్ 650 సినిమాలు, వెయ్యికి పైగా నాటకాల్లో నటించారు. 1970లో సంస్కార చిత్రంతో సినీ రంగంలో ప్రవేశించిన ఆయన తన తొలి చిత్రంలోనే జాతీయ అవార్డును అందుకున్నారు. నాగరహావు, బంగారద మనుష్య. పుష్పక విమాన, భూతయ్యన మగ అయ్యు లాంటి పలు ప్రఖ్యాత చిత్రాల్లో ఆయన నటన ప్రముఖుల ప్రశంసలు అందుకుంది. అభిమానులు ఆయనను ప్రేమగా ' అంకుల్' అని పిలిచే వారు. లోక్‌నాథ్ మృతి పట్ల ముఖ్యమంత్రి కుమార స్వామి సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన అనేక చిత్రాల్లో తండ్రి పాత్రలు పోషించారన్నారు. భూతయ్యన మగ అయ్యు చిత్రంలో ఆయన నటన ఎప్పటికీ గుర్తుండి పోతుందన్నారు. లోక్‌నాథ్‌కు భార్య, కుమారుడు, నలుగురు కుమార్తెలున్నారు.

విదేశీయులు అండమాన్‌కు నేరుగావెళ్లొచ్చు

ఇమిగ్రేషన్ చెక్‌పాయింట్‌గా పోర్ట్‌బ్లెయిర్ ఎయిర్‌పోర్టు

న్యూఢిల్లీ: ఇకపై విదేశీ పర్యాటకులు నేరుగా కేంద్ర పాలిత ప్రాంతమైన అండమాన్ నికోబార్ దీవులకు వెళ్లవచ్చు. భారత్‌లోకి వచ్చి వెళ్లే విదేశీ టూరిస్టులకు పోర్టుబ్లెయిర్ విమానాశ్రయాన్ని అధీకృత ఇమిగ్రేషన్ చెక్‌పాయింట్‌గా చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఇది సాధ్యమయింది. విదేశాలనుంచి వచ్చే పర్యాటకులు ఎక్కువ మంది అండమాన్ నికోబార్‌ను సందర్శించడానికి ఎక్కువగా ఇష్టపడుతుండడంతో ప్రభుత్వం ఈ దీవులను విదేశీ పర్యాటకులకు మరింత సులువుగా అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. వేలాది మంది విదేశీ టూరిస్టులతో సహా నాలుగు లక్షల మంది పర్యాటకులు ఏటా అండమాన్ నికోబార్ దీవులను సందర్శిస్తుంటారు. కాగా సోమవారంనుంచి పోర్టుబ్లెయిర్ విమానాశ్రయంలోని ఇమిగ్రేషన్ చెక్‌పోస్టుకు అండమాన్ పోలీసు సూపరింటెండెంట్ (సిఐడి)ని సివిల్ అథారిటీగా నియమించారు.


సరైన చికిత్స ఇవ్వనందుకే 'అమ్మ' మృతి

తమిళనాడు మంత్రి షణ్ముగం ఆరోపణ

చెన్నై: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత మృతి వెనుక దుష్టపన్నాగం జరిగిందని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి సివి షణ్ముగం ఆరోపించారు. జయలలిత 2016లో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నప్పుడు ఆమెకు "సరైన చికిత్స" జరిగిఉంటే ఆమె జీవించి ఉండేవారని సోమవారం నాడిక్కడ ఆయన అభిప్రాయపడ్డారు. చికిత్స నిమిత్తం జయలలితను విదేశాలకు తరలించాలన్న ప్రతిపాదనను కూడా కొందరు చెడగొట్టారని ఆయన ఆరోపించారు. "జయలలితకు యాంజియోగ్రామ్ చేయించకుండా ఎవరు అడ్డుపడ్డారు? మాజీ ముఖ్మమంత్రి మృతి వెనుక ఉన్న దుష్టపన్నాగంపై కేసు నమోదు చేయాలి. ఆమె మృతి వెనుక ఉన్న మిస్టరీని ఛేదించడానికి ఒక కేసు నమోదు చేసి అందుకు బాధ్యులపై దర్యాప్తు జరగాలి" అని షణ్ముగం చెప్పారు. 2016 డిసెంబర్ 5న జయలలిత కన్నుమూశారు. ఆమె మృతిపై అనేక ఆరోపణలు, అనుమానాలు వ్యక్తం కావడంతో అధికార ఎఐఎడిఎంకె ప్రభుత్వం ఆ మరుసటి ఏడాది జయలలిత మృతికి సంబంధించి విచారణ నిమిత్తం ఒక కమిషన్‌ను నియమించింది.

సొహ్రాబుద్దీన్ దర్యాప్తును నాశనం చేసిందెవరు?

రాహుల్‌ను ఈ ప్రశ్న అడగాలన్న జైట్లీ



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీని అడగాల్సిన సరైన ప్రశ్న ఒకటుందని, సొహ్రాబుద్దీన్ దర్యాప్తు కేసును ఎవరు నాశనం చేశారనే ప్రశ్నను ఆయనను అడగాలని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ అన్నారు. సిబిఐ కేసుల్ని విచారించే ముంబయిలోని స్పెషల్ సిబిఐ జడ్జి సొహ్రాబుద్దీన్ కేసులో నిందితులందరినీ నిర్దోషులుగా విడుదల చేశారని చెబుతూ మంత్రి... విడుదల చేస్తూ ఇచ్చిన ఉత్తర్వు కన్నా ముఖ్యమైంది.. కేసు దర్యాప్తులో మొదటి నుంచీ జడ్జి అనుసరిస్తూ వస్తున్న వైఖరి. నిజాన్ని తెలుసుకోడానికి దర్యాప్తు సంస్థ ఈ కేసును ప్రొఫెషనల్‌గా దర్యాప్తు చేయలేదు. కొందరు రాజకీయ నాయకులకు అనుకూలంగా దారిమళ్లించే ప్రయత్నం చేసింది. తీర్పు వచ్చిన రోజు రాహుల్‌గాంధీ..సొహ్రాబుద్దీన్‌ను ఎవరు చంపలేదు' అని వ్యాఖ్యానించారు. దానిపై స్పందిస్తూ జైట్లీ...దీనికి బదులుగా... సొహ్రాబుద్దీన్ కేసును ఎవరు చంపారు? అని రాహుల్‌గాంధీని అడిగితే సరైన సమాధానం వచ్చి ఉండేది అన్నారు.

న్యూఇయర్‌కి చలి స్వాగతం

(ఐదో పేజీ తరువాయి)

సోమవారం 9.5 డిగ్రీలు నమోదైందని తెలిపారు. రానున్న ఐదు రోజుల పాటు చలి తీవ్రత ఇలాగే కొనసాగనున్నందున ఆదిలాబాద్, నిర్మల్, కొమురంబీం, మెదక్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ తదితర జిల్లాల్లోని ప్రజలు చలి తీవ్రతతో ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆయన తెలిపారు. దక్షిణ తెలంగాణలో చలి తీవ్రత పెద్దగా లేకపోయినప్పటికీ ఉత్తర, మధ్య, ఈశాన్య తెలంగాణలో మాత్రం కాస్త తీవ్రంగానే ఉంటుందన్నారు. శీతల గాలుల ఉధృతే ఉష్ణోగ్రతలు పడిపోవడానికి కారణమన్నారు. గత సంవత్సరం కన్నా ఈసారి చలి తీవ్రత పెరిగిందన్నారు. ఈ ప్రాంతం ఉత్తర భారతదేశానికి దగ్గరగా ఉండడంతో ఇక్కడ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయని ఆయన తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో ఎక్కువగా అటవీ విస్తీర్ణం ఉండడం కూడా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడానికి కారణంగా రాజారావు తెలిపారు. రాత్రి చలి, పగలు పొడి వాతావరణం వలన ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. హిమాలయాల నుంచి వచ్చే ప్రభావంతో దేశవ్యాప్తంగా శీతల పవనాలు వీస్తాయని ఆయన పేర్కొన్నారు.

పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్

(ఐదో పేజీ తరువాయి)

ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. అందుకు అనుగుణంగా 12,734 గ్రామ పంచాయతీలు, 1,13,354 వార్డులకు ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం సిద్ధమైంది. పంచాయితీ ఎన్నికల్లో మొత్తం 1,49,73,000 ఓటర్లు ఉన్నారు.

వేలం వేస్తే విచారణ

గత ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు ఖర్చు వివరాలను సమర్పించనందుకుగాను సర్పంచ్‌గా పోటీ చేసిన 12,716 మంది అభ్యర్థులు ఈసారి పోటీ చేయడానికి అనర్హులుగా ప్రకటించినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్ కుమార్ 'మన తెలంగాణ'కు తెలిపారు. రేషన్ డీలర్లు ఎన్నికల్లో పోటీ చేయవచ్చునని స్పష్టంచేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా సర్పంచ్, వార్డ్ మెంబెర్‌ల ఎన్నికల ఏకగ్రీవం అయితే ఇబ్బంది లేదని, వేలం వెయ్యడం, భయభ్రాంతులకు గురిచేసి ఏకగ్రీవం చేసినట్లు అయితే కలెక్టర్ విచారణ జరపాల్సి ఉంటుందని ఎస్ఇసి ప్రకటించింది. ఇప్పటివరకు 30 సర్పంచ్ గుర్తులు, 20 వార్డు సభ్యుల గుర్తులు సిద్ధంగా ఉంచామని, ఇంకా కావాలి అంటే సిద్ధంగా ఉన్నాయని ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. ఒక గుర్తును పోలి మరో గుర్తు లేదని ఎలాంటి ఇబ్బందులు రావన్నారు. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటవరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుండి కౌటింగ్ పక్రియ ప్రారంభమవుతుందని, అదే రోజు ఉప సర్పంచ్ ఎన్నిక ఉంటుందన్నారు. ఇందుకోసం 95 వేల బ్యాలెట్ బాక్స్‌లను ఎన్నికల సంఘం సిద్ధం చేసింది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రాష్ట్ర స్పెషల్ పార్టీ పోలీస్ లను విధుల్లో ఉంచుతున్నారు. 5 వేల పైన జనాభా ఉన్న గ్రామ పంచాయతీలలో సర్పంచ్‌కి రూ. 2.50 లక్షలు, 5 వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీలలో 1.50 లక్షలు, 5 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న వార్డ్ మెంబర్‌కు రూ. 50 వేలు వ్యయ పరిమితి, 5 వేలు కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీలలో రూ. 30 వేల ఎన్నికల వ్యయపరిమితి ఉంది.

ఇక మన హైకోర్టు









(ఐదో పేజీ తరువాయి)

కార్యక్రమానికి ముఖ్యమంత్రి కెసిఆర్ కూడా హాజరవుతున్నారు. ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం పన్నెండు మంది న్యాయమూర్తులతో ఉదయం పదిన్నర గంటలకు హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఈ కార్యక్రమానికి కూడా హాజరవుతున్నారు. నాలుగున్నరేళ్ళ తర్వాత రాష్ట్రానికి స్వంత హైకోర్టు ఏర్పడడం, న్యాయమూర్తుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరుకానుండడం విశే షం. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తితో గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్‌తో విజయవాడలో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. కొత్త సంవత్సరం రోజు నుంచే కొత్త హైకోర్టులు పనిచేయడం ప్రారంభమవుతోంది. ఇంతకాలం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కలిసి ఉమ్మడిగా కొనసాగిన హైకోర్టు కొత్త సంవత్సరం రోజు నుంచే విడివిడిగా పనిచేయనున్నాయి. ఉమ్మడి హైకోర్టు ఇకపైన ముగిసిన అధ్యాయమే.

ఆంధ్ర న్యాయాధికారులు, సిబ్బందికి తెలంగాణ ఆత్మీయ వీడ్కోలు

రెండు రాష్ట్రాలకు వేర్వేరు హైకోర్టులు ఏర్పాటవుతున్నందున ఉమ్మడి హైకోర్టులో ఇప్పటివరకూ పనిచేసి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించబడిన న్యాయాధికారులు, సిబ్బం ది, కొద్దిమంది న్యాయవాదులు ఆ రాష్ట్రానికి ప్రయాణమయ్యారు. తెలంగాణ న్యాయవాదులు, సిబ్బంది సంయుక్తంగా ఆ రాష్ట్రానికి వెళ్ళే న్యాయవాదులు, సిబ్బంది, న్యాయాధికారులకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఇంతకాలం కలిసి ఉండి ఇప్పుడు విడిపోతున్నందున తెలంగాణ, ఎపి న్యాయవాదులు, ఉద్యోగులు ఒకనొకరు ఆప్యాయంగా పలకరించుకుని ఆలింగనం చేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. హైకోర్టు సిబ్బంది, న్యాయవాదులు బస్సుల్లో ఆంధ్రప్రదేశ్‌కు బయలుదేరి వెళ్తున్న సమయంలో హైకోర్టు ప్రాంగణంలో ఉద్వేగభరితమైన వాతావరణం నెలకొంది. హైకోర్టు నుంచి అమరావతికి సిబ్బందిని, ఫైళ్లను తరలించేందుకు పది ప్రత్యేక బస్సుల్లో ఉద్యోగులు బయలుదేరి వెళుతుండగా తెలంగాణ న్యాయవాదులు, ఉద్యోగులు ఎపి న్యాయవాదులు, ఉద్యోగులకు వీడ్కోలు పలికారు. ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ తొట్టతిల్ భాస్కరన్ నాయర్ రాధాకృష్ణన్ తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన నేపథ్యంలో ఎపి హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ సి.హెచ్. ప్రవీణ్‌కుమార్‌కు వీడ్కోలు పలికారు. జస్టిస్ సిహెచ్ ప్రవీణ్‌కుమార్ వెళ్తున్న కారు వద్దకు వచ్చిన జస్టిస్ రాధాకృష్ణన్ ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఎపి న్యాయమూర్తులు, న్యాయవాదులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

21 వేల మంది న్యాయవాదులకు మంచి రోజులు వస్తున్నాయి
విష్ణువర్ధన్‌రెడ్డి, తెలంగాణ బార్ కౌన్సెల్ సభ్యులు


ఇప్పటికైనా తెలంగాణకు ప్రత్యేక ఏర్పాటు కావడం సంతోషంగా ఉంది. 21 వేల మంది తెలంగాణ న్యాయవాదులకు మంచి రోజులు వస్తున్నాయి. తెలంగాణ హైకోర్టుకు ఇంకా 14 మంది న్యాయమూర్తుల అవసరం ఉంది. కేంద్రం ఈ దిశగా వెంటనే అవసరమైన న్యాయమూర్తులను నియమించాలి. అప్పుడే హైకోర్టు ఏర్పాటుకు సంపూర్ణ న్యాయం జరుగుతుంది. ఎపి న్యాయవాదులతో 25 ఏళ్లుగా కలిసున్నాం. పిల్లల చదువుల మధ్యలోనే అక్కడికి వెళ్లాల్సి రావడం బాధాకరమని వ్యాఖ్యానించారు.

అనివార్యమే... కానీ బాధగా ఉంది

రాష్ట్ర విభజన జరిగిన తర్వాత విడివిడి హైకోర్టులు ఏర్పడడం అనివార్యం. వాటితో పాటు సిబ్బందిగా మేం కూడా వెళ్ళడం తప్పనిసరి. ఏ రోజైనా వెళ్ళక తప్పదు. కానీ ఇప్పుడు పిల్లలు ఇక్కడ చదువుకుంటున్నందున మధ్యలోనే వారిని వదిలి వెళ్ళడం బాధగా ఉంది. ఒక రకంగా వత్తిడిగానే ఫీలవుతున్నాం. కటాఫ్ డేట్‌కు కనీసం వారం రోజుల సమయం కూడా ఇవ్వకపోవడం బాధగా ఉంది. అనివార్యమే అయినా అసంతృప్తితో వెళ్తున్నాం. మొత్తం వెయ్యి మంది సిబ్బంది ఇలా వెళ్ళాల్సి ఉంది. అక్కడకు వెళ్ళినా పిల్లల చదువుపైనే మా ధ్యాస, ఆందోళన. కొద్దిమంది తెలంగాణకు చెందినవారు కూడా ఆంధ్రప్రదేశ్‌కు ఆప్షన్ ఇచ్చుకున్నారు. అక్కడ పదవీ విరమణ వయసు 60 సంవత్సరాలే ఇందుకు కారణం'' అని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన న్యాయాధికారి ఒకరు తెలిపారు.

అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్య

(ఐదో పేజీ తరువాయి)





కొనుగోలు చేసేందుకు కొంత అప్పు చేశాడు. సదరు అప్పు విషయంలో భార్యభర్తలు ఇరువురు పలుమార్లు గొడవపడినట్లు సమాచారం. ఈ మేరకు సోమవారం ఉదయం తన కుమారులైన యస్వంత్(11), జస్వంత్(8)లను రోజు మాదిరిగానే పాఠశాలకు పంపించి వచ్చిన శేఖర్ తన వెంట తెచ్చుకున్న ఎలుకలను చంపేందుకు వాడే క్రిమిసంహారక మందును ఇరువురు తాగి ఇంట్లోనే మరణించారు. అయితే ఎలుకల మందు సేవించిన వెంటనే శేఖర్ తన తండ్రికి ఫోన్ చేసి కడుపునొప్పి వచ్చిందంటూ చెప్పగా తండ్రి వెంటనే శేఖర్ ఇంటికి చేరుకున్నాడు.అప్పటికే శేఖర్ చనిపోగా, కొన ఊపిరితోఉన్న కోడలు స్వాతిని ఆటోలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ఆమె కూడా మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో కన్నీరు మున్నీరయ్యారు. తల్లిదండ్రులను కోల్పోయిన కుమారులను ఓదార్చేందుకు కుటుంబసభ్యులు విఫలయత్నం చేశారు. శేఖర్ తండ్రి జగిని రంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు వన్‌టౌన్ సీఐ సురేష్ తెలిపారు.

బాబుపై భూ బాంబు

(ఐదో పేజీ తరువాయి)

టిజి2003పిటిసి041451)నమోదైందని, ఇందుకు ప్లాట్ నెం. 519 హెచ్, రోడ్ నెం. 28, జూబ్లిహిల్స్‌ను చిరుమానాగా పేర్కొన్నారని ఆ ఫిర్యాదులో వివరించారు. ఆ తర్వాత ఈ వ్యవహారంపై సిబిఐ దర్యాప్తు చేయించాలన్న డిమాండ్ వచ్చినా చంద్రబాబు మౌనంగా ఉన్నారని, హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం కూడా దాఖలైందని పేర్కొన్నారు. ఫ్లోరిడాకు చెందిన ఐఎంజి కంపెనీకి అనుబంధ సంస్థగా బిల్లీరావు, ప్రభాకర్‌రావులు ఐఎంజి అకడమియా భారత అనే సంస్థను పేర్కొని ప్రభుత్వాన్ని మోసగించారని, చంద్రబాబుకు ఈ విషయం తెలిసినా లబ్ధి చేకూర్చడం కోసమే ఈ మోసానికి పాల్పడ్డారని ఆ లిఖితపూర్వక ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ స్థలాన్ని అప్పటి రంగారెడ్డి జిల్లా స్టాంపులు రిజిస్ట్రేషన్ల విభాగంలో డాక్యుమెంట్ నెం. 461/2004 పేరుతో నమోదైందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి వేల కోట్ల రూపాయల మేర నష్టం కలిగినందున ఈ వ్యవహారంపై న్యాయ విచారణ జరిపించడంతో పాటు ఈ కుంభకోణానికి పాల్పడిన చంద్రబాబునాయుడు, బిల్లీరావ్, ప్రభాకర్‌రావులతో పాటు ఆనాడు సహకరించిన అధికారులపైన కూడా క్రిమినల్ కేసులను, భారత శిక్షాస్మృతిలోని 406, 408, 420, 468, 471 రెడ్ విత్ 120 బి ప్రకారం కేసులను నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫ్లోరిడా కంపెనీకి అనుబంధ సంస్థ అని నమ్మించడంకోసమే బిల్లీరావు, ప్రభాకర్‌రావులు ఐఎంజి అకడమియా భారత అనే పేరుతో ఈ సంస్థను రిజిస్టర్ చేశారని, దీన్ని స్థాపించిన ఎనిమిది రోజుల వ్యవధిలోనే ఈ డీల్ ఖరారు కావడం గమనార్హమని పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే... 1978లో బొల్లిటెరీస్ టెన్నిస్ అకాడమీ పేరుతో ఫ్లోరిడాలో ఒక సంస్థ ఏర్పడింది. క్రీడలను అభివృద్ధి చేయడంతో పాటు విస్తరించడంకోసం ఐఎంజి (ఇంటర్నేషనల్ మేనేజ్‌మెంట్ (గ్రూపు) అకడమియా అనే సంస్థ పేరుతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ సమీపంలో 600 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో ప్రపంచ స్థాయి క్రీడా క్యాంపస్‌ను నెలకొల్పింది.ఈ సంస్థను స్థాపించిన థియోడర్ ఫోర్స్ట్‌మాన్ బ్రెయిన్ క్యాన్సర్‌తో చనిపోవడంతో దాని వ్యవహారాలు చూసుకునే 'లా' సంస్థ అకిన్ గంప్ స్ట్రాస్ హూవర్ అండ్ ఫెల్డ్ ఈ సంస్థను మూసివేసి ఆస్తులను 2013లో విలియం మోరిస్‌క ఎండెవార్ అనే వ్యక్తికి అమ్మివేసింది. చివరి విక్రయంగా 24 గంటలు పనిచేసే ఫిట్‌నెస్ కేంద్రాన్ని అమ్మింది. దీన్ని రెండు బిలియన్ డాలర్లకు ఏఇఏ ఇన్వెస్టర్స్ అనే సంస్థ కొనుగోలుచేసింది. ఈ వ్యవహారమంతా అయిపోయిన తర్వాత ఫ్లోరిడా సంస్థ పేరుతో పోలి ఉండే తీరులో బిల్లీరావు, ఆయన సోదరుడు కలిసి చంద్రబాబు సహకారంతో ఐఎంజి అకడమియా భారత అనే సంస్థను స్థాపించి అతి తక్కువ ధరకు 400 ఎకరాల స్థలాన్ని ఆపద్ధర్మ ప్రభుత్వ హయాంలో కాజేశారని, దీనిపై లోతుగా దర్యాప్తు చేయడంతో పాటు ఆ ఒప్పందాన్నిరద్దు చేయాలని, బాధ్యులపై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని న్యాయవాది రామారావు తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేటి నుంచే ప్రాజెక్టుల బాట

(ఐదో పేజీ తరువాయి)

సంవత్సరాదిని 'సాగునామ' సంవత్సరంగా మార్చే దిశగా కార్యాచరణను ప్రారంభించారు. హైకోర్టు విభజన జరిగి, రాష్ట్రానికి ప్రత్యేక హైకోర్టు మనుగడలోకి వస్తున్న కీలక సందర్భంలో, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం అనంతరం నేరుగా ముఖ్యమంత్రి హెలిక్యాప్టర్‌లో మేడిగడ్డకు బయలుదేరి వెళతారు. గోదావరి నదిపై నిర్మిస్తున్న బ్యారేజి పనులు పరిశీలించిన అనంతరం కన్నెపల్లి పంపుహౌజ్‌లో పనులు జరుగుతున్న తీరును వీక్షిస్తారు. అనంతరం అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, గోలివాడ పంపుహౌజ్‌ను సందర్శిస్తారు. అనంతరం నేరుగా కరీంనగర్, తీగలగుట్టపల్లిలోని సిఎం ఇంటికి చేరుకుంటారు. మరో నాడు 2వ తేదీ ఉదయం శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకం పనులు సిఎం పరిశీలిస్తారు. రాజేశ్వరరావుపేట పంపుహౌజ్, రాంపూర్ పంపుహౌజ్‌లలో పనులు జరుగుతున్న తీరును తెలుసుకున్న అనంతరం హైదరాబాద్‌కు వస్తారు.

కాళేశ్వరంలో పర్యటించిన రిటైర్డ్ ఇంజనీర్లు..
నేడు పాలమూరు, డిండి ఎత్తిపోతల పనుల పరిశీలన

కాళేశ్వరం ప్రాజెక్టు లింక్ 1 పనులను ట్రీ (తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం) బృందం పరిశీలించింది. సోమవారం నాడు రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సంగెం చంద్రమౌళి, శ్యాంప్రసాద్‌రెడ్డి మేరెడ్డి, రిటైర్డ్ సిఇలు వెంకటరామారావు, వేణుగోపాలరావు కొండపల్లి, రాంరెడ్డి, సత్తిరెడ్డి తదితరులు హెలిక్యాప్టర్‌లో వెళ్లి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, కన్నెపల్లి పంపుహౌజ్‌లను సందర్శించారు. అనంతరం పనుల జరుగుతున్న తీరుపై ముఖ్యమంత్రికి సమాచారం అందజేశారు. మంగళవారం నాడు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల, డిండి ఎత్తిపోతల పథకం పనుల తీరును పరిశీలిస్తారు. బేగంపేట విమానాశ్రయం నుంచి ఉదయం బయలుదేరి నేరుగా కొల్లాపూర్‌లోని కల్వకుర్తి ఎత్తిపోతల పథకం గెస్ట్‌హౌజ్‌కు చేరుకుంటారు. అనంతరం నార్లాపూర్ రిజర్వాయర్, పంపుహౌజ్, డిండి లిఫ్టు ఆఫ్ పాయింట్, ఏదుల రిజర్వాయర్, పంపుహౌజ్, వట్టెం రిజర్వాయర్, వట్టెం పంపుహౌజ్ పనులు పరిశీలిస్తారు. తర్వాత డిండి ఎత్తిపోతలలో బాగంగా నిర్మిస్తున్న శివన్నగూడెం, గొట్టిముక్కల రిజర్వాయర్ల పనులు చూస్తూ హైదరాబాద్‌కు వస్తారు. ఈ పర్యటనలో సంగెం చంద్రమౌళి, మేరెడ్డిశ్యాంప్రసాద్‌రెడ్డిలతో పాటు రిటైర్డ్ ఇంజనీర్లు, ఇంజనీర్స్ జెఎసి చైర్మన్ తన్నీరు వెంకటేశం, జనార్ధన్, అంజన్‌రావు తదితరులు పాల్గొంటారు.

3, లేదా 4న సిఎం సమీక్ష

ఒక వైపు ముఖ్యమంత్రి కెసిఆర్, మరో వైపు తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్ల ప్రతినిధి బృందం ప్రాజెక్టుల పనులను పర్యవేక్షించిన తర్వాత, హైదరాబాద్‌లో అన్ని ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష జరుపనున్నారు. కాళేశ్వరం, శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకంపై ముఖ్యమంత్రికి క్షేత్రస్థాయి పర్యటనతో వాస్తవ స్థితిగతులు తెలుస్తాయి. ఇదే సమయంలో పాలమూరు రంగారెడ్డి, డిండి, కాళేశ్వరం, సీతారామ ఎత్తిపోతలపై వీరికి రిటైర్డ్ ఇంజనీర్లకు సాంకేతిక, ఆర్థిక విషయాలతో పాటు క్షేత్రస్థాయి వాస్తవ పనుల తీరు తెలుస్తుంది. దీంతో ఆయా ప్రాజెక్టులపై 3 లేదా 4వ తేదీన సమీక్ష కూలంకుశంగా జరిగే అవకాశం ఉంది.

ఫుడ్ ప్రాసెసింగ్‌లో మహిళాబృందాలు

(ఐదో పేజీ తరువాయి)

పంటలు పండించాలని, సాంప్రదాయబద్ధమైన కొన్ని అలవాట్ల విషయంలో రైతుల్లో కొంత మేర మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. రైతులందరూ ఒకే రకమైన పంటలు వేయటం వల్ల జరిగే లాభనష్టాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ తీరుతెన్నులపై, భవిష్యత్తులో అవలంభించాల్సిన విధానాలపై, మహిళా సంఘాలను ఫుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తులలో భాగస్వాములను చేయటంపై, తెలంగాణలోని వివిధ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు సంబంధించి సోమవారం మధ్యాహ్నం ప్రగతిభవన్ లో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో పై అంశాలపై చర్చ జరిగింది. ఎంత ఖర్చు పెట్టడానికైనా ప్రభుత్వం వెనకాడదని, ఉత్తమ స్థాయి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనే ప్రధానమని, ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్లి అధ్యయనం చేసి రావొచ్చని సిఎం కెసిఆర్ సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమకు సంబంధించి ఒక కార్యాచరణ పథకాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. 45 లక్షల మంది సభ్యులున్న 4 లక్షలకు పైగా ఐకెపి మహిళా సంఘాల సభ్యులకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని సిఎం చెప్పారు.

నాటు, కలుపుతీత యంత్రాలపై కార్యాచరణ

కల్తీ విత్తనాల అమ్మకం పూర్తిగా నిషేధించాలని స్పష్టం చేశారు. విత్తన కంపెనీలపై నియంత్రణ ఉండాలన్నారు. నాటు యంత్రాలు, కలుపుతీసే యంత్రాలు, పసుపు రైతులకు ఇవ్వాల్సిన యంత్రాల విషయంలో కార్యాచరణ రూపొందించాలన్నారు. రాష్ట్రాన్ని ఖచ్చితంగా పంటల కాలనీలుగా విభజించాలని, రైతు పండించే ప్రతి పంటకు డిమాండ్ లభించేలా చూడాలన్నారు. ఆహార, వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు విషయాల్లో సరైన గణాంకాలు లేనందున రకరకాల సమస్యలు తలెత్తుతున్నాయని, వీటిని అధిగమించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రైతులను సంఘటిత పరచటం ద్వారానే గొప్ప ఫలితాలు సాధించవచ్చునని మరోమారు స్పష్టం చేశారు. విత్తనాలు విరివిగా అందుబాటులో వుంచడం, అవసరమైన ఎరువులు, క్రిమిసంహారక మందులు అందుబాటులో వుంచడం జరగాలని చెప్పారు ముఖ్యమంత్రి.

అంచెలంచెలుగా పంట కాలనీలపై అవగాహన :
అశోక్ గులాటీతో వర్క్‌షాప్

రాష్ట్రంలో ఎంత ధాన్యం పండుతుంది, ఎంతమేరకు పండ్ల ఉత్పత్తి జరుగుతున్నది, ఏ మేరకు ప్రజల ఆహార అవసరాలు తీరుతున్నవి? అనే విషయాలపై సరైన గణాంకాలు ఉండాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన వన శాఖలు, సంబంధిత ఇతర శాఖలు ఒకదానికి ఒకటి సంబంధ అనుబంధంగా పనిచేస్తే మంచి ఫలితాలొస్తాయన్నారు. దీనికోసం ఏమి చేయాలో ఆలోచించాలన్నారు.అందులో భాగంగానే రైతు సమన్వయ సమితులు ఏర్పాటు చేశామని, వాళ్లకు క్రమపద్ధతిలో శిక్షణనివ్వాలన్నారు. రైతులందరూ ఒకే రకమైన పంట వేస్తే సమస్యలు తలెత్తుతాయి కనుక పంట మార్పిడి కొరకు వాళ్లకు అవగాహన కల్పించాలన్నారు. రైతుల సంప్రదాయబద్ధమైన కొన్ని అలవాట్లలో కొంత మార్పు రావాలని, అందరూ రైతులు ఒకే రకమైన పంట వేస్తే జరిగే లాభనష్టాలమీద చర్చ జరగాలన్నారు. రైతాంగం ఏ పంటలు వేయడానికి అలవాటు పడ్డదో అర్థం చేసుకుని ఒకే సారి వాళ్లమీద మన అభిప్రాయాలను రుద్దకుండా అంచెలంచెలుగా పంట కాలనీల విషయంలో అవగాహన కలిగించాలన్నారు. ముల్కనూరు గ్రామం అనుభవాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రైతులకు పలనా విధంగా నడుచుకుంటే లాభం కలుగుతుందని వ్యవసాయ శాఖాధికారులు నమ్మకం కలిగించగలిగితే బ్రహ్మాండమైన ఫలితాలు వస్తాయన్నారు. వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్త అశోక్ గులాటిని డిల్లీలో కలిసి ఈ విషయాలలో వర్క్ షాప్ నిర్వహించాలని మన రాష్ట్రానికి ఆహ్వానించానని, త్వరలో ఆయన రాష్ట్రానికి వస్తారన్నారు.

మనది కల్తీలేని బ్రాండ్

ఎటువంటి రకమైన వ్యవసాయ ఉత్పత్తినైనా ప్రాసెస్ చేస్తే దాని ధర పెరుగుతుందని సిఎం అన్నారు. ఉదాహరణకు మిరపకాయ నుండి కారంపొడి లేదా పసుపు కొమ్ముల నుండి పసుపు తీసుకోవచ్చునన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ వస్తువు కొనాలన్నా కల్తీ అవుతున్నది. మనం గనక మార్కెట్లో ఒక బ్రాండ్ నేమ్ మన ఫుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తులకు అదీ ప్రభుత్వ పరంగా తయారైన వస్తువన్న నమ్మకం కలిగించాలన్నారు. దీనికోసం ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమను ప్రారంభించాలని, మన ఆలోచనలను కార్యరూపంలో తీసుకుని వచ్చి అమలు పరచాలన్నారు. ఏ ప్రాంతంలో ఎన్ని ఫుడ్ ప్రాసెసింగ్, ఏ రకమైన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు వుండాలో నిర్ణయించాలన్నారు. మన రాష్ట్ర అవసరాలకు సరిపోను మిగిలినవి పక్క రాష్ట్రాల్లో, విదేశాలకు ఎగుమతి చేయాలన్నారు.

కొత్తిమీర కూడా దిగుమతి చేసుకోవడం దురదృష్టం

గ్రామీణ ఆహార అవసరాలతో పాటు, నగరపట్టణ ప్రజల ఆహార అవసరాలకు తగు విధంగా ఉత్పత్తులు జరగాలన్నారు. కూరగాయలు, కొత్తిమీర, జీలకర్ర లాంటివి కూడా దిగుమతులు చేసుకోవడం దురదృష్టమన్నారు. నగరాలు, పట్టణాల దరిదాపుల్లో కూరగాయల పెంపకం జరగాలన్నారు. రాబోయే రెండు సంవత్సరాల్లో నీటి పారుదల ప్రాజెక్టులన్నీ పూర్తయి కోటి ఎకరాలకు పైగా సాగు నీరందుతుందన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల మీద కోట్లాదిమంది అధారపడి వున్నారని, వారి ఆశయాలకు అనుగుణంగా ఆ శాఖలు పనిచేయాలని, దేశం మొత్తంలోనే ఉత్తమమైన వ్యవసాయ, ఉద్యానవన, ఫుడ్ ప్రాసెసింగ్, ఎగుమతులలో తెలంగాణ అగ్రభాగన ఉండాలన్నారు. రైతులను ఆదుకునే విషయంలోయావత్ దేశానికి రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు.

టీమిండియాకు విదేశీ భయం తగ్గుతోంది. ఇప్పుడు వారిది నంబర్ వన్ జట్టు. వారి ఆట చూడముచ్చటగా ఉంటోంది. బౌలింగ్ కూడా ఎంతో మెరుగుపడింది. ఇప్పుడు టీమిండియా ఆటగాళ్లు ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ జట్లపై సులభంగా పోరాటం చేయగలరు. అన్ని విభాగాల్లోను భారత జట్టు స్థిరంగా రాణిస్తోంది.

– ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ అలన్ బోర్డర్



తీపి, చేదు జ్ఞాపకాల భారత్ క్రికెట్ ప్రస్థానం

మన తెలంగాణ/క్రీడా విభాగం: భారత క్రికెట్ చరిత్రలో 2018 తీపి, చేదు జ్ఞాపకాలను సమంగా మిగిల్చింది. సొంత గడ్డపై ఘన విజయాలు సాధించిన భారత జట్టు విదేశీ గడ్డపై మాత్రం ఘోర పరాజయాలను మూట గట్టుకుంది. అయితే ఆస్ట్రేలియాతో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో ఏకంగా రెండు మ్యాచ్‌ల్లో గెలిచి 2018ను ఘనంగా ముగించింది. మెల్‌బోర్న్ వేదికగా జరిగిన బాక్సింగ్‌డే టెస్టులో టీమిండియా 137 పరుగుల తేడాతో చారిత్రక విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఆస్ట్రేలియాపై 2–1 ఆధిక్యంలో నిలిచింది. దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ గడ్డపై పేలవమైన ప్రదర్శనతో నిరాశ పరిచిన కోహ్లి సేన ఆస్ట్రేలియాలో మాత్రం అదర గొట్టింది. తొలి టెస్టులోనే చిరస్మరణీయ విజయం సొంతం చేసుకుంది. రెండో టెస్టులో ఓడినా మళ్లీ మూడో టెస్టులో గెలిచి పైచేయి సాధించింది. గతంలో ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన టెస్టు సిరీస్‌లలో చిత్తు చిత్తుగా ఓడిన టీమిండియా ఈసారి మాత్రం అసాధారణ ఆటతో ఆకట్టుకుంటుంది. ఇప్పటికే సిరీస్‌లో కీలక ఆధిక్యం సాధించి తనకు ఎదురు లేదని నిరూపించింది. 2018 సంవత్సరాన్ని భారత్ చారిత్రక విజయంతో ముగించింది. పటిష్టమైన ఆస్ట్రేలియాపై మూడో టెస్టులో ఘన విజయం సాధించి కొత్త సంవత్సరం పోటీలకు ఆత్మవిశ్వాసంతో సిద్ధమైంది. ఆస్ట్రేలియాపై గెలుపు రానున్న ప్రపంచకప్‌లో భారత ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తుందనడంలో సందేహం లేదు. ఇదే స్ఫూర్తితో చివరి టెస్టులో విజయం సాధించాలనే పట్టుదలతో భారత్ ఉంది.

సొంత గడ్డపై తిరుగులేదు

ఇక, ఈ ఏడాది క్రికెట్ సిరీస్‌లను ఒకసారి పరిశీలిస్తే సొంత గడ్డపై భారత్‌కు తిరుగులేకుండా పోయింది. గతంలో లాగే



ఈసారి కూడా సొంత గడ్డపై జరిగిన సిరీస్‌లలో భారత్ ఘన విజయం సాధించింది. అఫ్గానిస్థాన్‌తో జరిగిన ఏకైక చారిత్రక టెస్టులో భారత్ ఇన్నింగ్స్ తేడాతో జయకేతనం ఎగుర వేసింది. ఈ మ్యాచ్‌లో అజింక్య రహానె సారథ్యంలోని భారత జట్టు మూడు రోజుల్లోనే విజయం దక్కించుకుంది. అఫ్గాన్‌పై భారీ అంచనాలు ఉన్నా భారత్‌కు కనీస పోటీ కూడా ఇవ్వలేక పోయింది. అంతేగాక వెస్టిండీస్‌తో టెస్టు, వన్డే, ట్వంటీ–20 సిరీస్‌లను భారత్ సొంతం చేసుకుంది. రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను 2–0తో క్లీన్ స్వీప్ చేసింది. అంతేగాక వన్డే సిరీస్‌ను 3–1తో గెలుచుకుంది. మూడు మ్యాచ్‌ల టి–20 సిరీస్‌ను 3–0తో గెలుచుకుంది.

ఆసియా కప్‌లో కూడా

దుబాయి వేదికగా జరిగిన ఆసియా కప్‌లో కూడా భారత్ విజేతగా నిలిచింది. ఆరు దేశాలు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో భారత్ ట్రోఫీని గెలుచుకుంది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో భారత్ మూడు వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించి ఆసియా కప్‌ను కైవసం చేసుకుంది. అంతేగాక శ్రీలంక వేదికగా జరిగిన నిదహాస్ ముక్కోణపు సిరీస్‌ను కూడా భారత్ గెలుచుకుంది.

సౌతాఫ్రికా సిరీస్

ఇక, ఈ ఏడాది ప్రారంభంలో దక్షిణాఫ్రికా గడ్డపై జరిగిన సిరీస్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. టెస్టు సిరీస్‌లో టీమిండియా 1–2 తేడాతో ఓటమి పాలైంది. గతంతో పోల్చితే ఈసారి భారత్ సఫారీ గడ్డపై అద్భుత ఆటను కనబరిచింది. అయితే సిరీస్‌ను మాత్రం సొంతం చేసుకోలేక పోయింది. కానీ, వన్డే సిరీస్‌ను 5–1తో గెలిచి చరిత్ర సృష్టించింది. సఫారీ గడ్డపై భారత్‌కు ఇదే తొలి వన్డే సిరీస్ కావడం విశేషం. అంతేగాక టి–20 సిరీస్‌ను కూడా 2–1తో దక్కించుకుంది.

ఇంగ్లండ్‌లో చేదు అనుభవం

అయితే ఇంగ్లండ్ గడ్డపై జరిగిన సిరీస్‌లో మాత్రం భారత్‌కు మరోసారి చేదు అనుభవమే మిగిలింది. ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు, వన్డే సిరీస్‌లో భారత్ ఓటమి పాలైంది. ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భారత్ 1–4 తేడాతో చిత్తు చిత్తుగా ఓడింది. భారీ ఆశలతో బరిలోకి దిగిన భారత్ ప్రత్యర్థి జట్టుకు కనీస పోటీ కూడా ఇవ్వలేక పోయింది. బ్యాటింగ్ వైఫల్యం భారత్‌ను వెంటాడింది. టాప్ ఆర్డర్, మిడిలార్డర్ ఘోరంగా విఫలం కావడంతో సునాయాస లక్ష్యాలను సయితం ఛేదించలేక చతికిల పడింది. వన్డే సిరీస్‌లో కూడా భారత్‌కు ఓటమి తప్పలేదు. అయితే ట్వంటీ–20 సిరీస్‌లో మాత్రం భారత్ 2–1తో విజయం సాధించింది. అంతేగాక ఐర్లాండ్‌తో జరిగిన టి–20 సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. మరోవైపు వరుసగా రెండో ఏడాది కూడా భారత్ టెస్టుల్లో నంబర్‌వన్ ర్యాంక్‌ను కాపాడుకుంది. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో కెప్టెన్ విరాట్ కోహ్లి టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. వన్డేల్లో భారత్ రెండో ర్యాంక్‌లో నిలిచింది. ట్వంటీ–20లో కూడా భారత్ రెండో ర్యాంక్‌ను దక్కించుకుంది.





టీమిండియాకు ఆసీస్ సహ సారథి అభినందనలు



మెల్‌బోర్న్: సరికొత్త చరిత్ర సృష్టించేందుకు కోహ్లి సేన అడుగు దూరంలో నిలిచింది. ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాలుగు టెస్టుల సిరీస్‌లో 2– 1తో ఆధిక్యంలో నిలిచింది. మెల్బోర్న్‌లో జరిగిన మూడో టెస్టులో ఆసీస్‌ను టీమిండియా 137 పరుగుల భారీ ఆధిక్యతతో చిత్తు చేసిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో ఏడేళ్ల బాలుడు ఆర్చీ స్కిల్లర్ ఆసీస్‌కు సహాయ సారథిగా వ్యవహరించిన విషయం తెలిసిందే. మ్యాచ్ ముగిసిన వెంటనే ఆర్చీ మైదానంలోకకి వచ్చి భారత ఆటగాళ్లను అభినందించాడు. హృద్యంగా కరచాలనం చేశాడు. షమీ, ఇశాంత్, రిషబ్ పంత్, పుజారా, అశ్విన్, రోహిత్ శర్మ, సహాయక సిబ్బంది అతని వెన్ను తట్టారు. క్రికెట్ ఆస్ట్రేలియా పంచుకొన్న ఈ వీడియో అందరినీ అలరిస్తోంది. స్కల్లర్ అరుదైన హృద్రోగంతో బాధపడుతున్నాడు. ఆసీస్ తరఫున ఆడాలన్నది అతడి కోరిక. మేక్ ఎ విష్ ఆస్ట్రేలియా సంస్థ క్రికెట్ ఆస్ట్రేలియాతో చర్చించి ఇందుకు ఒప్పించింది. కోచ్ జస్టిన్ లాంగర్ స్వయంగా ఆర్చీకి ఫోన్ చేసి జట్టులోకి తీసుకున్నామని చెప్పాడు. నేథన్ లియాన్‌ను అమితంగా ఇష్టపడే అతనికి లెగ్ స్పిన్నర్ కావాలన్నది కల.



తండ్రయిన రోహిత్ శర్మ

నాలుగో టెస్టుకు దూరం

సిడ్నీ: భారత క్రికెటర్, హిటహ్యాన్ రోహిత్ శర్మ తండ్రయ్యాడు. ఆయన భార్య రితికా సజ్దె పండంటి పాపకు జన్మనిచ్చింది. రితికా బంధువు సీమా ఖాన్ (నిర్మాత సోహాల్ ఖాన్ భార్య) ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వెల్లడించింది. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ ఆడుతున్న రోహిత్ శర్మ తన చిన్నారిని, భార్యను చూసేందుకు భారత్‌కు తిరుగు ప్రయాణమైనాడు. 2015 డిసెంబర్ 15న రోహిత్ తన స్నేహితురాలు, మేనేజర్ రితికాను పెళ్లి చేసుకున్నాడు. ఇటీవల ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైకేల్ క్లార్క్‌తో జరిపిన చాట్‌లో రోహిత్ తొలిసారి తాను తండ్రి కాబోతున్న విషయాన్ని వెల్లడించాడు. తాజాగా ముంబయిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో రితికా పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. కాగా త్వరలో ఆస్ట్రేలియాతో జరగబోయే నాలుగో టెస్టుకు రోహిత్ దూరమయ్యాడు. ప్రస్తుతం రోహిత్ భారత్ బయల్దేరాడని, నాలుగో టెస్టు ఆడడం లేదని బిసిసిఐ అధికారి ఒకరు మీడియాకు చెప్పారు. జనవరి 3నుంచి సిడ్నీ వేదికగా భారత్, ఆస్ట్రేలియాల మధ్య నాలుగో టెస్టు జరగనున్న విషయం తెలిసిందే.

ఐసిసి టి 20 జట్టు కెప్టెన్‌గా హర్మన్ కౌర్

దుబాయి: భారత మహిళా క్రికెటర్ హర్మన్‌ప్రీత్ కౌర్ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి)టి20 జట్టు కెప్టెన్‌గా ఎంపికయింది.ఈ ఏడాదికి గాను అత్యుత్తమ మహిళా క్రికెట్ జట్లను ఐసిసి ఎంపిక చేయగా, అందులో టి20 జట్టుకు హర్మన్ ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా ఎంపికయింది. ఈ జట్లను ఐసిసి సోమవారం ప్రకటించింది. టి20 ఫార్మాట్‌లో భారత్‌నుంచి కౌర్‌తో పాటుగా స్మృతి మంధాన , పూనమ్ యాదవ్‌లకు చోటు దక్కింది. ఇక వన్డే విభాగంలో భారత్‌నుంచి మంధాన, పూనమ్ యాదవ్‌లకు మాత్రమే చోటు దక్కగా, కెప్టెన్‌గా న్యూజిలాండ్ మహిళా క్రికెటర్ సుజీ బేట్స్ ఎంపికయింది. 2018కి గాను క్రీడాకారిణుల ప్రదర్శనలో భాగంగా మీడియా–బ్రాడ్‌కాస్టర్ల సభ్యులతో కూడిన బృందం రెండు అత్యుత్తమ జట్లను విడివిడిగా ఓటింగ్ ద్వారా ఎంపిక చేసింది. గత నవంబర్‌లో జరిగిన మహిళల వరల్డ్ టి20 టోర్నమెంటులో భారత్ సెమీ ఫైనల్‌కు చేరడంలో కౌర్ కీలక పాత్ర పోషించింది. ఆ టోర్నమెంటులో ఆమె 160.5 స్ట్రైక్ రేటుతో183 పరుగులు చేసింది. 2018లో 25 టి 20 మ్యాచ్‌లు ఆడిన కౌర్ 126.1 స్ట్రైక్ రేటుతో 663 పరుగులు సాధించింది. మరో వైపు ఐసిసి టి 20 ర్యాంకింగ్స్‌లో కౌర్ మూడో స్థానంలో కొనసాగుతోంది.



స్మృతి మంధానకు అరుదైనగౌరవం

2018 సంవత్సరానికి గాను భారత మహిళా జట్టు క్రికెటర్ స్మృతి మంధాన వన్‌డే ప్లేయర్ ఆఫ్ ది ఇయర్‌తో పాటుగా ఉమెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును కూడా దక్కించుకొంది. ఈ ఏడాది అద్భుతంగా రాణించిన మంధాన ఒకే క్యాలెండర్ ఇయర్‌లో రెండు ఐసిసి అవార్డులను సొంతం చేసుకున్న తొలి భారతీయ మహిళా క్రికెటర్‌గా అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. ప్రధానంగా వెస్టిండీస్‌లో జరిగిన మహిళా వరల్డ్ టి20 టోర్నమెంటులో భారత్ సెమీ ఫైనల్‌కు చేరడంలో మంధాన ప్రముఖ పాత్ర పోషించింది.ఆ టోర్నమెంటులో 125కు పైగా స్ట్రైక్ రేటుతో 178 పరుగులు సాధించింది. ఈ ఏడాది అద్భుతమైన ఫామ్‌లో ఉన్న మంధాన మొత్తం1291 పరుగులు చేసింది.12 వన్‌డేలకు గాను 669 పరుగులు చేసిన మంధాన 25 టి 20లలో 622 పరుగులు చేసింది. ఈ ఏడాది వరసగా ఆరు మ్యాచ్‌లలో అయిదు అర్ధ సెంచరీలు సాధించడం మరో విశేషం. అదే సమయంలో ఐసిసి ప్రకటించిన అత్యుత్తమ వన్‌డే, టి20 జట్లలో కూడా మంధాన చోటు దక్కించుకుంది.



కోహ్లి, రబడా

టాప్ ర్యాంకులు పదిలం

2018 టెస్టు ర్యాంకులు ప్రకటించిన ఐసిసి

దుబాయి: టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి, దక్షిణాఫ్రికా యువ ఫాస్ట్ బౌలర్ కగిసో రబడాలకు 2018 సంవత్సరం అద్భుతంగా ముగిసింది. ఐ'సిసి టెస్టు ఆటగాళ్ల ర్యాంకింగ్స్‌లో ఈ ఇద్దరూ తమ తమ విభాగాల్లో అగ్రస్థానాలను నిలబెట్టుకున్నారు. మెల్‌బోర్న్‌లో ముగిసిన బాక్సింగ్ డే టెస్టులో ఆస్ట్రేలియాపై తొలి ఇన్నింగ్స్‌లో 82 పరుగులు చేసినప్పటికీ కోహ్లి మూడు పాయింట్లు కోల్పోయినప్పటికీ బ్యాటింగ్‌లో అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. రెండో స్థానంలో ఉన్న కివీస్ కెప్టెన్ కేన్ విలియమ్సన్‌కన్నా కోహ్లి 34 పాయింట్ల ఆధిక్యంలో ఉన్నాడు. ఈ ఏడాది ఇంగ్లాండ్ ఫాస్ట్ బౌలర్ జేమ్స్ ఆండర్సన్‌తో కలిసి సంయుక్తంగా తొలిసారి బౌలింగ్ విభాగంలో అగ్రస్థానంలో నిలిచిన రబడా ఇప్పుడు తన ప్రత్యర్థికన్నా కేవలం ఆరు పాయింట్లు ముందున్నాడు. ఈ ఘనత దక్కించుకున్న అత్యంత పిన్న వయస్కుడిగా నిలిచిన రబడా 178 రోజుల పాటు అదే స్థానంలో కొనసాగడం విశేషం. ఈ ఏడాది అతను 10 టెస్టుల్లో 52 వికెట్లు పడగొట్టి తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. కాగా కోహ్లి సహచరుడు చతేశ్వర పుజారా బ్యాటింగ్ విభాగంలో నాలుగో స్థానాన్ని నిలబెట్టుకోగా, వికెట్ కీపర్ రిషబ్ పంత్ పది స్థానాలు ఎగబాకి 38వ స్థానానికి చేరుకున్నాడు. ఇక మెల్‌బోర్న్ టెస్టులో తొలిసారి జట్టులోకి అడుగుపెట్టిన మయాంక్ అగర్వాల్ రెండు ఇన్నింగ్స్‌లలో అద్భుతమైన ప్రతిభ కనబరచడం ద్వారా 67వ స్థానాన్ని దక్కించుకున్నాడు. ఇక ఇదే టెస్టులో ఆసీస్ బ్యాట్స్‌మెన్‌ను బెంబేలెత్తించి రెండు ఇన్నింగ్స్‌లలో కలిసి 86 పరుగులకు 9 వికెట్లు పడగొట్టి భారత జట్టుకు మరపురాని విజయాన్ని అందించిన జస్‌ప్రీత్ బుమ్రా ఏకంగా 28 వ స్థానంనుంచి 12వ స్థానానికి చేరుకున్నాడు, మహమ్మద్ షమీ 23వ స్థానంలో ఉన్నాడు. కాగా భారత్‌తో సిరీస్‌లో అద్భుతంగా రాణిస్తున్న ఆస్ట్రేలియా బౌలర్ పాట్ కమిన్స్ ఇదివరకున్న ఎనిమిదో స్థానంనుంచి మూడో స్థానానికి ఎగబాకాడు. ట్రావిస్ హెడ్ సైతం ఏడు స్థానాలు ఎగబాకి 56వ స్థానంలో నిలిచాడు.



ధోనీ-పాండ్య వీడియో వైరల్

ముంబయి: టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య సామాజిక మాధ్యమాల్లో ఎప్పుడూ చురుగ్గా ఉంటాడు. పాండ్యతో మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ కలిస్తే సందడే సందడి. క్రికెట్ అభిమానులకు, నెటిజన్లకు బోలెడంత వినోదాన్ని పంచిపెడతారు. ఇప్పటికే వీరిద్దరు కలిసి ఉన్న వీడియోలు, ఫొటోలు ఎన్నోసార్లు వైరల్ అయ్యాయి. ఇప్పుడు తాజాగా వీరిద్దరికి సంబంధించిన వీడియో నెట్టింట చక్కర్లు కొడుతోంది. ధోనీ, పాండ్య కలిసి ఓ వాణిజ్యప్రకటనలో నటించారు. దానికి సంబంధించిన వీడియోనే ఇది. ఇందులో ధోనీ, పాండ్య ఇద్దరు కూడా పల్లెటూరి వాళ్లలాగా కనిపిస్తున్నారు. మోడుబారిన చెట్టెక్కి ఇద్దరూ భోజ్‌పురి భాషలో మాట్లాడుకుంటూ బైనాక్యులర్‌లలో క్రికెట్ మ్యాచ్‌ను చూస్తూ కనిపిస్తారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై క్రికెట్ అభిమానులు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన ఆసియా కప్‌లో భాగంగా పాక్‌తో జరిగిన మ్యాచ్‌లో గాయపడిన పాండ్య ఇటీవలే తిరిగి టీమిండియా జట్టులోకి వచ్చిన విషయం తెలిసిందే.

కోహ్లి.. పుజారాలే తేడా

ఆస్ట్రేలియా కోచ్ లాంగర్

మెల్‌బోర్న్: భారత, ఆస్ట్రేలియా జట్ల మధ్య ప్రధాన తేడా విరాట్ కోహ్లి, చతేశ్వర్ పుజారాలేనని ఆస్ట్రేలియా కోచ్ జస్టిన్ లాంగర్ అన్నాడు. తమ బ్యాటింగ్ లైనప్‌లో ప్రపంచ స్థాయి బ్యాట్స్‌మెన్ లేకపోవడం ఇబ్బందికరంగా మారిందన్నాడు. మెల్‌బోర్న్ వేదికగా జరిగిన మూడో టెస్టులో భారత్ ఆస్ట్రేలియాపై 131 పరుగుల భారీ ఆధిక్యతతో విజయం సాధించి నాలుగు టెస్టుల సిరీస్‌లో 2 –1ఆధిక్యతలో నిలిచిన విషయం తెలిసిందే. కీలకమైన నాలుగో టెస్టు గురువారం సిడ్నీలో మొదలవుతుంది. 'నిజం చెప్పాలంటే ఈ దశలో సిరీస్‌లో ప్రధాన తేడా కోహ్లి, పుజారాలే. మెల్‌బోర్న్ టెస్టులో పుజారా సగటు 53. తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగులు చేసిన కోహ్లి రెండో ఇన్నింగ్గ్ పరుగులేమీ చేయలేదు. దీనినుంచి మేము నేర్చుకున్న పాఠం వారు ఒత్తిడిని అధిగమించగలిగారు. బ్యాటింగ్ ఒక కళ. ఇందులో ఒత్తిడిని ఆస్వాదించడం కీలకం. టెస్టు క్రికెట్‌లో చాలా సమయం ఉంటుంది. ప్రస్తుత టి20 యుగంలో అన్నీ త్వరగా, వెంటనే కావాలి.పైగా స్ట్రైక్ రేట్ గురించి మాట్లాడుతున్నారు. మా కుర్రాళ్లు ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నారు' అని లాంగర్ అన్నాడు.

మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసిఐ) పై పడిన కుంభకోణాల కళంకాన్ని తుడిచేసేందుకు లోక్‌సభ సోమవారం ఇండియన్ మెడికల్ కౌన్సిల్ (ఐఎంసి) సవరణ బిల్లును ఆమోదించింది. నిపుణులైన వైద్య బృందం ఎంసిఐను నిర్వహించేందుకు ఈ బిల్లు వీలుకల్పిస్తుంది. ఈ బిల్లువల్ల వైద్యవిద్యను ఉత్తమరీతిలో క్రమబద్ధీకరించవచ్చు.ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఇందుకు సంబంధించి జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ బిల్లు అమలులోకి వస్తుంది.

విశాల

కోర్టులో సజ్జన్ కుమార్ లొంగుబాటు



న్యూఢిల్లీ: సిక్కులకు వ్యతిరేకంగా 1984లో జరిగిన అల్లర్ల సందర్భంగా ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురి హత్యలకు సంబంధించిన కేసులో యావజ్జీవ కారాగార శిక్షను పొందిన కాంగ్రెస్ పార్టీ మాజీ నాయకుడు సజ్జన్ కుమార్ సోమవారం ఢిల్లీలోని ఒక స్థానిక కోర్టులో లొంగిపోయారు. సజ్జన్ కుమార్‌కు యావజ్జీవ కారాగార శిక్షను విధించిన సందర్భంగా ఢిల్లీ హైకోర్టు డిసెంబర్ 31లోగా లొంగిపోవాలని ఆదేశించిన విషయం తెలిసిందే. కాగా, లొంగిపోవడానికి తనకు మరికొంత వ్యవధి కావాలన్న సజ్జన్ కుమార్ అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చడంతో ఆయన నేడు కోర్టులో లొంగిపోయారు. ఇదే కేసులో పదేళ్ల జైలు శిక్ష పొందిన మరో ఇద్దరు నిందితులు మాజీ ఎమ్మెల్యేలు కిషన్ ఖోఖర్, మహేందర్ యాదవ్ కూడా కోర్టులో నేడు లొంగిపోయారు.

వజ్రం పట్టారు... కోట్లు కొట్టారు!



భోపాల్: కొత్త సంవత్సరం రాక ఆ ఇద్దరు సామాన్య గని కార్మికులను కోటీశ్వరులుగా మార్చేసింది. ఆ ఇద్దరు గని కార్మికులు కనుగొన్న ఒక భారీ వజ్రం రూ.2.55 కోట్ల అదృష్టాన్ని తెచ్చిపెట్టింది. శుక్రవారం మధ్యప్రదేశ్‌లోని పన్నాలో జరిగిన వేలం పాటలో 42.9 క్యారెట్ల ఆ వజ్రం రూ. 2.55 కోట్లకు అమ్ముడయ్యింది. పన్నా జిల్లాలలో చిన్న చిన్న గనులను తవ్వుకోడానికి ప్రభుత్వం అనుమతి ఇస్తుంది. 8x8 మీటర్ల వ్యాసార్థంలో చిన్న గనులు తవ్వుకుని తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి జిల్లా యంత్రాంగం నామమాత్రపు ఫీజుతో భూములు లీజుకు ఇస్తుంది. వజ్రాలకు పేరెన్నిక గన్న పన్నా జిల్లాలో ఇలా గనులను లీజుకు తీసుకుని తమ అదృష్టాన్ని పరీక్షించుకునేవారు వేలల్లో ఉంటారు. అదే కోవకు చెందిన మోతీలాల్, రఘువీర్‌లకు భారీ వజ్రం దక్కి వారి పంట పండింది. పన్నులు, రాయల్టీ అన్నీ పోను వీరిద్దరికీ చెరో రూ. 1.15 కోట్లు లభిస్తాయని అధికారులు చెప్పారు.

కలెక్టర్ కాళ్లకు మొక్కిన రైతు: వీడియో వైరల్



భోపాల్: తన పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని అర్థిస్తూ ఒక రైతు మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ జిల్లా కలెక్టర్ కాళ్ల మీద పడి భోరున విలపించాడు. గత ఆగస్టులో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కోసం డబ్బు కట్టినా ఇంతవరకు పొలంలో దాన్ని అమర్చలేదని, దీంతో తన పంట నాశనం అవుతోందని వాపోతూ ఆ రైతు శివ్‌పురి జిల్లా కలెక్టర్ అనుగ్రహ్ పి కాళ్ల మీద పడి తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. నిమిషం నిడివి గల ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను అతని పొలంలో అమర్చి అతనికి న్యాయం చేశారు. అనిల్ జాదవ్ అనే రైతు జిల్లా కలెక్టర్ కాళ్ల మీద పడగా ఆమె వెళ్లి కారులో కూర్చోవడం, ఒక పోలీసు అధికారి ఆ రైతుకు నచ్చచెప్పడం ఈ వీడియోలో చూడవచ్చు.

విజయవాడ దుర్గగుడిలో భక్తులకు 'డ్రెస్ కోడ్'



హైదరాబాద్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలోగల కనకదుర్గ అమ్మవారి గుడిలో జనవరి 1వ తేదీ నుంచి భక్తులకు డ్రెస్ కోడ్ అమలులోకి రానున్నది. ఈ విషయాన్ని ఆలయ ఇఓ కోటేశ్వరమ్మ సోమవారం తెలిపారు. ప్రతి భక్తుడు, భక్తురాలు తప్పనిసరిగా డ్రెస్ కోడ్ పాటించాలని, అలా పాటించని వారికి ఆలయ దర్శనానికి అనుమతించబోమని ఆమె తెలిపారు. కొత్త డ్రెస్ కోడ్ ప్రకారం మహిళా భక్తులు చీరలు, లెహంగాబ్లౌజ్ లేదా సాంప్రదాయక వస్త్రాలను ధరించాల్సి ఉంటుంది. కొత్త విధానం తెలియక ఆలయానికి వచ్చిన మహిళా భక్తులకు రూ 100 అమ్మవారి చీరను అందచేయడం జరుగుతుందని ఇఓ తెలిపారు. దుస్తులు మార్చుకునేందుకు వీలుగా గదులను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె వివరించారు. కాగా, తిరుమలలో ఇప్పటికే డ్రెస్ కోడ్ అమలులో ఉంది. ఆర్జిత సేవలు, ప్రత్యేక ప్రవేశ టిక్కెట్ల ద్వారా దర్శనానికి వెళ్లే భక్తులు తప్పనిసరిగా డ్రెస్ కోడ్ పాటించే విధానాన్ని టిటిడి ఇప్పటికే అమలులోకి తెచ్చింది.

యుఎఇలో కేరళ యువకుడి ఆత్మహత్య

దుబాయి: యుఎఇలోని రస్ అల్ ఖైమా నగరంలో 35 ఏళ్ల భారతీయుడొకరు తన ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు సోమవారం మీడియా వార్తలు పేర్కొన్నాయి. కేరళకు చెందిన రినేజ్ రవీంద్రన్ అల్ ఫైజ్ ఇండస్ట్రియల్ ఏరియాలోని ఓ కంపెనీలో అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. అతను శనివారం తన రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని చనిపోయి ఉండగా అతని రూమ్‌మేట్ చూసి పోలీసులకు సమాచారం అందించాడు. ఆరోగ్య సమస్యల కారణంగా తాను ఆత్మహత్యకు పాల్పడినట్లు రవీంద్రన్ ఫోన్‌లోని సూసైడ్ నోట్‌లో ఉంది.ఆత్మహత్యకు కారణాలను నిర్ధారించుకోవడానికి దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

నక్సలైట్లకు టోకరా వేసినందుకే 'శిక్ష'!



పాట్నా: పెద్ద నోట్ల రద్దు తర్వాత తమతో కుదుర్చుకున్న "నోట్ల మార్పిడి ఒప్పందాన్ని" ఉల్లంఘించినందుకు బిజెపి ఎంఎల్‌సి రజన్ కుమార్ సింగ్‌ను వదలిపెట్టే ప్రసక్తి లేదని మావోయిస్టులు హెచ్చరించారు. శనివారం రాత్రి బీహార్‌లోని ఔరంగాబాద్ జిల్లా ప్రధాన కేంద్రంలోని దేవ్ ప్రాంతంలో ఎమ్మెల్యే రజన్ కుమార్ నివాసంపై దాడి జరిపి అతని బంధువు నరేంద్ర సింగ్(55)ను కాల్చిచంపిన మావోయిస్టులు ఒక కరపత్రంలో రజన్ సింగ్ తమకు చేసిన మోసాన్ని పేర్కొన్నారు. 2016 నవంబర్ 8న కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్లను రద్దు చేసిన తర్వాత తమ వద్ద ఉన్న రూ.7కోట్ల రద్దయిన పెద్ద నోట్లను రజన్ కుమార్ తీసుకుని కొత్త నోట్లను ఇస్తానని వాగ్దానం చేశాడని మావోయిస్టులు తెలిపారు. తమ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం రజన్ కుమార్ తమకు రూ5 కోట్ల కొత్త నోట్లు ఇచ్చి రూ 2 కోట్లను కమిషన్ చార్జీలుగా తన వద్దే ఉంచుకోవాలి. శనివారం రాత్రి మావోయిస్టులు సృష్టించిన విధ్వంసకాండలో రజన్ కుమార్ ఇంటి బయట ఆపి ఉన్న 10 వాహనాలు దగ్ధమయ్యాయి. ఇల్లు కూడా పూర్తిగా తగలబడి పోయింది. దాడి జరిగిన వెంటనే పోలీసులు హుటాహుటిన అక్కడకు తరలివెళ్లినప్పటికీ ఈ మెరుపు దాడిలో పాల్గొన్న దాదాపు 200 మందికి పైగా మావోయిస్టులను అదుపులోకి తీసుకులేకపోయారు.

సిడ్నీలో...



హైదరాబాద్‌లో...



యావత్ ప్రపంచం నూతన సంవత్సరానికి ఘనస్వాగతం పలికింది. నియాన్‌లైట్ల వెలుగులు, మిరుమిట్లు గొలిపే బాణసంచా కాల్పుల నడుమ స్వాగత సంబురాలు జరుపుతూ 2019కి ఆహ్వానం పలికింది. న్యూజిలాండ్, ఆక్లాండ్, సిడ్నీ తదితర ప్రదేశాల్లో తొలుత వేడుకలు ఆరంభమయ్యాయి. ఇక భారత రాజధాని ఢిల్లీతో పాటు ముంబయి, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో చిన్నా పెద్దా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఒకరికొకరు గ్రీటింగ్స్ చెప్పుకుంటూ ఉత్సాహంగా గడిపారు.

రాజ్యసభలో తలాక్ తకరారు

సెలెక్ట్ కమిటీ కోసం కాంగ్రెస్ పట్టు



న్యూఢిల్లీ : వివాదాస్పద ట్రిపుల్ తలాక్ బిల్లుపై సోమవారం రాజ్యసభ చర్చను చేపట్టలేకపోయింది ట్రిపుల్ తలాక్ సంవిధానాన్ని రద్దు చేసే బిల్లుకు లోక్‌సభ గత వారం ఆమోదం తెలిపింది. రాజ్యసభ ఆమోదం తెలిపితే కానీ దీనికి చట్టబద్ధత కుదరదు. అయితే తాము బిల్లును వ్యతిరేకించడం లేదని, బిల్లు సమగ్రతకు దీనిని సెలెక్ట్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేస్తున్నామని కాంగ్రెస్ నాయకత్వంలో ప్రతిపక్షాలు స్పష్టం చేశాయి. దీనితో చర్చను చేపట్టాలనే ప్రభుత్వ వాదన నెగ్గలేదు. ముస్లిం మహిళల వివాహ హక్కుల పరిరక్షణ బిల్లును న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ సోమవారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. దీనిపై చర్చకు ప్రతిపాదించారు. అయితే తాము ఎంతగా చెపుతున్నా ప్రభుత్వం సెలెక్ట్ కమిటీకి పంపించేందుకు నిరాకరిస్తోందని దీనిని తాము సమ్మతించేది లేదని ప్రతిపక్షాలు స్పష్టం చేశాయి. దీనితో ఈ కీలక బిల్లుపై చర్చ ప్రక్రియలో ప్రతిష్ఠంభన నెలకొంది. సభ ప్రారంభం కాగానే బిల్లుపై ప్రతిపక్ష, అధికార పక్షాల మధ్య తీవ్రవ్యాగ్యుద్ధం జరిగింది. దీనితో తొలుత ఉదయం పూట సభలో ఎటువంటి కార్యకలాపాలకు అవకాశం లేకుండా పోయింది. ఓ వైపు కావేరీ అంశంపై అన్నాడిఎంకె సభ్యులు నిరసనలకు దిగడంతో రెండు సార్లు సభ వాయిదా పడింది. సభ నడిచినంత సేపూ తీవ్ర గందరగోళం నెలకొంది. ఆ తరువాత మధ్యాహ్నం సభ ప్రారంభం కాగానే ప్రభుత్వం ట్రిపుల్ తలాక్ బిల్లుపై చర్చకు సమాయత్తం అయింది. అయితే ప్రతిపక్షాలు అడ్డుకున్నాయి. దీనితో పావుగంట సేపు సభ వాయిదా పడింది. ఆ తరువాత కూడా ఇదే పరిస్థితి ఉండటంతో రెండవ తేదీకి సభ వాయిదా పడింది.

స్క్రూటినీ అవసరం అంతే : ఆజాద్

తాము బిల్లుకు మరింత స్క్రూటినీ అవసరం అని కోరుతున్నామని, అత్యంత కీలకమైన బిల్లు అయినందున క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉందని కాంగ్రెస్ సభాపక్ష నేత గులాం నబీ ఆజాద్ చెప్పారు. సెలెక్ట్ కమిటీతోనే ఇది సాధ్యమవుతుందని అన్నారు. సభలో వివిధ పార్టీలకు చెందిన సభ్యులు సగం మంది పరిశీలన అవసరం అంటున్నారని తెలిపారు. సర్కారు ఎందుకు దీనికి సమ్మతించడం లేదో అర్థం కావడం లేదన్నారు. చట్టం కావడానికి ముందు బిల్లును పార్లమెంట్ సెలెక్ట్ కమిటీ పరిశీలనకు పంపించాల్సి ఉంటుంది. ఇది ఒక సాంప్రదాయంగా ఉంది. దీనిని ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. బిల్లుపై కావాలనే ప్రభుత్వం రాజకీయాలకు దిగుతోందని, దీనిని ప్రతిపక్షాలు ఏవీ అడ్డుకోవడం లేదని, ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని కాంగ్రెస్ పార్టీ నేత ఆనంద్ శర్మ తెలిపారు. బిల్లుకు శాసనపరమైన స్క్రూటిని చేస్తే తప్పేమిటని ప్రశ్నించారు. లోక్‌సభలో అధికార పక్షం తనకు మెజార్టీ ఉందని, పద్ధతి పాటించకుండా నెగ్గించుకుని ఉంటుందని, అయితే ఈ సభలో అది కుదరదని హెచ్చరించారు. రాజ్యసభ రబ్బర్ స్టాంప్ కాదని గుర్తుంచుకోవాలన్నారు.

చర్చిస్తే అభ్యంతరాలు తెలుస్తాయి : మంత్రి

బిల్లుపై సభలో చర్చకు ప్రతిపక్షం ఎందుకు వెనుకాడుతున్నదో అర్థం కావడం లేదని న్యాయశాఖ మంత్రి రవిశంకర ప్రసాద్ పేర్కొన్నారు. కాంగ్రెస్ వారి వాదనను తిప్పికొట్టేందుకు యత్నించారు. ప్రభుత్వం చర్చను కోరుకొంటోందని, దీనితో అందరి సూచనలు సలహాలు వెలువడేందుకు తాము వినేందుకు అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. ఆర్డినెన్స్ తీసుకువచ్చిన తరువాత కూడా దేశంలో ట్రిపుల్ తలాక్ ఉదంతాలు చోటుచేసుకున్నాయి. , నిన్నటికి నిన్న ఇంకో తలాక్ అమానుష రీతిలో జరిగింది. ఇది మామూలు విషయం కాదు. లైంగిక సమానత్వపు విషయం. చర్చిస్తే పోయేదేం లేదు...సంగతులు తెలుస్తాయి. చర్చ తరువాత బిల్లు ఆమోదాన్ని తాము కోరుతున్నట్లు న్యాయశాఖ మంత్రి స్పష్టం చేశారు.

సభను నడపాలని ఉంది : ఉపాధ్యక్షుడు

సభలో తీవ్ర గందరగోళ పరిస్థితుపై సభ ఉపాధ్యక్షులు హరివంశ్ స్పందించారు. తాను కొత్తగా ఈ బాధ్యత తీసుకున్నానని తనకు సభను నిర్వహించాలని ఉందని, అంతా సహకరించాలని, చర్చ జరగనివ్వాలని సూచించారు. మంగళవారం సభకు సంవత్సరాది సెలవు ఇవ్వాలని నిర్ణయించుకున్నాం కదా...ఈ ఏడాదికి ఇది చివరి రోజు ఈ రోజున సభా కార్యక్రమాలు సజావుగా సాగేలా చూడాలని కోరుతున్నట్లు తెలిపారు. గందరగోళం వద్దు, అందరి సహకారం కావాలని చెప్పారు. అయితే సభలో తిరిగి యధావిధిగా సభ్యుల నినాదాలు , గందరగోళం కొనసాగింది. దీనితో సభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు సభా సారధి ప్రకటించారు.

సోనియా, రాహుల్ జోక్యం లేదు


రక్షణ ఒప్పందాలపై మాజీ రక్షణమంత్రి ఎకె ఆంటోనీ



న్యూఢిల్లీ: అగస్టా వెస్ట్‌లాండ్ కేసులో బిజెపి, కేంద్రప్రభుత్వం అబద్ధాలను అల్లుతున్నాయని మాజీ రక్షణమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎకె ఆంటోనీ ఆరోపించారు. యుపిఎ హయాంలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీ ఎన్నడూ ఏ రక్షణ ఒప్పందాల్లోనూ జోక్యం చేసుకోలేదని, ఎలాంటి ఆసక్తి చూపలేదని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంటులో ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఆంటోనీ మాట్లాడుతూ... తను రక్షణమంత్రిగా ఉన్నప్పుడు పూర్తి బాధ్యత తనకే అప్పచెప్పారని అన్నారు. భారతీయ జనతాపార్టీ, కేంద్రం ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తున్నాయని, ఏమీ లేని చోట ఏదో జరిగిందని చెప్పడానికి ప్రయత్నిస్తున్నాయని ఆంటోనీ విమర్శించారు. ఆ ప్రభుత్వమూ, పార్టీ ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతున్నాయని దుయ్యబట్టారు. మేము కాంట్రాక్ట్‌ను రద్దు చేసి, ప్రొసీడింగ్స్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాం. అగస్టా వెస్ట్‌ల్యాండ్‌కు వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం చేసిందేమీ లేదు. కంపెనీకి వ్యతిరేకంగా చర్య తీసుకోవాల్సింది పోయి, అనుకూలంగా వ్యవహరిస్తోంది. ఏదైనా దాచిపెట్టాలని కాంగ్రెస్ అనుకుంటే, సిబిఐ దర్యాప్తుకు ఆదేశించేదే కాదు' అన్నారు. ఆదివారంనాడు కాంగ్రెస్, బిజెపిల మధ్య మాటల యుద్ధం జరిగిన తర్వాత ఆంటోనీ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఆయన ప్రభుత్వం అగస్టా వెస్ట్‌లాండ్ ప్రమోటర్లను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రతిపక్ష కాంగ్రెస్ ఆరోపించింది. అందుకు జవాబిస్తూ కాషాయదళం...అగస్టా వెస్ట్‌లాండ్ ఒప్పందంలో మధ్యవర్తిగా భావిస్తున్న క్రిష్టియన్ మిషెల్‌ను కాంగ్రెస్ పార్టీ వెనకేసుకొస్తోందని, ఈ కేసు దర్యాప్తుకు ఆ పార్టీ ఎందుకు భయపడుతోందని ప్రశ్నించింది.

మిషెల్, కాంగ్రెస్ మైత్రి గాఢమైంది

బిజెపి అధ్యక్షుడు అమిత్ షా



న్యూఢిల్లీ: అగస్టావెస్ట్‌లాండ్ ఒప్పందంలో మధ్యవర్తిగా భావిస్తున్న క్రిస్టియన్ మిషెల్‌కు, కాంగ్రెస్ అగ్ర నాయకత్వానికీ ఉన్న స్నేహం ఇప్పటిది కాదని, కాలపరీక్షకు నిలిచి, ఎంతో కాలంనుంచి గాఢంగా సాగుతోందని బిజెపి అధ్యక్షుడు అమిత్ షా... గాంధీ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని ఘాటుగా విమర్శించారు. ఇదే అంశంపై ఆయన వరసగా ట్వీట్‌లు గుప్పించారు. సోనియాగాంధీపై వేస్తున్న ప్రశ్నల వివరాలు క్రిస్టియన్ మిషల్ తన న్యాయవాదికి ఎందుకు పంపిస్తున్నారు? ఆ వివరాలు నేరుగా శ్రీమతిగాంధీకి అందాలని ఆయన కోరుకుంటున్నారా? అలా ఎందుకు చేస్తున్నారు?...అని అమిత్ షా తన ట్వీట్‌లో నిలదీశారు. ఇక మిషల్ లాయర్ చెప్పింది వింటే నవ్వొస్తుంది. మధ్యవర్తిగా అనుకుంటున్న వ్యక్తి తనకు ఒక పేపర్ పంపించారని, అదేదో మందుల తాలూకు లిస్ట్ అని అనుకున్నానని మిషెల్ న్యాయవాది చెప్పారు. గాంధీ కుటుంబాన్ని ఎద్దేవా చేస్తూ అమిత్ షా... నొప్పిని తగ్గించే జండూ బామ్ గురించి, టైగర్ బామ్ గురించీ మనకు తెలుసు. మరి మధ్యవర్తి కి కావలసిన ఈ ఫ్యామిలీ బామ్ ఏమిటి?...అని అడిగారు. అమిత్ షా మరో ట్వీట్ చేస్తూ... మిషెల్ న్యాయవాదికి ఉన్న కాంగ్రెస్ నేపథ్యం గురించి పదేపదే చెప్పుకోవాలి. ఆయనను కాంగ్రెస్‌నుంచి బహిష్కరించారనడం ఎంత మాత్రం నిజం కాదు. మిషెల్‌కు, సోనియాగాంధీకి మధ్య ఆయన వారధిలా ఉన్నారు... అని పేర్కొన్నారు.అమిత్ షా నాలుగో ట్వీట్ చేస్తూ.... దేశప్రయోజనాలకోసం 2008 నాటి డాక్యుమెంట్ల గురించి మిషెల్ లాయర్ మనకు చెప్పాలి. ఆ డాక్యుమెంట్లలో సోనియాగాంధీ ప్రస్తావన ఉంది...అన్నారు.

ధరలు చెప్పండి... ధైర్యముంటే చర్చకు రండి

రాఫెల్‌పై లోక్‌సభలో ప్రతిపక్షం.. ప్రభుత్వం సంవాదం

న్యూఢిల్లీ : రాఫెల్‌పై సోమవారం లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ దూకుడు పెంచింది. ధరల వివరాలు వెల్లడించాలని పట్టుపట్టింది. చర్చకు సిద్ధమేనా అంటూ దీనికి ప్రభుత్వం బ్రేక్ వేసింది. రాఫెల్ డీల్ వెనుక భారీ స్కామ్ ఉందని, ప్రభు త్వం ఈ యుద్ధ విమానం ధరలను ఎందుకు వెల్లడించడం లేదని ప్రతిపక్షం సభలో ప్రభుత్వాన్ని నిలదీసేందుకు యత్నించింది.

అయితే దీనిని ప్రభుత్వం తిప్పికొట్టింది. రాఫెల్‌పై ఏదో జరిగిందనే చెత్తవాదనలు తప్ప కాంగ్రెస్ మాటలో పసలేదని ప్రభుత్వం ఎదురుదాడికి దిగింది. రాఫెల్‌పై చర్చ జరిగితే సభలో ప్రతిపక్షం ప్రత్యేకించి కాంగ్రెస్ నిలవగలదా? వారు వెన్నుచూపకుండా ఉండగలరా? అని ప్రశ్నించారు. శీతాకాల పార్లమెంట్ సమావేశాల





ఆరంభం నుంచి సభలో కాంగ్రెస్ సభ్యులు ప్రధానంగా రాఫెల్ అం శాన్ని ప్రస్తావిస్తూ వస్తున్నారు. రాఫెల్ డీల్‌పై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) దర్యాప్తునకు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం జీరో అవర్‌లో కాంగ్రెస్ సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ వెల్‌లోకి దూసుకుపోయ్యారు. రాఫెల్‌పై నినాదాలకు దిగారు. కాంగ్రెస్ సీనియర్ నేత మల్లిఖార్జున ఖర్గే రాఫెల్ అంశాన్ని తొలుత లేవనెత్తారు. డీల్‌లో గోల్‌మాల్ జరిగిందని, ఈ జెట్ విమానాలకు ఎంత ధర చెల్లిస్తున్నారో ఎందుకు వెల్లడించడం లేదని ప్రశ్నించారు. బిజెపి సభ్యుల అభ్యంతరాలు, ధ్వనుల మధ్య ఆయన రాఫెల్‌పై జెపిసి దర్యాప్తు జరిపించాలని కోరారు.

దీనికి హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బదులిస్తూ అసత్యాన్ని అదే పనిగా వల్లిస్తూ పోతూ ఉంటే సత్యం కాబోదని, కాంగ్రెస్ వారు వెర్రిభ్రమలకు పోవద్దని చురకలకు దిగారు. రాఫెల్ ప్రస్తావన తరుణంలో సభలో యుపిఎ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ కూడా ఉన్నారు. సభ లోపలనే కాకుండా పార్లమెంట్ వెలుపల కూడా కాంగ్రెస్ శ్రేణులు రాఫెల్ డీల్‌లో స్కామ్ జరిగిందని పేర్కొంటూ నిరసనలకు దిగుతూ వచ్చారు. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ప్రభుత్వం అనుబంధ పద్దులపై చర్చ .జరగాల్సిన సమయంలో కాంగ్రెస్ నేత ఖర్గే తిరిగి రాఫెల్ వివాదాన్ని లేవనెత్తారు. దీనిపై ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ విరుచుకుపడ్డారు. రాఫెల్‌పై ప్రస్తావించడం కాదు, కాంగ్రెస్ పార్టీ అసలు చర్చకు సిద్ధంగా ఉందా? చర్చల మధ్యలోనే సభ నుంచి పారిపోకుండా ఉంటుందా? అని ప్రశ్నించారు. ఇప్పటికిప్పుడు కాంగ్రెస్‌కు ధైర్యముంటే దీనిపై చర్చకు దిగాలని, అప్పుడు ప్రభుత్వం తగు సమాధానానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. చర్చ అంటే జడుసుకుని ఖర్గే సభ నుంచి పారిపోతున్నారని చెప్పారు. రాఫెల్ డీల్‌పై సమగ్ర చర్చ జరిగితే అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని, డీల్‌పై కాంగ్రెస్ పార్టీ బూటకపు ప్రచారానికి దిగుతోందని ఇది తాను నిరూపించగలనని జైట్లీ సవాలు విసిరారు.

Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666